
డా॥ కాచం సత్యనారాయణ
M.A,MSW,PGDCJ,LLB
CMD

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
15-07-2024
సంపుటి : 01 I సంచిక : 72 I పేజీలు : 12 I వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


# సంసారం అప్పుల పాలైంది..

- అప్పుల పాలైన సంసారాన్ని సరిదిద్దుకుంటూ వస్తున్న
- ఏ గూట్లో చెయ్యి పెట్టినా అప్పుల కాగితాలే చేతికొస్తున్నాయి
- తెల్లారే సరికి అప్పులోళ్లు ఇంటి ముందే ఉంటున్నారు
- రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్



**విశ్వంభర, హైదరాబాద్ :**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్రాన్ని అభి వృద్ధి చేయడానికి పదేళ్లు తామే అధికారంలో ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నా ఏమీ చేయలేని వాళ్లు ఇప్పుడు మాట్లాడుతున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నదంతా అమ్ముకుని ఊడ్చి పెట్టేశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 7 లక్షల కోట్ల రూపాయల అప్పు నెత్తిన పెట్టి పోయారన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఏం చేద్దామన్నా అప్పులే కనిపిస్తున్నాయని వాపోయారు. ఏ గూట్లో చెయ్యి పెట్టినా అప్పుల కాగితాలే చేతికొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అప్పుడు ఏడాదికి ఆరున్నర వేల కోట్ల అప్పు కట్టేవాళ్లం, ఇప్పుడు 7వేల కోట్లు నెలకు వడ్డీలే కడుతున్నామని, సంవత్సరానికి 70వేల కోట్లు వడ్డీ కట్టడానికే అవుతోందని కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. అయినా సరే ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ పోతున్నామని తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి.

మిగతా 2 లో

- ఆయన రంగంలోకి దిగకపోతే బీఆర్ఎస్ పరిస్థితి ఏంటీ..?
- ఎవరినీ నమ్మని కేసీఆర్ పార్టీని ఎవరికి అప్పగిస్తారు..?
- ఇంతటి సంక్షోభంలోనూ బయటకు రాని గులాబీ దళపతి
- ఉద్యమ పార్టీపై కేడర్‌లో నీలినీడలు

వ్యూహ - ప్రతివ్యూహాలలో తలపండిన దురంధరుడు, కాకలు తీరిన రాజకీయ యోధుడు, అపర చాణుక్యుడు, మాటల మాంత్రికుడు అని కొనియాడబడిన కేసీఆర్ ఎందుకు నిస్సహాయంగా చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయారు, ప్రత్యర్థులను ఎందుకు దీటుగా ఎదు-ర్కోలేకపోతున్నారు, ఎందుకు ఈ పెనుసంక్షోభం నుంచి బయటపడే మార్గాన్ని కనుగొనలేకపోతున్నారు అనేది చాలామందికి అర్థం కావటంలేదు.



# కేసీఆర్ ఏం చేయబోతున్నారు?

ఫామ్ హౌస్‌ను వదిలితేనే ఫామ్‌లోకి..

**విశ్వంభర, హైదరాబాద్ :**

ఇప్పుడు కేసీఆర్ ఎదుర్కొంటున్న పరిస్థితులు కూడా సామాన్యమైనవి ఏమీ కావు, ఇలాంటి దయనీయ స్థితిలో ఆయనే కాదు మానవమాత్రుడు ఎవరికైనా మైండ్ బ్లాంక్ అవకుండా ఉండదు. ఒకవైపు కూతురు జైలులో మగ్గుతుండటం, మరోవైపు పార్టీనుంచి ప్రవాహంలాగా కాంగ్రెస్‌లోకి సాగుతున్న వలసలు, ఇంకోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసు, విద్యుత్ కొనుగోలులో అవినీతి కేసు, కాళేశ్వరంలో అవినీతి కేసు ఇలా అన్ని దిక్కులనుంచీ అష్టదిగ్బంధనం చేస్తున్నట్లున్న పరిస్థితులు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే ఆయన నిస్సహాయంగా, దిక్కుతోచనట్లుగా ఉండిపోవటంలో ఆశ్చర్యం లేదు.

మిగతా 2 లో

### ఈ స్థితికి కారణం ఎవరు?

అసలు టీఆర్ఎస్ పార్టీ అనేది తెలంగాణ సెంటిమెంట్ అనే పునాదులపైన నిర్మించబడింది. కానీ ఆ సెంటిమెంట్‌నే కాలదన్నుకున్నట్లుగా పార్టీ పేరులోని తెలంగాణ పేరును తీసేసి భారత రాష్ట్ర సమితిగా మార్చటంతో ఆ పునాదులు కదిలినట్లయింది. మరోవైపు, రాష్ట్రంలోని పలువురు ఎమ్మెల్యేలపై అవినీతి, అక్రమాల ఆరోపణలు వచ్చినాకూడా ఏ కారణం చేతనో వారిని మార్చకుండా రెండోసారికూడా కొనసాగించారు. 2023 ఎన్నికలలో ప్రధానంగా దెబ్బతీసిన కారణం ఇదే. ఆ ఎమ్మెల్యేలపై స్థానికంగా ఉన్న వ్యతిరేకత పార్టీపై ప్రతిఫలించింది. అతి కొద్ది స్థానాలలో ఎమ్మెల్యేలను మార్చితే ఆ మార్చిన ప్రతి స్థానంలోనూ బీఆర్ఎస్ గెలవటం ఇక్కడ గమనార్హం.

## బీఆర్ఎస్‌లో హరీశ్‌రావే మంచోడు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశంసలు
- ఆయన బీజేపీలోకి రావాలన్నా రాజీనామా చేయాల్సిందే
- బీజేపీలో బీఆర్ఎస్ ఎల్పీ విలీనం కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా
- కేంద్ర హెూం సహాయ మంత్రి బండి సంజయ్

2 లో..




## 8 ఏళ్లుగా పదవి కోసం ఎదురుచూపు

- ఈసారైనా కాంగ్రెస్ పార్టీ కనికరించేనా..?
- సోనియాగాంధీకి వీరవిధుయుడు
- కానీ పదవులకు నోచుకోని నేత
- వీహెచ్ పదవిపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చ

5 లో..





## చరిత్ర సృష్టించిన ప్రధాని నరేంద్ర మోదీ..

- 100 మిలియన్లు దాటిన ఫాలోవర్ల సంఖ్య
- మోదీని అందుకోలేని ప్రపంచ దేశాధినేతలు
- మోదీనే ఫాలో అవుతున్న అమెరికా అధ్యక్షుడు
- వెనకబడిన మోస్ట్ వాంటెడ్ క్రికెటర్లు

5 లో..

## తెలంగాణ చిచ్చుకు కారణం ఆర్ఆర్‌లే..



- రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి యువతను రెచ్చగొట్టారు
- గతంలో ఏ పరీక్ష రాస్తున్నామని నిరుద్యోగులతో దీక్ష చేశారు..?
- నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా సీఎం తన స్థాయికి దిగజార్చుకున్నారు
- సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్‌పై కేటీఆర్ ఫైర్

2 లో..

## ఇదే చివరి డీఎస్సీ కాదు..

- మరో ఐదారు వేల పోస్టులతో మరో డీఎస్సీ
- నిరుద్యోగులకు నష్టం కలగొద్దనేదే మా ప్రయత్నం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**విశ్వంభర, హైదరాబాద్ :**

డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. డీఎస్సీ నిర్వహణపై మంత్రి కీలక ప్రకటన చేశారు. ఇప్పటికే 11, 062 పోస్టులకు నియామక ప్రక్రియ కొనసాగుతుండగా.. మరో డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పారు. 5-6వేల పోస్టులతో త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇదే చివరి డీఎస్సీ కాదని అభ్యర్థులకు సూచించారాయన. మరో డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, 5 నుంచి 6వేల పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. డీఎస్సీ వాయిదా వేస్తే పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. కాగా, ఈ నెల 18 నుంచి జరగనున్న డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరో డీఎస్సీ నిర్వహిస్తాం అటూ మంత్రి భట్టి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. "రాష్ట్రం తెచ్చుకుంది ఉద్యోగాల కోసమే. అనేక

మిగతా 2 లో



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర | : రూ.108 |
| రిటైల్ | : రూ. 131 |
| స్కిన్ | : రూ. 190 |
| స్కిన్ లెస్ | : రూ.216 |

## దానం.. నీకు సిగ్గు, శరం, లజ్జ ఉందా?

- బీడీలు అమ్ముకునే నీకు ఇన్ని వేల కోట్లు ఎలా వచ్చాయి?
- కేసీఆర్ దయతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచావు
- కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయి నీతులు చెబుతున్నావా..?
- నీ కబ్జాలు అన్ని తెలుసు.. అవన్నీ బయటికి తీస్తాం..
- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫైర్

2 లో..





## నైరుతి రుతుపవనాలపై రైతుల నైరాశ్యం

- వరుణుడి కోసం ప్రత్యేక పూజలు
- ఎండిపోతున్న పంటలు
- వృథా అవుతున్న పంట పెట్టుబడులు
- దేవుళ్లకు మొక్కుతున్న అన్నదాతలు

2 లో..

## వెనక్కి తగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం..

- పెన్షన్ రికవరీలు ఆపండంటూ ఉత్తర్వులు జారీ
- అసెంబ్లీ సమావేశాన్ని నిర్ణయం
- అప్పటి వరకు రికవరీ నోటీసులు ఇవ్వొద్దు
- అధికారులను ఆదేశించిన సీఎస్ శాంతకుమారి

5 లో..



# సంసారం అప్పుల పాలైంది..

(మొదటిపేజీ తరువాయి)

"మీలో ఒకడిగానే నేను ఉంటున్నా. ముఖ్య మంత్రి అయ్యాక నాకు కొమ్ములు వచ్చినట్లు నేను ఏనాడైనా అలా ప్రదర్శించానా? ఇంటికి వచ్చే వాళ్లతో మాట్లాడుతున్నా కదా. అందరినీ కలుస్తున్నా కదా.. కొన్ని అవుతాయి, కొన్ని కావు. పదేళ్లు ఏమీ చేయేనోళ్లు, ఉన్నదంతా అమ్ముకుని ఊడ్చిపెట్టుకుని వెళ్లిపోయినోళ్లు, 7లక్షల కోట్ల రూపాయల అప్పు తెచ్చి నెత్తిమీద పెట్టి దివాళా తీపించారు. ఏం చేద్దామన్నా అప్పులే. ఏ గూట్లో చెయ్యి పెట్టినా అప్పుల కాగితాలే బయటకు వస్తున్నాయి. పొద్దున లేచినప్పటి నుంచి అప్పులోళ్లు ఇంటి ముందు ఉంటున్నారు. బాకీ ఉన్నావు అప్పు కడతావా లేదా అంటున్నారు. గతంలో ఏడాదికి ఆరున్నర వేల కోట్ల రూపాయలు అప్పు కట్టేది ఉండె. ఇవాళ ఈ మొనగాడు చేసిన పనికి ప్రతి నెల 1వ తేదీన 7వేల కోట్ల రూపాయల మిత్తి కడుతున్నాం. ఏడాది తిరిగేలోపు 72వేల కోట్లు వడ్డీ కట్టడానికే అవుతుంది. ఇదీ పరిస్థితి. ఎందుకు ఇవన్నీ చెబుతున్నాను అంటే.. మీ అందరికీ లెక్కలు తెలియాలి. సంసారం అప్పుల పాలైంది. ఈ అప్పుల పాలైన సంసారాన్ని ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ వస్తున్నా. కొంచెం వెనక ముందు అయినా.. మీరంతా ఓపికగా గ్రామాల్లో చెప్పాలి. వచ్చే ఎన్నికలు మీవే. సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు చేయాల్సింది కార్యకర్తలు, జనం మోసినోళ్లు. సర్పంచ్ లను, ఎంపీటీసీలను గెలిపించుకుంటేనే మనం ఉంటాం. మనం దరం కలిసిమెలిసి ప్రభుత్వాన్ని నడిపించుకుందాం, అభివృద్ధి చేసుకుందాం" అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

### ఆ ప్రాంతాన్ని న్యూయార్క్ చేస్తా..

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నగరాన్ని అభివృద్ధి చేస్తుందని, ఇది న్యూయార్క్ నగరానికి పోటీగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. మహేశ్వరం, పరిసర ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు పూల్ చేసిన 25 వేల ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ, మెడికల్ అండ్ హెల్త్ హబ్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్లు, ఇతర అవసరాలకు వినియోగిస్తామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడలో సీఎం రేవంత్ రెడ్డి గీతకార్మి కుల సంక్షేమం, భద్రత కోసం కాటమయ్య రక్షకిట్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంగా రెడ్డి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించే బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలోనే ఉందని గుర్తు చేసిన సీఎం, ఈ ప్రాంతంలో మరో ఫిల్మ్ సిటీని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. రాచకొండ పరిధిలోని మునుగోడు, ఇబ్రహీంపట్నం ప్రాంతాలు సుందరమైన లొకేషన్‌లను కలిగి ఉన్నాయని, హిందీ చిత్ర పరిశ్రమను ముంబై నుంచి ఇక్కడికి తీసుకు రావాలని కోరుకుంటున్నామని ఆయన చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి హైదరాబాద్‌కు అనేక ఐటీ, ఫార్మా కంపెనీలను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభి వృద్ధి జరగలేదని అన్నారు. అమెరికాలోని న్యూ యార్క్ నగరాన్ని తలదన్నేలా రంగారెడ్డి జిల్లా ను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాచ కొండ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దు తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# కేసీఆర్ ఏం చేయబోతున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు ఉద్యమంలో పని చేసిన అనేకమంది నేతలను నిర్లక్ష్యం చేస్తూ, కొత్తగా పార్టీలో వచ్చి చేరిన నాయకులను అందలమెక్కించారు. ఉద్యమ తెలంగాణ నేతలకు కనీసం నామినేటెడ్ పదవులు కూడా ఇవ్వలేదు. బంగారు తెలంగాణ నేతలంటూ వెటకారంగా ఉద్యమ తెలంగాణ నేతలతో పిలవబడే ఈ బీటీ బ్యాచ్‌లో ఇప్పుడు చాలామంది తిరిగి వెనక్కు వెళ్ళిపోతున్నారు. మరోవైపు కేసీఆర్ అహంకారంతో కొందరు కీలక నేతలను దూరం చేసుకోవటంకూడా బాగా దెబ్బకొట్టింది. తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు వంటి నేతలతో రాజీ పడిఉంటే, పది స్థానాలు తప్పకుండా దక్కేవి.

### చంద్రబాబుకు పవన్‌లాగా, కేసీఆర్‌కు ఎవరైనా ఉన్నారా?

ఇటీవల కేటీఆర్ తరచూ ఏపీ రాజకీయాలతో తెలంగాణను పోలుస్తున్నారు. చంద్రబాబు 2019లో 23 సీట్ల అతి తక్కువ స్థాయికి చేరుకున్నా, తిరిగి పుంజుకున్నారని, తాము కూడా తిరిగి పుంజుకుంటామని అంటున్నారు. టీడీపీ లాగా స్థానిక పార్టీలకు మంచి మెజారిటీ వస్తే కేంద్రంలో చక్రం తిప్పవచ్చని వ్యాఖ్యానించారు. ఏపీలో నిజంగానే నాడు చంద్రబాబును జైలులో పెట్టగానే టీడీపీ పరిస్థితి ఇప్పటి బీఆర్ఎస్ లాగానే అగమ్యగోచరంగా ఉండింది. సరిగ్గా ఆ స్థితిలో పవన్ వెళ్ళి జైలులో ఉన్న చంద్రబాబును కలిసి పొత్తు పెట్టుకోబోతున్నాం అని ప్రకటించి తెలుగుదేశంలో నైతిక స్థైర్యం కల్పించటమే కాకుండా, కూటమి గెలుపునకు బీజం వేశారు. అయితే ప్రస్తుతం ఏపీలో నాడు జైలులో ఉన్న చంద్రబాబు కంటే దుర్భర పరిస్థితులను నేడు ఎదుర్కొంటున్న కేసీఆర్‌ను పవన్‌లాగా ఆదుకునే శక్తి ఏమైనా ఉంటే ఆయన కూడా తిరిగి పుంజుకుంటారు. అయితే తెలంగాణలో అలాంటి శక్తి ఎవరికైనా ఉందా అంటే లేదనే చెప్పాలి. ఆ మధ్య బీఎస్పీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టి, మరో బీసీ నేతకు ఉపాధ్యక్ష పదవి ఇచ్చి కేసీఆర్ తప్పుకుంటారని వార్తలు వచ్చాయి. అది

### తక్షణ కర్తవ్యం?

ఇప్పుడు ఆయన ఏమి చేయబోతున్నారు అంటే ఆయన ముందు రెండే మార్గాలు ఉన్నాయి. ఒకటి, పార్టీలో పునరుజ్జీవంకోసం పోరాట స్ఫూర్తితో రంగంలోకి దిగటం, రెండు పార్టీ పగ్గాలను వారసులకు కట్టబెట్టి విశ్రాంతి తీసుకోవటం. రేవంత్ రెడ్డి ఇంకో పది-పదిహేను మంది ఎమ్మెల్యేలను లాగేసినా కూడా పార్టీ నిర్వీర్యమవటం అనేది జరగదు. రాష్ట్రవ్యాప్తంగా బలమైన నిర్మాణం లేకపోవటం పెద్ద లోపమైనాకూడా కార్యకర్తలు, నాయకులు గణనీయంగానే ఉన్నారు. ఇప్పటికీ బలమైన సంప్రదాయ ఓట్ బ్యాంక్ ఉంది. ఇప్పుడు సమస్య ఏమిటంటే ఆయనకు పోరాట స్ఫూర్తి ఉన్నట్టు ఏ కోశానా కనబడటంలేదు. ఎందుకంటే ఆయన ఇంకా ఫామ్ హౌస్ వీడి రావటంలేదు. ఆయన రంగంలోకి దిగి పర్య టనలు ప్రారంభించి ఉపన్యాసాలు మొదలుపెడితే తిరిగి ఫామ్ లోకి వచ్చేస్తారు. ఉపన్యాసాలలో ఆయనను మించినవాడు తెలంగాణలో ఎవరున్నారు! ఆ ఫామ్‌హౌస్‌ను వదిలి రాకపోవటంతో ఫామ్‌లోకి రాలేకపోతు న్నారు. బయటకు రావటానికి ఆయనకు అహం అడ్డువస్తున్నట్లుగా అనిపిస్తోంది. అసలు అసెంబ్లీకే వస్తారో రారో ప్రశ్నార్థకంగా ఉంది. దానినే ఎత్తిపొడుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ వ్యాఖ్యలు చేశారు. మూడు నాలుగు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని అన్నవారు ఇప్పుడు కనబడకుండా పోయారని ఎద్దేవా చేశారు. దానికితోడు కేసీఆర్ పనిచేసే శైలి ఎప్పుడూ కూడా మంత్రాంగం, వ్యూహరచనలేగానీ, క్షేత్రస్థాయిలో నిలబడి పనిచేసిన దాఖలాలు కూడా తక్కువ. ఇప్పుడు ఆయన క్షేత్రస్థాయిలో దిగితేనే ఫలితం ఉంటుంది.



జరిగితే పార్టీలో కొత్త ఉత్సాహం వచ్చేదేమో. కానీ కొన్ని రోజుల తర్వాత అదంతా చల్లారిపోయింది.

### వారసులకు పగ్గాలు?

ఇక కేసీఆర్ ముందున్న రెండో మార్గం వారసులకు పార్టీ పగ్గాలు కట్టబెట్టటం. అయితే ఇక్కడ మరో సమస్య ఉంది. ఆయన వారసుడంటే కేటీఆరే అవుతారు. ఆయనకేమో ఆర్గనైజేనల్ స్కిల్స్ తక్కువ. పదేళ్ళపాటు రాష్ట్ర పరిపాలనలో ఆయన మంచి ముద్ర వేయగలిగారుగానీ, పార్టీ నడిపే వ్యవహారాలలో ఆయనకు దక్షత తక్కువ. అది పుష్కలంగా ఉన్న అల్లుడు హరీష్ రావునేమో కేసీఆర్ నమ్మరు. ఆ మాటకొస్తే, అసలు కేసీఆర్ ఎవరినీ నమ్మరు, ఆయనను ఎవరూ నమ్మరు అని హాస్యంగా బీఆర్ఎస్‌లో అందరూ చెప్పుకుంటారు. మరి ముందుకెళితే గొయ్యి, వెనక్కు వెళితే నుయ్యిలాగా ఉన్న ఈ పరిస్థితిలో అపర చాణుక్యుడు ఏం చేయనున్నారో వేచి చూడాలి.

# బీఆర్ఎస్‌లో హరీశ్‌రావే మంచోడు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశంసలు
- ఆయన బీజేపీలోకి రావాలన్నా రాజీనామా చేయాల్సిందే
- బీజేపీలో బీఆర్ఎస్ ఎల్పీ విలీనం కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా
- కేంద్ర హెూం సహాయ మంత్రి బండి సంజయ్



**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశంసల వర్షం కురిపించారు. హరీశ్ రావు మంచి నాయకుడు అని కొనియాడారు. ఆయన ప్రజల మనిషి అని కితాబిచ్చారు. బీఆర్ఎస్ లో ఒక్క హరీశ్ రావు మాత్రమే మంచి పొలిటీషియన్ అని వ్యాఖ్యానించారు. ఒకవేళ హరీశ్ రావు బీజేపీలో చేరాలన్నా రాజీనామా చేసి రావాల్సిందేనని స్పష్టం చేశారు. హరీశ్ రావే కాదు బీజేపీలోకి ఎవరు వచ్చినా రాజీనామా చేయాల్సిందే అన్నారు. పార్టీలోకి వచ్చే వారిని రాజీనామా చేయించి, గెలిపిస్తామన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ ఎల్పీ విలీనం కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే అన్న ఆయన.. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని తేల్చి చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, వాళ్ల కుటుంబం మీద ప్రజల్లో వ్యతిరేకత ఉంది. హరీశ్ రావు మంచి పొలిటీషియన్. నేను ఓపెన్ గా అన్ని విషయాలు చెబుతా. ప్రజల్లోనూ హరీశ్ కు పేరుంది. ఉద్యమం చేసిన వ్యక్తి. హరీశ్ రావు మా పార్టీలోకి వచ్చినా రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాల్సిందే. ప్రజా బలం ఉంది కాబట్టి ఆయన ఈజీగా గెలుస్తారు. ఆయన మంచి పొలిటీషియన్. అందులో ఏ అనుమానమూ లేదు. చిల్లర చిల్లరగా మాట్లాడడు. ఆయనేమీ నాకు దగ్గర కాదు. నాతో ఎప్పుడూ మాట్లాడింది లేదు.

### కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామంటున్నారు

"కాంగ్రెస్, బీఆర్ఎస్ నాటకం ఆడుతున్నాయి. కేసీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. కాంగ్రెస్ లో చేరుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆలోచించాలి. మీకు ఏ పార్టీని చూసి ఓటు వేశారు? ఏ పార్టీ సింబల్ మీద ఓటు వేశారు? నియోజకవర్గం అభివృద్ధి కోసమే కాంగ్రెస్ లోకి వెళ్తున్నామని ఎమ్మెల్యేలు కామన్‌గా చెబుతున్న డైలాగ్. ప్రజలేమీ పిచ్చోళ్లు కాదు. ఆస్తులు కాపాడుకోవడం కోసం, అక్రమ ఆస్తులు సంపాదించుకోవడం కోసం కామన్ డైలాగ్ చెప్పి పార్టీ మారిపోతున్నారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అవుతుందని ఒక తప్పుడు ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ ప్రభుత్వం.. అక్రమ కేసులు పెట్టి బీజేపీ కార్యకర్తలను వేధించింది. జైలుకి పంపింది. దాన్ని ఏ బీజేపీ కార్యకర్త మర్చిపోడు. బీఆర్ఎస్ ను తెలంగాణ ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదు. బీఆర్ఎస్ గురించి ప్రజలు ఆలోచన చేయడం లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయం బీజేపీనే అని ప్రజలు భావిస్తున్నారు. అధికార పార్టీ ఎన్ని అబద్ధాలు సృష్టించినా, ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి వేయాల్సిన ఓటు మేము పొరపాటున కాంగ్రెస్ కు వేశామని తెలుసుకున్న ప్రజలు.. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించారు" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.

# తెలంగాణ చిచ్చుకు కారణం ఆర్ఆర్‌లే..

- రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి యువతను రెచ్చగొట్టారు
- గతంలో ఏ పరీక్ష రాస్తున్నామని నిరుద్యోగులతో దీక్ష చేశారు..?
- నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా సీఎం తన స్థాయికి దిగజార్చుకున్నారు
- సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్‌పై కేటీఆర్ ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. శనివారం జేఎన్టీయూలో నిర్వహించిన ఓ సదస్సులో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీసాయి. గ్రూప్ వన్ మెయిన్స్ రేషియోను 1:100 చేయాలని, గ్రూప్ 2 తోపాటు డీఎస్సీ కూడా వాయిదా వేయాలని నిరుద్యోగులు దాదాపు 20 రోజులుగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆందోళనలపై సీఎం స్పందిస్తూ... ముగ్గురు దీక్షలకు కూర్చున్నారు కానీ వారిలో ఒక్కరు కూడా ప్రభుత్వ ఉద్యోగానికి అప్లై చేసినవాళ్లు కాదు, రాజకీయ ప్రయోజనాల కోసం, తమ కోచింగ్ సెంటర్ కి లాభాల కోసం దీక్ష చేస్తున్నవారే అని సీఎం అన్నారు.సీఎం రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలు నిరుద్యోగుల ఆందోళనలకు మరింత ఆజ్యం పోసినట్టయ్యాయి. ఆయన చేసిన వ్యాఖ్యలకి నిరసనగా శనివారం రాత్రి అశోక్ నగర్, దిల్ సుఖ్ నగర్, ఎల్బీ నగర్ తోపాటు పలుచోట్ల అభ్యర్థులు రోడ్డెక్కారు. సీఎంకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్లుపైనే బైఠాయించారు. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ గంటలతరబడి నిలిచిపోయింది. భారీగా పోలీసులు మోహరించి అభ్యర్థులను చెదరగొట్టారు. ఆదివారం కూడా ఆందోళనలు కొనసాగిన నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు.

### నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా సీఎం తన స్థాయికి దిగజార్చకున్నారు

నిరుద్యోగ యువకులు, విద్యార్థులపై చేసిన రేవంత్ అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా ముఖ్యమంత్రి తన స్థాయికి దిగజారి, అత్యంత దివాళకోరుతనంతో మాట్లాడారన్నారు. నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్న మోతీలాల్ ని అవమానించేలా మాట్లాడారన్నారు. అశోక్ నగర్ కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఉద్యోగాలు సంపాదించుకున్న రేవంత్ రెడ్డి అదే కోచింగ్ సెంటర్లను, వారిని అవమానించేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఈగోకి పోకుండా నిర్ణయాలు తీసుకోవాలి...

మమ్మల్ని దించి మిమ్మల్ని గద్దెనెక్కించిన అదే యువత ఈరోజు మిమ్మల్ని ప్రశ్నిస్తున్నది. 8 నెలల్లో ఇప్పటిదాకా ఒక్క నోటిఫికేషన్ ఇయ్యని మీరు, మిగిలిన నాలుగు నెలల్లో ఏవిధంగా రెండు లక్షల నోటిఫికేషన్లు ఇస్తారో చెప్పాలి. మిమ్మల్ని వదిలిపెట్టము... క్షేత్రంలో నిలదీస్తాం విద్యార్థులతో నిరుద్యోగులతో కలిసి కొట్లాడుతాం. ఇది రాజకీయ పార్టీల సమస్య కాదు. లక్షలాదిమంది యువతకు సంబంధించిన అంశం. ఈ అంశంలో రేవంత్ రెడ్డి ఈగోకి, బేషజాలకు పోకుండా నిర్ణయం తీసుకోవాలి. కండకావరంతో మాట్లాడడం రేవంత్ రెడ్డి ఆపాలి. రేవంత్ నిరుద్యోగులు విద్యార్థులపై చేసిన తన వ్యాఖ్యలకి క్షమాపణ చెప్పాలి అని కేటీఆర్ అన్నారు.

### నిరుద్యోగాన్ని తీర్చుకోడానికి ఆ ఇద్దరు రెచ్చగొట్టారు..

రాజకీయ నిరుద్యోగులుగా యువతను రెచ్చగొట్టిన రాజకీయ శక్తులు ముమ్మాటికీ రేవంత్, రాహుల్ గాంధీ (ఆర్ఆర్) లే అని కేటీఆర్ అన్నారు. "గతంలో ఏ పరీక్ష రాస్తుండని రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి నిరుద్యోగులతో దీక్ష చేసిండో చెప్పాలి. అశోక్ నగర్ లోని విద్యార్థులను సన్నాసులు అంటున్న రేవంత్... మీరు సన్నాసులా... రాహుల్ గాంధీ సన్నాసులా అనే విషయం చెప్పాలి. అశోక్‌నగర్‌లో.. యూనివర్సిటీలో పిల్లలను ఈడ్చుకుపోతున్న అంశం వాస్తవం కాదా రేవంత్ రెడ్డి చెప్పాలి. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్లుగానే మాట్లాడుతున్నాడు... ఆయన ముఖ్యమంత్రిని అనే విషయాన్ని గుర్తుంచుకొని మాట్లాడితే ఆయనకే మంచిది. రేవంత్ రెడ్డికి సత్తా ఉంటే చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాల పైన, నోటిఫికేషన్ల పైన, జాబ్ క్యాలెండర్ పైన శ్వేత పత్రం ప్రకటించాలి. నిరుద్యోగులు అడుగుతున్న డిమాండ్లను వెంటనే సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలి. గ్రూప్ వన్ మెయిన్స్ రేషియోను 1:100 గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలి. అక్టోబర్ నవంబర్ 2023 లో తెలంగాణ యువతను రెచ్చగొట్టి అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులను నిరుద్యోగులను రెచ్చగొట్టారు. అనేక అవాకులు చవాకులు పేలి, రాజకీయ నిరుద్యోగాన్ని తీర్చుకోవడానికి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి యువతను రెచ్చగొట్టారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఇదే చివరి డీఎస్సీ కాదు..

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమాలు, విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితం తెలంగాణ. యువతకు ఉద్యోగాల కల్పనే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందుకే తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే మొదటి 3 నెలల్లోనే 30వేల మందికి ఉద్యోగాలిచ్చాం. డీఎస్సీ ఆలస్యమైతే పేద విద్యార్థులకు మరింత నష్టం జరుగుతుంది. ప్రభుత్వ స్కూళ్లలో స్టాఫ్ కొరత ఉంది. డీఎస్సీతో ఉద్యోగాలు త్వరగా భర్తీ చేయాలని అనుకున్నాం. విద్యావ్యవస్థ బలోపేతం, పేద విద్యార్థులకు మంచి విద్య అందించాలని డీఎస్సీ ప్రకటించాం. గత ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసింది. పదేళ్లు అధికారంలో ఉన్నా గత ప్రభుత్వం డీఎస్సీ ని నిర్వహించలేదు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేసి ఓట్ల కోసం తాపత్రయపడ్డారు. 5 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిర్వహించనందున మా ప్రభుత్వం రాగానే 11వేలకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చాం. 16వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గుర్తించాం. 19,718 మంది టీచర్లు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాం. ఇప్పటికే 2 లక్షల 500మందికి పైగా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. మొత్తం 2 లక్షల 79 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. డీఎస్సీ పోస్ట్ పోన్ చేయమని కొంతమంది ధర్నాలు చేస్తున్నారు. మా ప్రభుత్వం రాగానే గ్రూప్ 1 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించి రిజల్ట్ ఇచ్చాం. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువకులు నష్టపోయిన విషయాన్ని గుర్తించాం. గ్రూప్ 2 కూడా గత ప్రభుత్వం మూడు సార్లు పోస్ట్ పోన్ చేసింది. గ్రూప్ 3 కూడా నిర్వహించలేకపోతే మళ్ళీ మేం షెడ్యూల్ చేశాం. ఇవన్నీ నిరుద్యోగులకు నష్టం కలగొద్దని మా ప్రయత్నం. ఇవి కాక వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న 13,321 పోస్టులను టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నాం. డీఎస్సీని కూడా పకడ్బందీగా నిర్వహిస్తాం. మరో డీఎస్సీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. త్వరలోనే పోస్టుల సంఖ్యతో నోటిఫికేషన్ విడుదల చేస్తాం. అందరూ మంచిగా ప్రిపేర్ అయ్యి ఉద్యోగాలు సాధించి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కోరుతున్నాం" అని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు.

# దానం.. నీకు సిగ్గు, శరం, లజ్జ ఉందా?

### హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫైర్

**విశ్వంభర, హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైరేంజ్‌లో ఫైర్ అయ్యారు. దానం నాగేందర్ స్థాయి మర్చిపోయి మాట్లాడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ దయతో ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయి నీతులు చెబుతున్నారంటూ మండిపడ్డారు. "దానం నాగేందర్ స్థాయి మర్చి మాట్లాడుతున్నారు. స్థాయికి తగినట్టు మాట్లాడితే మంచిది. 2018 జూన్ 22నాడు బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పుడు చెప్పిన మాటలు గుర్తున్నాయా? కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని చెప్పి, బీఆర్ఎస్‌లో చేరి కేసిఆర్ దయ వల్ల రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచావు. దానం నాగేందర్ నీకు సిగ్గు శరం లజ్జ ఉందా? బీడీలు అమ్ముకునే వ్యక్తి ఇన్ని వేల కోట్లు ఎలా సంపాదించాడు? నీ ఇంటి చుట్టూ, హైదరాబాద్‌లో చేసిన కబ్జాలు అన్ని మాకు తెలుసు.. అవన్నీ బయటికి తీస్తాం. ఎంత మందిని వేధించావో.. వాళ్లంతా మా దగ్గరకు వస్తున్నారు. అమ్ముడు పోయిన నువ్వు నీతులు చెబుతున్నావా? పార్టీ మారిన నేతలందరూ రాజీనామా చేసి మళ్లీ గెలవాల"ని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు.

### ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేసీఆరే సీఎం

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. పార్టీని వీడివెళ్లే వారితో ఎటువంటి నష్టం లేదని, బీఆర్ఎస్ పార్టీకి బలమైన నాయకత్వం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని భరోసాయిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదా వేస్తే ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏంటని ప్రశ్నించారు.

# నైరుతి రుతుపవనాలపై రైతుల నైరాశ్యం

**విశ్వంభర, హైదరాబాద్ :** నైరుతి రుతుపవనాలు ముందుస్తుగా వచ్చినా.. భారీ వర్షాల జాడేలేదు. వరినార్లకు పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వానకాలం సీజ్ ముగుస్తున్నా వాన జాడేలేదంటూ తెలంగాణలో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చాయన్న ఆనందం రైతన్నకు లేకుండా పోయింది. వర్షాలు లేక అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖరీఫ్ కాలం కరిగిపోతున్నా.. వరుణుడు కరుణించడం లేదు. వర్షాలు లేకపోవడంతో బోర్లకు నీళ్లురాక, బావులు ఎండిపోయిన పరిస్థితి నెలకొంది. నారుమళ్లు, ఆరుతడి పంటలు ఇప్పటికే ఎండిపోతున్నాయి. నారుమళ్లు కాపాడుకునేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. ట్యాంకర్లతో నీళ్లు కొని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పెట్టిన పెట్టుబడులే కాకుండా ట్యాంకర్లకు ఎక్స్‌ట్రాగా ఖర్చుచేస్తున్నామని చెబుతున్నారు. ఆరుద్ర దాక వేచి చూస్తాం.. ఆ తర్వాత దేవుడే కాపాడాలంటున్నారు రైతులు. చెరువులకు నీళ్లు తరలించి రైతన్నలను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### పంట పెట్టుబడులు వృథానేనా..?

భారీ వర్షాలు లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు డైలమాలో పడ్డారు. అటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతన్నలు పొలాలను బీడుభూముల కింద వదిలేశారు. వర్షాలు కురుస్తాయని ముందస్తుగా నార్లు వేసిన రైతులు.. అది ముదిరిపోతున్నా.. ఇప్పటికీ వాన జాడలేక ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు ఉంటాయని అధికారులు చెప్పడంతో ముందస్తుగా భారీ ఎత్తున వరి నార్లు పోసిపెట్టుకున్నామని.. నారు టైంలోపు నాటు వేయకుంటే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందంటున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. అయకట్టు ప్రాంతంలోని పొలాలు కూడా దున్నలేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు లేకపోవడంతో ఇప్పటివరకూ పెట్టిన పెట్టుబడులు వృథాగా పోతాయంటూ ఆవేదన చెందుతున్నారు రైతులు.

ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. కర్నూలు జిల్లాలో వర్షాలు కూరవాలని గ్రామంలో ఉన్న నాగదేవతలకు నీటితో అభిషేకాలు చేస్తున్నారు. వర్షం కోసం మొక్కని దేవుడు లేడు. చేయని పూజలు లేవు.. పలకని మంత్రం లేదని నిరుత్సాహాన్ని వ్యక్తబరుస్తున్నారు. భూమి దున్ని విత్తునాటినా వర్షాలు రాకపోవడంతో వానదేవుడి కరుణ కోసం ప్రజలు వివిధ రకాల్లో పూజలు చేస్తున్నారు. ఋతుపవనాల కదలిక ప్రకారం ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభం కావలసి ఉన్నా సరైన సమయానికి వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా త్వరగా వర్షాలు కురవాలని వరుణ దేవుని ప్రార్థిస్తూ, పురాతన ఆచారాలను నమ్ముకుని ప్రత్యేక పూజలు చేస్తున్నామంటున్నారు గ్రామస్తులు. ఇలా తెలుగురాష్ట్రాల్లో వరుణుడి ప్రభావం రైతులపై తీవ్రంగా పడుతోందని చెప్పవచ్చు.

# ఆస్తులు రాయించుకున్నాడు అమ్మని పట్టించుకోవడం లేదు



స్పెషల్ ఫోకస్

**విశ్వంభర, మహబూబాబాద్ :** ఆస్తులు రాయించుకొని అమ్మను పట్టించుకోకుండా వదిలేసి నా ఘటన మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు మండలం, బ్రాహ్మణ కొత్తపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కొండపల్లి అండాళమ్మ భర్త రామారావు 102 సంవత్సరాల వృద్ధురాలు. 1991 సంవత్సరం వరకు ఉమ్మడి కుటుంభం. 30 ఏళ్ల క్రితం తనకున్న 14 ఎకరాలలో 6 ఎకరాలు పెద్ద కొడుకు కొండపల్లి గోపాల కిషన్ రావు , 6 ఎకరాలు చిన్న కొడుకు కొండపల్లి శ్రీనివాస రావుకి పంచి వేసి తన పేరు మీద 2 ఎకరాలు, ఇల్లు ఉంచుకుంది. ఇద్దరు కొడుకుల వేరు కాపురం తరవాత దాదాపు 30 సంవత్సరాలుగు తన పెద్ద కొడుకు కొండపల్లి గోపాల కిషన్‌రావు పట్టించుకోవడంలేదని, తన ఆలన పాలన మొత్తం విస్మరించిండాని వాపోయింది. అప్పటి నుంచి చిన్న కుమారుడు అయిన కొండపల్లి శ్రీనివాసరావు తనని చూసుకుంటున్నాడని ఉద్యోగ రీత్యా హైద్రబాద్‌లో ఉండే వాడు అని, అప్పటి నుంచి తనతో ఉంటున్నాని, కరోనాలో జాబ్ పోవడం పట్ల చిన్న కొడుకు ఆర్థిక పరిస్థితి కూడా సరిగ్గా లేదని, తన కుటుంభం అలాగే పిల్లల పోషణ, చదువులు, వారి భవిష్యత్తుతోపాటు నాకు కూడా నెలకు 20 వేల నుంచి 35 వేల వరకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. నా పేరు మీద ఉంచుకున్న 2 ఎకరాల భూమి అమ్ముకోగా, పొత్తులో ఉన్న ఇంటిని కూడా తన పెద్ద కొడుకు గోపాల కిషన్ రావు పేరు మీద చేయించుకున్నాడని తెలిపింది. నాకు తెలియకుండా నా పేరు మీద ఉన్న భూమిని, ఇంటిని నా సంతకాలు అనుమతి లేకుండా ఏ విధంగా ఆస్తులు మార్పిడి చేస్తారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా ఆస్తుల బదలాయింపు ఎంతవరకు సమంజసం అంటూ తీవ్రవేదన గురయ్యానని తెలిపింది. పలుమార్లు ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఎదుర్కుంటున్నాని, ఆరోగ్యం సహకరించడం లేదని, మందులు కోసమైనా డబ్బులు పంపించాలని తన జాగ్రత్తలు చూసుకోవాలని చెప్పిన కూడా ఒక్కనాడు కూడా నన్ను కొడుకులు పలకరించింది లేదని కన్నీటి పర్యంతమైంది. ఆస్తులు, ఇల్లు అన్నితన పేరు మీదుగా చేయించుకొని నన్ను పట్టించుకోవడం లేదంటూ.. కేవలం ఆస్తుల కోసం మాత్రమే నన్ను మనోవేదనకు గురి చేసాడని తెలిపింది. ఇన్ని సంవత్సరాలుగా తన చిన్న కొడుకు కష్టం అయినా నష్టం అయినా ఎన్ని ఇబ్బందులు పడిన కూడా చూసుకుంటుండని, ఇప్పుడు తన ఆరోగ్యం సహకరించకపోవడం, కుటుంభం బాధ్యతల వల్ల ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నాడని తెలిపింది. ఆస్తులు కోసం మాత్రమే తల్లితండ్రులు అంటూ.. ఆస్తులు పంచిన తరవాత తల్లి తండ్రులను దూరంగా వదిలేస్తున్నారని తెలిపింది. 30 సంవత్సరాలుగా చిన్న కొడుకు దగ్గరే ఉంటున్నాని తెలియజేసింది. నా పోషణ గురించి చూసుకొనే బాధ్యత పెద్ద కొడుకు కూడా ఉందని గత 3 సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాలు ఎమ్మార్వో, ఎంపిడిఓ, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరిగినా లాభం లేకుండా పోయిందని, ఫిర్యాదు చేసిన పత్రాలను కూడా కలెక్టర్ గ్రీవెన్స్ డే లో కూడా ఫిర్యాదు చేశానని తెలిపింది. తనకు ఎలా అయినా నన్ను పోషించే బాధ్యత తీసుకోవాలని, అధికారులు తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రెండు చేతులు జోడించి వేడుకుంది.



## తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు పత్రాలను అందజేత

**ఉద్యమ కారుడుకి న్యాయం జరిగేలా పోరాటం చేస్తా**

**తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డా. కాచం సత్యనారాయణ**

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు గుర్తింపు పత్రాలను ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, వీ3 న్యూస్ ఛానల్ చైర్మన్ డా.కాచం సత్యనారాయణ చైతన్యపురిలో ఆయన కార్యాలయంలో అందజే శారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన జరిగి పది సంవత్సరాలు అయినందున నాటి ఉద్యమంలో జరిగిన సందర్భాలను ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేయడం జరిగింది. తెలంగాణ ఉద్యమంలో జీవితాలను, భవిష్యత్తును కోల్పోయిన తెలంగాణ ఉద్యమకా రులకు ప్రస్తుత ప్రభుత్వంలో సరైన గుర్తింపు ఇవ్వడంతో పాటు, ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. ప్రతి తెలంగాణ ఉద్యమ కారుడుకి న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.



## కురుపాటి ఎల్లయ్యకు ఘన నివాళి

**ఎల్లయ్య కుటుంబానికి డా. కాచం పరామర్శ**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు కురుపాటి జగదీష్ తండ్రి కీ.శే కురుపాటి ఎల్లయ్య సంతాప సభలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు, వీ3 న్యూస్ ఛానల్ చైర్మన్ డా. కాచం సత్యనారాయణ పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీష్ కుటుంభం సభ్యులను డా.కాచం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ స్టేట్ సెక్రటరీ కొదుమూరి దయాకర్ రావు, కూర రమేష్, ఇరుగు శ్రీధర్, మేడికొండ పరమేష్, గంట సుదర్శన్, జోలెపల్లి వెంకన్న, రాజు, కొమ్ము గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ మూడు పెళ్లిళ్లపై లావణ్య కామెంట్స్

**విశ్వంభర, హైదరాబాద్ :** టాలీవుడ్ యంగ్ హీరో రాజ్ తరుణ్ వివాదం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. లావణ్య అనే యువతి హీరో రాజ్ తరుణ్ తనని మోసం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. రాజ్ తరుణ్‌తో 11 ఏళ్ల నుంచి రిలేషన్ ఉన్నానని ..తామిద్దరం గుడిలో పెళ్లి కూడా చేసుకున్నామని చెప్పి పెద్ద షాకిచ్చింది. మధ్యలో ఓ హీరోయిన్ రావడంతో ఆమెతో ఎఫైర్ పెట్టుకుని వెళ్లిపోయాడని చెప్పుకొచ్చింది. రాజ్ తరుణ్ నాకు కావాలని తాను ఆయనతోనే ఉండాలని కోరుకుంటానని లావణ్య స్పష్టం చేసింది. ఓడిపోయిన వైసీపీ అభ్యర్థి ఇంటికి వెళ్లిన టీడీపీ ఎమ్మెల్యే లావణ్య చేసిన ఆరోపణలపై తాజాగా రాజ్ తరుణ్ స్పందించారు. నేను ఒకప్పుడు లావణ్యతో రిలేషన్‌తో ఉన్న మాట వాస్తవమేనని రాజ్ తరుణ్ చెప్పుకొచ్చాడు. అయితే 2016-17 తర్వాత ఆమెతో తనకు ఎటువంటి శారీరక సంబంధం లేదని రాజ్ తరుణ్ క్లారిటీ ఇచ్చారు. ఆమె వ్యక్తిత్వం మంచిది కాదనే దూరంగా ఉన్నానని, ఇండస్ట్రీలో ఉన్న నాకున్న పరువు పోతుందనే ఇన్నాళ్లు తాను సైలెంట్‌గా ఉన్నానని రాజ్ తరుణ్ తెలిపారు. పేర్లు మార్పు.. వైఎస్ చంద్రబాబు, నారా జగన్?? స్టార్ హీరోని చేసిన దర్శకుడిని దారుణంగా అవమానించిన చిరంజీవి..? ఇండస్ట్రీలో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని.. ఆమె ప్రతి విషయానికి బెదిరించేదని.. అందుకే లావణ్య నుంచి దూరంగా ఉంటున్నానని రాజ్ తరుణ్ క్లారిటీ ఇచ్చారు. లావణ్య , మస్తాన్ అనే వ్యక్తితో రిలేషన్‌లో ఉందని, వారిద్దరూ రూంలో కలిసి ఉన్నప్పుడు తాను చూశానని రాజ్ తరుణ్ చెప్పుకొచ్చాడు. లావణ్య మరోసారి రాజ్ తరుణ్‌పై ఆరోపణలు చేసింది. రాజ్ తరుణ్‌కు చాలా మంది అమ్మాయిలతో రిలేషన్స్ ఉన్నాయని తెలిపింది. దీనిలో భాగంగానే బిగ్ బాస్ బ్యూటీ అరియానాతో రాజ్ తరుణ్ ఎఫైర్ నడిపాడాని ఆరోపణలు చేసింది.



వీరిద్దరు కాల్ చేసుకుని మాట్లాడుకునేవారని , ఈ విషయం నటుడు రాజా రవీంద్రకు కూడా తెలుసునని ఆమె చెప్పుకొచ్చింది. తాజాగా మీడియాతో ఆమె మాట్లాడుతూ.. తాను పవన్ కల్యాణ్‌కు పెద్ద ఫ్యాన్‌నని, ఆయన సినిమా విడుదలైన మొదటి రోజు మొదటి షో చూస్తానని.. అలాగే నా కారు వెనుక పవన్ కళ్యాణ్ స్టిక్కర్ తప్పనిసరిగా ఉంటుందని చెప్పుకొచ్చింది. అందుకే న్యాయం కోసం నేను ఆయన వద్దకే వెళ్తానని లావణ్య తెలిపింది. ఏపీలో మరో వరం ప్రకటించిన సీఎం చంద్రబాబు న్యాయం కోసం పవన్ కళ్యాణ్‌ను కలుస్తానన్న లావణ్య .. పవన్ కళ్యాణ్ మూడు పెళ్లిళ్ల పై కూడా షాకింగ్ కామెంట్స్ చేసింది పవన్ కళ్యాణ్ గారు ఇప్పటికే మూడు పెళ్లిళ్లు చేసుకున్నారు. ఇక తన ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చినప్పటికీ వారిని ఆయన కలిసినప్పుడు ఏ విధమైనటువంటి లోటు లేకుండా చూసుకున్నారని లావణ్య పేర్కొంది. కానీ రాజ్ తరుణ్ అలాంటి వ్యక్తి కాదని, కనీసం నేను భోజనం చేయడానికి కూడా డబ్బులు ఇవ్వడని ఆమె ఆరోపించింది. ఏపీలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్‌ను కలిసి తనకు న్యాయం జరిగిలే చూడాలని కోరాతానని లావణ్య తెలిపింది.






# సామాజిక సేవలకు ప్రతిరూపం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

## నేడు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ జయంతి

> ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి. దేశభక్తురాలిగా, సామాజిక సేవా తత్పరురాలుగా ... మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచి పోయారు. తెలుగు ప్రజలు గర్వించ దగిన ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి. వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. మేధావిగా, న్యాయ కోవిదురాలుగా, మానవతా వాదిగా, ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా నిలిచిన ఆ ఉక్కు మహిళ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్. ఒక బాలికగా జాతీయోద్యమానికి ప్రేరేపితురాలై, జాతిపిత, చాచా నెహ్రూ లాంటి జాతీయోద్యమ నేతల మన్ననలను అందుకున్నారు.

గాంధీజీ ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు విరాళాల సేకరణ కోసం కాకినాడ వచ్చినపుడు ఆయన ప్రసంగాన్ని తెలుగులో చేసిన అనువాదానికి గాంధీజీ అభినందనలకు పాత్రు లైనారు. ఆ సందర్భంలో విరాళాలు సేకరించడమే కాక, మహాత్ముడు అడిగితే తన చేతి బంగారు గాజులు కూడా సమర్పించిన త్యాగమయి.

కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రెసు మహాసభలకు టికెట్టు లేకుండా వచ్చిన జవాహర్లాల్ నెహ్రూను అనుమతి లేదని వెనక్కి పంపిన ధీశాలి. దుర్గాబాయ్ చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచు కున్నారు. తన 12 యేండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం చేశారు. ఆమె రాజమండ్రిలో బాలికలకు హిందీలో విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించారు.

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మద్రాసు ప్రెసిడెన్సి (ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్) లోని రాజమండ్రిలో, 1909 జూలై 15 న సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు.

పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసుల వారికీ విద్యాబోధన అందించారు. బెనారస్ విశ్వ విద్యాలయం నుండి మెట్రి క్యులేషన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్.ఎల్.బి పూర్తిచేసింది. న్యాయ శాస్త్ర చదువు పూర్తయ్యాక మద్రాసులో హైకోర్టులో సాధన ప్రారంభించారు. న్యాయ కోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష కూడా అనుభవించారు.

భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళికా సంఘ సభ్యురాలు. ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ కు మొదటి చైర్ పర్సన్ గా వ్యవహరించారు.1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా, ఢిల్లీలో బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పని చేశారు.

ఆమెను భారతదేశంలో సోషల్ సర్వీస్ మదర్‌గా పిలిచేవారు. అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషిచేశారు.

ఆమె ఆధ్వర్యంలో 1937లో చెన్నపట్నంలో (ప్రస్తుత చెన్నై లో) ఆంధ్ర మహిళా సభ స్థాపించబడింది. హైదరాబాద్ లో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు.

ఇప్పటికీ పనిచేసే ఆసంస్థ పేరుతోనే ఆవీధిని పిలుస్తారు. అక్కడ వితంతువులకు,అనాధ స్త్రీలకు చదువు చెప్పించడం, రకరకాల పనులలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ళమీద వారు నిలబడేటట్లుగా తయారు చేసేవారు.

రాష్ట్ర మంతటా ఎన్నో కళాశాలలు, వసతిగృహాలు, నర్సింగ్ హోమ్‌లు, వృత్తి విద్యాకేంద్రాలు నెలకొల్పారు. లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే బాల సంఘాన్నికూడా స్థాపించారు. నర్సింగ్ కాలేజీ లను స్థాపించారు. ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు.

1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయ్ తో జరిగింది. అది ద్వితీయ, అంతరాష్ట్ర, ఆదర్శ వివాహం అయినందున దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లి పత్రంపై నెహ్రూ, ఆచార్య కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు.

దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం బహు అరుదు.

1971లో సాక్షారతా భవన్ ని ప్రారంభించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం దుర్గాబాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, 1971 నెహ్రూ లిటరసీ అవార్డు (వయోజన విద్యా సేవలకు గుర్తింపుగా), యునెస్కో నుండి పాల్ జి. హాఫ్‌మన్ అవార్డు పొందారు.

అసమాన ప్రజ్ఞా పాటవాతో చిర కాలం గుర్తుండే కార్యక్రమాలకు పురుడు పోసిన దుర్గాబాయ్ 1981 మే 9వ తేదీన హైదరాబాదులో మరణించారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**



# కుక్క తోక వంకరే.. ప్రభుత్వానికి పట్టింపేది..!



దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ తెలంగాణాలో మాత్రం కుక్కల సమస్యలు ఎక్కువయ్యాయి. కుక్కలే అని చిన్న సమస్య అని వదిలేస్తే చిన్న పిల్లల ప్రాణాల మీదికి తెస్తుంది.నీ కులం , నా కులం , నీ మతం ,నా మతం అంటూ తేడా లేకుండా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి . ఏదో ఎక్కడో ఒకచోట అనుకుంటే తప్పే రాష్ట్రవ్యాప్తంగా చిన్న పల్లె టూరి నుండి పట్టణం దాకా కుక్కలు లేని గల్లీ , రోడ్లు లేవు . ఇటీవల కాలంలో చూసుకున్నట్లయితే ఎన్నో విషాదకర సంఘటనలు చూసాము.ముఖ్యంగా హైద్రాబాద్ లో పలు చోట్ల కుక్కల దాడిలో ఎంతోమంది పిల్లల ,పెద్దల ప్రాణాలకు మీదికి తెచ్చింది . మరొక చోట ఏకంగా ఒక 4 సంవత్సరాల బాలుడిని ఆడు కుంటుండగా కుక్కలు దాదాపు పదిహేను ,ఇరవై నిమిషాలు దాడి చేసి అతి క్రూరంగా చంపివేసాయి .ఇలా ఏ ఒక్క చోట అనుకుంటే పొరపాటే రాష్ట్రంలో ప్రతి జిల్లాలో , మండలాల్లో ,గ్రామాల్లో ఎక్కడో ఒక చోట కుక్కలు దాడి చేసాయి అనే ఘటనలు చూస్తున్నాం , వృద్ధుడిపై కుక్కలు దాడి , మహిళల వెంటపడి మరి దాడి చేసిన కుక్కలు , స్కూల్ పిల్లల మీద , ఇంటి ముందు ఆడుకుంటున్న పిల్లల మీద అతి కిరాతకంగా ,క్రూరంగా దాడి చేసి ప్రాణాల పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.కుక్కలు దాడి లేని వార్తలను ఏ ఒక్క రోజు కూడా పేపర్ లో కానీ ఛానల్ లో గాని చూడలేకపోతున్నాం . నిత్యం కుక్కలు చేసే దాడుల వల్ల ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఒక వీధిలో , చౌరస్తాలో మనుషులు ఉండే కన్నా కుక్కలు అధిక సంఖ్యలో తిరుగుతున్నాయి.ఒక పది ఇల్లులు దాటి మన ఇంటికి వెళ్ళడానికి పది నుండి పదిహేను కుక్కలను దాటుకొని భయం భయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.ఇలా తెలంగాణ రాష్ట్రంలో చాలా చోట్ల ప్రతి నిత్యం జరుగుతున్నా సంఘటనలపై ఎన్ని కేసులు పెట్టిన ,పిర్యాదు చేసిన వాటిపై చర్యలు తీసుకోవడానికి , నియంత్రించడానికి మాత్రం అటు అధికారులు , ఇటు ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు దారుణమైన నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారు . ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కోర్ట్ లను సంప్రదించగా వాటిపై చర్యల చేపట్టాలని పదే పదే చెప్పిన కూడా ప్రభుత్వానికి చలనం లేకుండా పోయింది. దాదాపుగా రాష్ట్ర వ్యాప్తంగా కుక్కలు దాడి ఘటనలో 280 కేసులకు పైగా నమోదు అవ్వగా .. దాడి చేసిన తరవాత కంప్లైంట్ చేయని ఇంకా వందల కేసులు అలానే ఉన్నాయి. మరో వైపు మేము మేధావులము అంటూ , నోరు లేని జీవులపై క్రూరంగా దాడి చేయడం సిగ్గు చేటు అంటూ జంతు ప్రేమికుల గొంతులు మొరుగుతున్నాయి. చిన్న పిల్లల ప్రాణాలు పోతుంటే లేవని గొంతులు ఆత్మరక్షణ కొరకు దాడి చేస్తే జీవహింస అంటూ, క్రూరంగా సాదు జంతువులు పై దాడి చేస్తున్నారని మండి పడుతున్నారు.మా ఇంట్లో పిల్లలకి ,మా కుటుంబాల్లోని వ్యక్తులపై దాడి చేస్తే మాత్రం స్పందించని జంతు ప్రేమికులు ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం , ప్రజా ప్రతినిధులు , అధికారులు కుక్కలను నియంత్రించే దిశగా చర్యలు చేపట్టి త్వరితగతిన ఒక నిర్దిష్టమైన కార్యాచరణ మొదలు పెట్టి సమాజంలో మంచి వ్యవస్థను నిర్మించడానికి కృషి చేసేలా ప్రయత్నం చేయండి..మనం అడవుల్లో లేము జంతువులు చేసే దాడులు భరించడానికి ప్రజా సత్సంబంధాలు కలిగి ఉన్న సమాజంలో ఉన్నాము.ఇది నీ సమస్య.., నా సమస్య కాదులే , మనకెందుకులే అనుకుంటే ఈరోజు నావంతు వచ్చింది .. రేపు నీ వంతు కాదని చెప్పగలవా..కుక్కలేమి చేస్తాయి అనుకుంటే తప్పే .. ఒకసారి చిన్న చిన్న గాయాలే మనిషి ప్రాణాలను కోల్పోయే ప్రమాదం ఉంది .ఎంత మంచిగా కుక్కలను చూసుకున్న ,సాదుకున్న వాటి బుద్ధి కుక్క తోక వంకర లానే ఉంటుంది.. కానీ మనం మనుషులం మీరు అర్థం చేసుకుంటారు అని మనమంతా మన పిల్లల గురించి , మన కుటుంబాల గురించి కుక్కల దాడి నుండి రక్షించుకునే బాధ్యత మనందరి మీద ఉంది..జంతువులను సంరక్షించడం , ప్రేమించడం ప్రతి ఒక్కరి బాధ్యత... రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకునే బాధ్యత , భద్రత ప్రభుత్వం చేతుల్లోనే ఉంది.






**- ఏలే మహేష్ నేత**
**సీనియర్ జర్నలిస్ట్ , V3 న్యూస్ ఛానల్**
**9705646377**

# హుస్సేన్ సాగర్‌లో నేటి నుంచి మాన్ సూన్ రెగట్టా ప్రారంభం

**విశ్వంభర, హైదరాబాద్ :** హుస్సేన్ సాగర్‌లో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్, యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మాన్ సూన్ రేగట్టా 15 వ ఎడిషన్ ఈనెల 15 న ప్రారంభం కానుందని తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుహైమ్ షేక్ ఆదివారం విలేకరులతో తెలిపారు. అయన మాట్లాడుతూ.. 2009 నుంచి 15 ఏళ్ల పాటు విరామం లేకుండా భారత్‌లో సుదీర్ఘంగా నడుస్తున్న జూనియర్ నేషనల్ రేగట్టా విజేతకు ప్రతిష్టాత్మక మాన్ సూన్ రేగట్ట ట్రోఫీ, ఈ జాతీయ ర్యాంకింగ్ ఛాంపియన్ షిప్‌లో అత్యంత నిలకడైన నావికునికి ఎస్‌హెచ్ బాబు మెమోరియల్ ట్రోఫీ ఇవ్వబడుతుందన్నారు. జూలై 20న బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా సర్ఫరాజ్ అహ్మద్ ఐఏఎస్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. రేస్ మేనేజ్ మెంట్‌కు శ్రీకాంత్ చతుర్వేది ఇంటర్నేషనల్ రెజ్ ఆఫీసర్ నేతృత్వం వహిస్తారని తెలిపారు.



# ఘనంగా ప్రజాభవన్‌లో బోనాలు





**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రజాభవన్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క ఆహ్వానం మేరకు మహంకాళి బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రజాభవన్‌లో జరిగిన బోనాల జాతర ఉత్సవాలకు కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీ గణేష్ హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మందుల సామేల్ జన్మదిన వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ శాసన సభ్యుడు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యుడు మందుల సామెల్ పుట్టిన రోజు సందర్భంగా తిరుమలగిరి మండల కేంద్రంలో నిర్వహించిన జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు శాలువా కప్పి యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి లడ్డు ప్రసాదం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, యాదగిరిగుట్ట కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ తదితరులు ఉన్నారు.



# ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు :** నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు, డాక్టర్ మల్లు రవి 74వ జన్మదిన వేడుకలు ఆదివారం ఉదయం ఎంపీ నివాసంలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వసుపుల జంగయ్యల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజమాల, శాలువాలతో ఎంపీని ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయించి సంబురాలు చేశారు. ఎంపీ మల్లు రవి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలంటూ ఆ భగవంతుని ప్రార్థించారు. జీవితంలో మరెన్నో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో గోల్డ్ రాము, దుబాయ్ శీను, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన ప్రధాని నరేంద్ర మోదీ..

- 100 మిలియన్లు దాటిన ఫాలోవర్ల సంఖ్య
- మోడీని అందుకోలేని ప్రపంచ దేశాధినేతలు
- మోడీనే ఫాలో అవుతున్న అమెరికా అధ్యక్షుడు
- వెనకబడిన మోస్ట్ వాంటెడ్ క్రికెటర్లు

**విశ్వంభర, ఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ క్రేజ్ నానాటికీ పెరుగుతోంది.. అటు రాజకీయాలైనా.. ఇటు సోషల్ మీడియా అయినా.. తగ్గేదేలే అంటూ మోదీ దూసుకెళ్తున్నారు. ఇప్పటికే.. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టాప్ లో ఉన్నారు. ఏ దేశాధినేతకు లేనంత క్రేజ్.. భారత ప్రధానమంత్రికి నానాటికి పెరుగుతుండటం అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ.. అనతికాలంలోనే సోషల్ మీడియాలో మరో రికార్డును సృష్టించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ లో నరేంద్రమోదీ ఫాలోవర్ల సంఖ్య 100 మిలియన్లు దాటింది.. 100 మిలియన్లకు పైగా ఫాలోవర్లతో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో అత్యధికంగా అనుసరించే ప్రపంచ నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోడీ మరో మైలురాయిని నెలకొల్పారు. పీఎం మోడీ హ్యాండిల్ గత మూడు సంవత్సరాలలో సుమారు 30 మిలియన్ల వినియోగదారులు ఫాలో అవుతున్నారు.. మొత్తం మీద 100 మిలియన్ల మార్క్ దాటడం.. మామూలు విషయం కాదు..

### ఏ నేతకు ఎంత మంది ఫాలోవర్లు..?

వివిధ భారతీయ రాజకీయ నాయకుల సోషల్ మీడియా ఫాలోయింగ్‌లను పోల్చినప్పుడు.. సోషల్ మీడియా ఫాలోవర్ల పరంగా మోడీ ప్రత్యేకంగా నిలుస్తారు. రాహుల్ గాంధీకి 26.4 మిలియన్లు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు 27.5 మిలియన్లు, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌కు 19.9 మిలియన్లు, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి 7.4 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆర్జేడీకి చెందిన లాలూ ప్రసాద్ యాదవ్‌కు 6.3 మిలియన్లు, తేజస్వి యాదవ్‌కు 5.2 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉండగా, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు 2.9 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

### మోడీని అందుకోలేని ప్రపంచ దేశాధినేతలు

ప్రస్తుతం 38.1 మిలియన్ల మంది అనుచరులను కలిగి ఉన్న అమెరికా అధ్యక్షుడు జో బిడెన్, ప్రస్తుత దుబాయ్ పాలకుడు హెచ్‌హెచ్ షేక్ మహ్మద్ (11.2 మిలియన్లు), పోప్ ఫ్రాన్సిస్ (18.5 మిలియన్లు) వంటి ప్రపంచ నాయకుల కంటే ప్రధాని మోదీ చాలా ముందున్నారు. ప్రధాని మోడీకి ఉన్న ప్రజాదరణను చూసి, ప్రపంచ నాయకులు మోడీతో సోషల్ మీడియాలో అనుసరించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే మోదీతో కనెక్ట్ అవ్వడం వలన.. వారి ఫాలోవర్ల సంఖ్య, వీక్షణలు, రీపోస్ట్‌లు గణనీయంగా పెరుగుతాయి. ఇటీవల ఇటలీతో పాటు ఆస్ట్రియాలో కూడా ఇదే కనిపించింది. విరాట్ కోహ్లి (64.1 మిలియన్లు), బ్రెజిలియన్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు నేమార్ జూనియర్ (63.6 మిలియన్లు), అమెరికన్ బాస్కెట్‌బాల్ ప్లేయర్ లెబ్రాన్ జేమ్స్ (52.9 మిలియన్లు) ఫాలోవర్స్ వంటి యాక్టివ్ గ్లోబల్ అథ్లెట్లతో పోల్చినప్పుడు ప్రధాని మోదీకి ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు. టేలర్ స్విఫ్ట్ (95.3 మిలియన్లు), లేడీ గాగా (83.1 మిలియన్లు), కిమ్ కర్దాషియాన్ (75.2 మిలియన్లు) వంటి ప్రముఖుల కంటే కూడా మోదీ ముందున్నారు. ఆసక్తికరంగా, గత మూడు సంవత్సరాలలో, మోడీ హ్యాండిల్ సుమారు 30 మిలియన్ల మంది వినియోగ దారుల అద్భుతమైన వృద్ధిని సాధించింది. అతని ప్రభావం యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లకు కూడా విస్తరించింది.. ఇక్కడ మోదీ వరుసగా 25 మిలియన్లు, 91 మిలియన్ల మంది అనుచరులు ఉన్నారు. 2009లో ప్లాట్‌ఫారమ్‌లో చేరినప్పటి నుంచి మోడీ నిర్మాణాత్మక పోస్టులను స్థిరంగా పోస్ట్ చేస్తున్నారు. ఆయన చురుకైన, ఆకర్షణీయమైన పోస్టులను పోస్ట్ చేస్తారు.. ఇంకా అనేక మంది సాధారణ పౌరులను సైతం అనుసరిస్తారు. వారితో సంభాషణలు (పోస్ట్‌లు - రీపోస్ట్‌లు) చేస్తారు.. వారి సందేశాలకు స్పందించి రీపోస్ట్ చేస్తారు.. ఇంకా ఎవరినీ ఎప్పుడూ బ్లాక్ చేయలేదు. పెయిడ్ ప్రమోషన్‌లు లేదా బాట్‌లను ఆశ్రయించకుండా ప్రధాని మోడీ ఎల్లప్పుడూ ఈ ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగిస్తున్నారు. లోతైన, ఆకర్షణీయమైన పోస్ట్‌ల మిశ్రమంతో ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ఆకర్షించారు. డిజిటల్ రంగంలో అతని పెరుగుదల అతని ప్రభావవంతమైన ఉనికిని ఈ రికార్డు నొక్కి చెబుతుంది. విభిన్న, చైతన్యవంతమైన ఫాలోవర్లతో ప్రధాని మోదీ అనుసరించే విధానం.. ఆయన ఖ్యాతిని మరింత ప్రతిబింబించేలా చేస్తోంది.

## వెనక్కి తగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం..

- పెన్షన్ రికవరీలు ఆపండంటూ ఉత్తర్వులు జారీ
- అసెంబ్లీ సమావేశాన్ని నిర్ణయం
- అప్పటి వరకు రికవరీ నోటీసులు ఇవ్వొద్దు
- అధికారులను ఆదేశించిన సీఎస్ శాంతకుమారి

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ దెబ్బకి వెనక్కి తగ్గింది. పెన్షన్ రికవరీలు ఆపండంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.రికవరీ నోటీసులపై ప్రభుత్వం అధికారులకు స్పష్టతనిచ్చింది. అనర్హులకు లబ్ధి, రికవరీపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని నిర్ణయించినట్లు సీఎస్ శాంతి కుమార్ తెలిపారు. సంక్షేమ పథకాల్లో అనర్హులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ,అర్హులకే లబ్ధి అందేలా త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తాం అని తెలిపారు. మార్గదర్శకాలు ఇచ్చే వరకు రికవరీ నోటీసులు ఇవ్వొద్దు అని ఉత్తర్వుల్లో ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. కాగా, వృద్ధులకు అండగా నిలిచేందుకు కేసీఆర్ ప్రభుత్వం అందజేసిన ఆసరా పింఛన్లను వెనక్కి తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైన విషయం తెలిసిందే. రెండేసి పింఛన్లు తీసుకుంటు న్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా శనివారం నాటికి 1,826 మందికి రికవరీ నోటీసులు జారీ చేసినట్లు ప్రకటించింది. పింఛన్లు తొలగించను న్న 1,826 మంది జాబితాను ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు జిల్లాలకు పంపించారు.

## భాగ్యనగరంలో భారీ వర్షాలు..

- పూర్తిగా నిండిన హుస్సేన్ సాగర్
- అలెర్ట్ అయిన జీహెచ్ఎంసీ అధికారులు



**విశ్వంభర, హైదరాబాద్ :** గత నాలుగు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలకు హుస్సేన్ సాగర్ లోకి నీరు వచ్చి చేరుతుంది. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం నగర వ్యాప్తంగా భారీ వర్షం గంటపాటు పడడంతో హుస్సేన్ సాగర్ నీటి మట్టం పూర్తి స్థాయికి చేరింది. దీంతో అప్రమత్తమైన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి నిల్వలను తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. హుస్సేన్ సాగర్ గరిష్ట నీటిమట్టం 514.75 మీటర్లు కాగా ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నీటి మట్టం 513.210 మీటర్లకు చేరుకుంది. ఈ సమాచారం అందుకున్న జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి పరిస్థితిని పరిశీలించారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని,ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జిహెచ్ఎంసి మేయర్ అధికారులను ఆదేశించారు.

# నిధులు తెచ్చే బాధ్యత నాది

- కరీంనగర్ ను అద్దంలా తీర్చిదిద్దుతా
- అభివృద్ధిలో నా మార్క్ చూపిస్తా...
- స్మార్ట్ సిటీ కింద మిగిలిన నిధులు త్వరలోనే మంజూరు చేయిస్తా
- జన్మభూమిని కరీంనగర్ గడ్డ రుణం తీర్చుకుంటా
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



**విశ్వంభర, కరీంనగర్ :** స్మార్ట్ సిటీ మిషన్ పొడిగింపు సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సునీల్‌రావు ఆధ్వర్యంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ కార్పొరేటర్లు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను సన్మానించారు. మాజీ డిప్యూటీ మేయర్లు గుగ్గిళ్ల రమేశ్, అబ్బాస్ షమీ సహా 30 మందికిపైగా కార్పొరేటర్లు హాజరై బండి సంజయ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తో తమకున్న అనుబంధాన్ని పలువురు కార్పొరేటర్లు గుర్తు చేసుకున్నారు. కార్పొరేటర్ స్థాయి నుండి కేంద్ర మంత్రిగా ఎదిగిన నేపథ్యంలో బండి సంజయ్ పడిన కష్టాలను, చేసిన పోరాటాలను ప్రస్తావించారు. తమతో కలిసి కార్పొరేటర్ గా పనిచేసిన సంజయ్ కేంద్ర మంత్రిగా కొనసాగడం గర్వకారణమన్నారు. స్మార్ట్ సిటీ మిషన్ గడువును కేంద్రం పొడిగించినందుకు కార్పొరేటర్లంతా బండి సంజయ్ కు ధన్యవాదాలు తెలిపారు. కేంద్రంతో మాట్లాడి కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన బండి సంజయ్.. 'కరీంనగర్ అభివృద్ధికి నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది. అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత నాది.' అని హామీ ఇచ్చారు. జన్మనిచ్చి నన్ను ఇంత వాడిని చేసిన కరీంనగర్ ను అద్భుతంగా అభివృద్ధి చేసి రుణం తీర్చుకునేందుకు కసితో పనచేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే.. ఇలాంటి సందర్భం వస్తుందని, అందరూ కలిసి సన్మానిస్తారని నేను ఊహించలేదు. ఇదే కార్పొరేషన్ లో నేను రెండుసార్లు కార్పొరేటర్ గా పనిచేసిన నన్ను గుర్తించి సన్మానించడం చాలా సంతోషంగా ఉంది. కార్పొరేటర్‌గా ఎన్నిక కావడం మామూలు విషయం. సమస్యలపై అవగాహన తెచ్చుకుని పరిష్కరించాలంటే కిందిస్థాయి నుండి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వాళ్లకే సాధ్యం. ఇక్కడున్న కార్పొరేటర్లలో భవిష్యత్తులో ఎంపీ, కేంద్ర మంత్రి కావొచ్చు. ఈరోజు దేశమంతా చర్చ జరుగుతోంది. మామూలు కార్పొరేటర్ నుండి కేంద్ర మంత్రి కాగాలరని చర్చ జరుగుతోంది. గతంలో కార్పొరేటర్లందరం కలిసి ఉండేవాళ్లం. రాజకీయాలకు అతీతంగా మాట్లాడుకునే వాళ్లం. కానీ గత కొంత కాలంగా కార్పొరేటర్ల మధ్య గ్యాప్ వచ్చింది. ఇకపై గొడవల్లేకుండా కలిసి పనిచేయాలని కోరుతున్నా. ఇప్పటి వరకు కరీంనగర్ కార్పొరేషన్ కు కేంద్రం పూర్తి స్థాయిలో సహకరించింది. ఇకపై ఎక్కువ నిధులు తెచ్చేందుకు ప్రయత్నిస్తా. ఎందుకంటే గతంలో నన్ను కేంద్రంలో గుర్తుపట్టేవాళ్లు కారు. రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి దిగిపోయాక దేశవ్యాప్తంగా ప్రముఖులు, కేంద్ర మంత్రులు గుర్తుపడుతూ చాలా పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని చెబుతున్నారు. రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వం, కార్పొరేటర్ల సహకారంతో నా మార్క్ ఏందో చూపిస్తా. కార్పొరేషన్ ను వదిలే ప్రసక్తే లేదు. అన్ని విధాలా అభివృద్ధి చేస్తా. పేరు కోసం పనిచేయడం లేదు. నాకు జన్మనిచ్చిన ఈ గడ్డ కోసం కార్పొరేషన్ ను అభివృద్ధి చేస్తా...గతంలో అమ్రుత్ 1 కింద 132 కోట్లు వచ్చాయి. అందులో కేంద్రం వాటా రూ.66కోట్లు. ఆ నిధులవల్లనే నిరంతరం నీళ్లు ఇవ్వగలుగుతున్నాం. ఈ మధ్య అమ్రుత్ 2 కింద మరో 147 కోట్లు మంజూరైతే. కేంద్రం తన వాటా కింద 73.5 కోట్లను ఇప్పటికే విడుదల చేసింది. స్మార్ట్ సిటీ మిషన్ కింద మొత్తం 934 కోట్లు మంజూరైతే.... అందులో 765 కోట్లు ఇప్పటికే వచ్చాయి. ఇంకా 176 కోట్లు రావాల్సి ఉంది. అందులో స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ కింద 100 కోట్లదాకా రావాలి. కేంద్రం నుండి 70 కోట్లు వస్తాయి. కేంద్రం నుండి ఆ నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది.కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించండి. వాటి అమలుకోసం నిధులు తీసుకొస్తా, అయితే మీరు ఒక్కటి గుర్తుంచుకోవాలి. కేంద్రం నేరుగా నిధులివ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన, వాటా ఉంటేనే కేంద్రం నిధులు ఇవ్వగలుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. నేరుగా కేంద్రం నిధులిచ్చే అవకాశమే ఉంటే కరీంనగర్ ను అద్దంలా తీర్చిదిద్దేవాడిని. మీకు ఇంకో 7 నెలల పదవీ కాలం ఉంది. కష్టపడి పనిచేయండి. మళ్లీ అందరూ గెలవాలని కోరుకుంటున్నా. ఎన్నికలప్పుడు మాత్రం నా పార్టీ గెలవాలనుకుని పనిచేస్తా. కోపాన్ని వీడండి. గొడవలకు తావివ్వకుండా కలిసి పనిచేయండి. మీరు నవ్వుతూ అందరితో ఐక్యంగా ఉంటూ పనిచేయండి. కసురుకుంటే మంచి ఫలితం రాదు.. తప్పకుండా కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధికి క్రుషి చేయండి. నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది. అభివృద్ధి చేసే బాధ్యత నాది. మేయర్ నన్ను ఇటీవల కలిసి కార్పొరేషన్ అభివృద్ధి కోసం అద్భుతమైన ప్రణాళికను మా ముందుంచారు. వాటి అమలు కోసం క్రుషి చేస్తా... బహుశా రాబోయే జనరల్ బాడీ చివరి సమావేశం కాదు.. పేరు కోసమో, మీడియా కోసమో కాకుండా ప్రజల కోసం చర్చించండి. ప్రణాళిక రూపొందించండి. ప్రజలకు మంచి మెసేజ్ వెళ్లేలా మాట్లాడండి. ఆ ప్రణాళిక అమలు కోసం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లను కలిసి చర్చిస్తా. నిధులు తీసుకొచ్చే బాధ్యత మాది.

## 8 ఏళ్లుగా పదవి కోసం ఎదురుచూపు

- ఈసారైనా కాంగ్రెస్ పార్టీ కనికరించేనా..?
- సోనియాగాంధీకి వీరవిధుయుడు
- కానీ పదవులకు నోచుకోని నేత
- వీహెచ్ పదవిపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చ




**విశ్వంభర, హైదరాబాద్ :** పదవి లేని రాజకీయ నాయకుల్ని.. కార్యకర్తలే కాదు.. ఇంట్లో ఇల్లాలు కూడా పట్టించుకోదనే సామెత అందరికీ తెలిసిందే.. పదవి లేకపోతే రాజకీయ నాయకులకి పిచ్చి పట్టినట్లు ఉంటుంది.. వాటి కోసమే పార్టీలను సైతం మారుతుంటారు.. పవర్ కోసం అధినేతలను సైతం దిక్కరిస్తూ ఉంటారు.. ఈ టాపిక్ ఇప్పుడెందుకు మాట్లాడుకుంటున్నామంటే.. తెలంగాణలోని ఓ సీనియర్ నాయకుడు పదవి కోసం ఎనిమిదేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు.. సోనియా గాంధీకి వీరవిధేయుడని చెప్పుకుంటున్నా.. ఆయన్ని మాత్రం కాంగ్రెస్ పార్టీ పక్కన పెట్టేసిందనే ప్రచారం జరుగుతోంది.. ఆయనే వీహెచ్..

### అగ్రనేతలకు పరమభక్తుడు

తెలంగాణ కాంగ్రెస్‌లో వి హనుమంతరావు చర్చ ఆసక్తికంగా సాగుతోంది.. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియాగాంధీలకు ఆయన పరమ భక్తుడని ఆయనకు పేరుంది.. ఒకసారి ఎమ్మెల్సీగా.. మూడు సార్లు రాజ్య సభ్యులుగా.. మంత్రిగా, ఉమ్మడి కాంగ్రెస్ కు పీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన వీహెచ్.. గత కొంతకాలంగా రాజకీయంగా వెనుకపడ్డారు.. యువకులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిస్తూ ఉండటంతో ఆయనకు ప్రాధాన్యత కరువైందని స్వంత పార్టీ నేతలే చెబుతుంటారు.. అయితే గత ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ వస్తుందని ఆందరూ భావించినా.. అధిస్టానం మాత్రం హ్యాండ్ ఇచ్చింది.కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయన వ్యవహారం మళ్లీ తెరమీదకు వచ్చింది.. 50 ఏళ్లుగా ఒకే పార్టీలో ఉన్న తనను కాంగ్రెస్ పార్టీ గుర్తించడంలేదని విహెచ్ తన అనుచరులు వద్ద బాధపడుతున్నారట.. సికింద్రాబాద్ లేదా ఖమ్మం ఎంపీ టిక్కెట్ కేటాయించాలని అధిష్టానాన్ని కోరినా పట్టించుకోలేదని.. టిక్కెట్ ఇచ్చుంటే ఖచ్చితంగా గెలిచేవాడనని ఆయన చెబుతుంటారు.. ఈ క్రమంలో బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్ చేరిలో కేకే.. తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చెయ్యడంతో అది ఖాళీ పడింది.. ఆ స్థానాన్ని తనకు కేటాయించాలని విహెచ్ సోనియా గాంధీని కోరారట. ఎనిమిదేళ్లుగా తనకు పదవిలేదని.. తనకు రాజ్యసభ అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేసినట్లు కాంగ్రెస్ పార్టీలో చర్చ నడుస్తోంది.. అయితే విహెచ్ కు రాజ్యసభ వచ్చే ఛాన్స్ లేదని ఆయన వ్యతిరేకవర్గం ప్రచారం చేస్తున్నారు.. మొత్తంగా విహెచ్‌కు పదవి యోగం ఉందో లేదో చూడాలి మరీ..

## మేడిగడ్డ నుంచి నీళ్లు విడుదల చేయాలి

### మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం పంతాలకు, పట్టింపులకు పోకుండా వెంటనే మేడిగడ్డ ప్రాజెక్ట్ నుంచి నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. సాగునీటికి, తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆషాఢం బోనాల సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో బోనం ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లులేక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజకీయాలను పక్కన పెట్టి రైతుల సంక్షేమం దృష్ట్యా సాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి కష్టం రాకుండా ఆదుకుందని పేర్కొన్నారు. అలాగే ఆలయ కమిటీ ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితి నెలకొంది. మహంకాళి అమ్మ దయతో మంచి వర్షాలు పడాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## ఇదీ.. సాయిరెడ్డి సార్‌తో నాకున్న పరిచయం: శాంతి

**విశ్వంభర, విశాఖపట్నం :** దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్ గా పనిచేస్తూ సస్పెండైన శాంతిపై ఆమె భర్త మదన్ మోహన్ సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. తాను విదేశాల్లో ఉన్న సమయంలో ఏపీలో ఉన్న తన భార్య గర్భం దాల్చిందని అతడు వెల్లడించాడు. తన భార్య గర్భానికి విజయసాయిరెడ్డి కారణమని తీవ్ర ఆరోపణ చేశాడు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఇదే వ్యవహారంపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో, శాంతి మీడియా ముందుకు వచ్చారు. 2013లో తనకు మదన్ మోహన్ తో వివాహం జరిగిందని ఆమె వెల్లడించారు. లా చదువుతుండగానే తమ ఇద్దరికీ పెళ్లయిందని వివరించారు. కానీ పెళ్లయ్యాక మదన్ మోహన్ తనను చాలా హింసించాడని శాంతి ఆరోపించారు. దాంతో 2016లో ఇద్దరం విడాకులు తీసుకుని వేర్వేరుగా ఉంటున్నామని చెప్పారు. పిల్లలు, బంగారం, కారు విషయంలో పరస్పర ఆమోదయోగ్యమైన ఒప్పందం కూడా రాసుకున్నామని తెలిపారు. మదన్ మోహన్ తో విడాకుల తర్వాత తాను సుభాష్ అనే వ్యక్తిని పెళ్లాడానని శాంతి వెల్లడించారు. 2021 వరకు తాను విశాఖలోనే ఉండేదాన్నని పేర్కొన్నారు. తాను మరొకరిని పెళ్లి చేసుకున్నప్పటికీ, మదన్ తనను వేధిస్తుండేవాడని ఆరోపించారు. అమెరికా నుంచి వచ్చాక పిల్లలను మదన్ కు చూపించానని తెలిపారు. డబ్బు కోసమే అతడు ఇలాంటి అనుమానాలు సృష్టించేలా ఆరోపణలు చేస్తున్నాడని వివరించారు. "నేను ఒక ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని కాబట్టి ఇంతమంది నన్ను టార్గెట్ చేశారు. అదే వేరే కులానికి చెందిన దాన్నయితే ఇలా అనగలరా? ఒక ట్రైబల్ అమ్మాయి ఉద్యోగం చేయకూడదా? నేను మంచి బట్టలు వేసుకోకూడదా? నేను నగలు ధరించకూడదా? నేను కష్టపడి న్యాయవాద విద్యను చదివాను, అడ్వొకేట్ గా ప్రాక్టీసు చేశాను. ఒకరి సొమ్ముకు ఆశపడాల్సిన అవసరం నాకు లేదు. ఇక సాయిరెడ్డి సార్ గురించి చెప్పాల్సి వస్తే... ఆయనొక గౌరవనీయ వ్యక్తి. నేను విజయసాయిరెడ్డి సార్ ను మొదటిసారి విశాఖలోనే చూశాను. దేవాదాయ శాఖలో ప్రేమ సమాజం అనే సంస్థ ఉంది. దీని వ్యవహారాలు చూసుకోవాల్సింది అసిస్టెంట్ కమిషనర్. ఆ ప్రేమ సమాజం సంస్థకు విశాఖ బీచ్ రోడ్ లో 30 ఎకరాల భూమి ఉంది. అందులో సాయి ప్రియా రిసార్ట్స్ అని ఉంది. సాయిరెడ్డి సార్ ద్వారా ఆ విషయం నా దృష్టికి వచ్చింది. దాంతో నేను ఆ స్థలంలో ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లాను. అక్కడి నిర్వాహకులతో మాట్లాడాను. లీజును పెంచడం ద్వారా ప్రేమ సమాజం సంస్థకు మేలు చేసే ప్రయత్నం చేశాను. ఇదీ... సార్ తో నాకున్న పరిచయం" అంటూ శాంతి కన్నీటిపర్యంతమయ్యారు.

# రాష్ట్రంలో నేతన్నకు దుర్భర పరిస్థితులు

- జియో ట్యాగ్‌తో తగ్గిన సభ్యులు
- శిథిలావస్థలో చేనేత భవనం




**విశ్వంభర, ఆమనగల్లు :** చేనేత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు తెచ్చినా అవి అమలుకు నోచుకోవడం లేదు. నేతన్న బీమా పథకం గత ఏడాది ప్రారంభించగా, నిబంధనల కారణంగా సగం మందికి కూడా దక్కని పరిస్థితి నెలకొంది. సిరిసిల్ల, బోధన్ పోచంపల్లి పట్టు చీరలు, ఇక్కత్ డిజన్లు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నా, ఇక్కడి కార్మికులు మాత్రం పస్తులతోనే గడుపుతున్నారు. ఉత్పత్తులు పేరుకుపోవడంతో అమ్మకాలు లేక మాస్టర్ వీవర్స్ కార్మికులకు పని కల్పించలేక మగ్గాలు మూతపడే పరిస్థితి నెలకొంది. సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత పరిశ్రమకు జవసత్వాలు పోసే దిశగా ప్రభుత్వాలు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

ఒకప్పుడు 1500 మంది సభ్యత్వం కలిగిన ఆమనగల్ చేనేత సహకార సంఘం ఇప్పుడు కేవలం 24 జియో ట్యాగింగ్ మగ్గలు మాత్రమే కలిగి ఉంది అందులో కొందరు సభ్యత్వాలు కూడా నమోదు చేసుకోలేదు చేనేత సహకార సంఘంలో 18 మంది ఓటర్లు మాత్రమే ప్రస్తుతం కొనసాగుతున్నారు ఇందులో ఇంకా కొందరు చనిపోయినట్లు సమాచారం. చేనేత సహకార సంఘ భవనం శిథిలావస్థకు చేరుకొని సగం కూలిపోయి పూర్తిగా కూలిపోయే పరిస్థితిలో ఉంది భవనం కూలిపోతే పక్క ఇండ్లలో నివసిస్తున్న వారు భయపడుతున్నారు అసలే వానాకాలం ఒకవేళ జరగరానిదేమైనా జరిగితే నష్టాన్ని ఎవరు పూరిస్తారని అడుగుతున్నారు ఒకప్పుడు వేల మందికి ఉపాధి నిచ్చిన ఆమనగల్లు చేనేత సహకార సంఘం నేడు ఒక్కరికి కూడా ఉపాధిని ఇవ్వడం లేదు ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి చేనేత కార్మికుల సమస్యలను తీర్చాలని నేతన్నలు కోరుతున్నారు ఒకపక్క సహకార సంఘాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సంకేతాలు వచ్చినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో తొమ్మిదేళ్లుగా కార్యవర్గ సభ్యులు లేకపోవడంతో చేనేత సంఘాన్ని ఆమనగల్లో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాని కి అనేక పథకాలు ప్రకటిస్తున్నా.. అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో క్షేత్రస్థాయిలో ఆ పథకాలు కార్మికుల దరి చేరడం లేదు. దీంతో కార్మికుల్లో నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. కాగా, ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరడం లేదు.

కేంద్ర ప్రభుత్వం నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎ న్హెచ్‌ఎసీ) ద్వారా నూలుపై 10శాతం సబ్సిడీ ఇస్తోంది. డు రాష్ట్ర ప్రభుత్వం కూడా నూలు, ముడి సరుకులపై 40శాతం రాయితీ ఇస్తూ నూలుపై 50శాతం సబ్సిడీ కల్పిస్తామని ప్రకటించింది. ఇందుకోసం బడ్జెట్లో రూ.100 కోట్లు కేటాయించింది. కానీ, ఈ పథకం అమలుకు విధించిన నిబంధనలు కార్మికులకు శాపంగా మారాయి. కార్మికుడు కొనుగోలు చేసిన నూలు పైపథకాలున్నా ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరడం లేదు

చేనేత కార్మికుడు మరణిస్తే బున్కర్ యోజన పథకం కింద ఆర్థికసాయం లభించేది. ఇప్పుడు ఈ పథకం కొనసాగించడం లేదు కొన్నిసార్లు ఆపద్బంధు కింద ఆర్థికసాయం అందజేసేవారు. వీటితోపాటు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్షాబీమా యోజన ఉన్నా ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూర్చడంలేదు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మగ్గాల జియో ట్యాగింగ్ను ప్రామాణికంగా తీసుకుంది. సబ్సిడీపై నూలు సరఫరా చేస్తోంది. అయితే ఆసుపోయడం, డిజైన్ వేయడం, రబ్బర్లు చుట్టి రంగు అద్దడం, నూలు వడకడం, ఆరగట్టడం, అచ్చు అతకడం, అల్లు చాపడం, కంటెలు పట్టడం, మగ్గం నేసే వివిధ ప్రక్రియలు ఉంటాయి. చేనేత కుటుంబ సభ్యులందరూ భాగస్వాములైతేనే వృత్తి సాగుతోంది. జియో ట్యాగింగ్ను ప్రామాణికంగా తీసుకోకుండా వృత్తితో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ చేనేత బీమా వర్తింపచేసే విధంగా పథకాన్ని రూపకల్పన చేయాలని కార్మికులు కోరుతున్నారు.

**భవన నిర్మాణం చేపట్టాలి**



శిథిలావస్థకు చేరుకున్న చేనేత సహకార సంఘ భవనాన్ని పడగొట్టి నూతన భవనాన్ని నిర్మించాలి సహకార సంఘం ఎన్నికలు ప్రభుత్వం త్వరగా నిర్వహించి పాలకవర్గాన్ని నియమించినట్టయితే పూర్తిస్థాయిలో కార్మికులకు న్యాయం జరుగుతుంది.

**- చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు, శ్రీను**

**ప్రభుత్వం సహకారం అందించాలి**



చేనేత కార్మికుడు కి.శే. మా నాన్ననుంచి చేనేత పనులు నేర్చుకున్నా.. తర్వాత చేనేత కార్మికుడిగా ఏడు సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందడం లేదు. ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇళ్ల స్థలాలు కానీ మరేదైనా ప్రోత్సాహం అందించి ఆదుకోవాలి.

**- పాలాది పురుషోత్తం**



## సంతోషి మాత దేవాలయంలో వారాహి నవరాత్రోత్సవములు

**విశ్వంభర, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయం లో ఆషాఢ మాసంలో విశేషమైన నవరాత్రి ఉత్సవములు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం 9 వ రోజు దేవాలయ అర్చకులు భట్టరం వంశీ కృష్ణ శర్మ శ్రీ వారాహి మాత ఉత్సవ విగ్రహమునకు పంచామృత అభిషేకం నిర్వహించారు.అమ్మవారికి షోడోపచార పూజలు నిర్వహించి మాట్లాడారు.సప్త మాతృకలో ఒకరైన శ్రీ వారాహి నవరాత్రి ఉత్సవాలు ఎక్కువ గా ఉత్తర భారత దేశంలో ,ముఖ్యంగా తాంత్రికులు నిర్వహిస్తుంటారు అని తెలిపారు. ఈ వారాహి నవరాత్రి పూజల్లో పాల్గొన్న వారికి భూ సమస్యలు, సొంత ఇంటి కల తో పాటు ఎలాంటి దోషాలు ఉన్న నివృత్తం అవుతాయి అని తెలిపారు. 9 వ రోజు ప్రత్యేకముగా ఎర్రని పుషముల తో పూజలు నిర్వ హించారు.అనంతరం మహిళలు మంగళ హారతులు పట్టి అమ్మని కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ కార్యక్రమము లో దేవాలయ కమిటీ సభ్యులు బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, బేలిదే అశోక్ , బ్రాహ్మండ్ల పల్లి బాల చంద్రుడు, భక్తులు ,నూక భవాని,శివ పార్వతి, మంగ,రజనీ,విజయ లక్ష్మి, బచ్చు నీరజ, గజ్జి నీలిమ, సూర్యకల, దనలక్ష్మి, లీలావతి, పద్మ, తరంగిణి కవిత, లక్ష్మీ శోభారాణి, కనక రత్నం, జగదీశ్వరి, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో గ్రామ ప్రజలతో ఎస్సై ఎస్ కృష్ణయ్య మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల మీద యువతకు, ప్రజలకు అవగాహన నిర్వహించారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం మీద, జీవితాల మీద పడే చెడు ప్రభావాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాలు వాడిన మరియు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని అన్నారు. డ్రగ్స్ మీ జీవితాలను నాశనం చేస్తుంది అని యువత వాటికి బానిస కాకుండా మీ బంగారు భవిష్యత్ మీద దృష్టి పెట్టాలని కోరారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు వచ్చిన లేక అపరిచిత వ్యక్తుల దగ్గర నుంచి డ్రగ్స్ సంబంధించిన ఫోన్ కాల్ వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎవరు కూడా సైబర్ మోసగాళ్ల చేతిలో పడొద్దు అని మీకు అవసరం లేని వాట్సప్ లింక్ లను ఓపెన్ చేయొద్దు అని అన్నారు. అలా ఓపెన్ చేస్తే మీ ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉంది అని ప్రజలు ముఖ్యంగా యువత జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, అమనగల్లు :** నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి 74వ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఆదివారం అమనగల్లు కర్తాల్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ అమనగల్లు మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, కడ్తాల్ మండల అధ్యక్షుడు బిచ్యా నాయక్ ఆధ్వర్యంలో టపాకులు కాల్చి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాటా నరసింహ, మనయ్య, కృష్ణ నాయక్, వసుప్పుల శ్రీశైలం, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి శ్రీరాములు, ప్రసాద్, బాబా, కొండల్ రెడ్డి, గాజుల శ్రీను, విజయ్ రాథోడ్, కిషన్ నాయక్, యాదయ్య, గండికోట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న రాప్టర్ క్రికెట్ అకాడమీ



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఇండోనేపాల్ కేలో భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ సిరీస్ 2024 భాగంగా నిర్వహించిన పోటీల్లో ఆర్కే పురంలోనే రాప్టర్ క్రికెట్ అకాడమీ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు డైరెక్టర్ తరుణ్, హెడ్ కోచ్ భరత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేపాల్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ పోటీల్లో క్రికెట్‌లో ఇండియా నుంచి 8 రాష్ట్రాలకు చెందిన ఎనిమిది టీంలు పాల్గొన్నాయని తెలిపారు. తెలంగాణ నుంచి రాప్టర్ క్రికెట్ అకాడమీ నుంచి 15 మంది సభ్యులతో కూడిన టీం వెళ్లినట్లు తెలిపారు. ఈ టీంకు రవితేజ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడని తెలిపారు. భవిష్యత్తులో దేశానికి క్రికెటర్లను అందించే విధంగా తమ అకాడమీ కృషి చేస్తుందన్నారు. గోల్డ్ మెడల్ సాధించడంతో క్రీడాకారులలో మరింత రెట్టింపు ఉత్సాహం, కాన్ఫిడెన్స్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పాచ్ రంగా, హర్షత్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కీన్ కంటెంట్ స్టూడియోస్ ప్రారంభం




**విశ్వంభర, బషీర్ బాగ్ :** యువ చిత్ర నిర్మాతలు, నటీనటులకు సాధికారత కల్పించే లక్ష్యంతో స్థాపించినట్లు కీన్ కంటెంట్ స్టూడియోస్ వ్యవస్థాపకులు ఈ శరత్ గౌడ్ తెలిపారు. మాదాపూర్ సిద్ధి వినాయకనగర్‌లో సరికొత్త ఫిల్మ్ మేకింగ్ స్టూడియో ఓపెన్ చేశారు. సినిమాలు తీయాలని అనే ఆసక్తిగల యువత కోసం ఒక సినిమా మేకింగ్ ప్లేస్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇలాంటి వారి కోసం తమ అండగా ఉంటామని స్పష్టం చేశారు. తాము ఇప్పటికే దాదాపు 100 షార్ట్ ఫిలింలను తీయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని డైరెక్టర్‌లను సైతం సిద్ధం చేశామని అన్నారు. స్క్రిప్ట్ రైటింగ్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ వరకు అన్ని తమ స్టూడియోలోనే చేసుకోవచ్చని అన్నారు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేని యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



## వీధి దీపాలను పట్టించుకోని అధికారులు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాల్లోని వీధి దీపాలు పట్టపగలు కూడా వెలుగులను విరజిమ్ముతున్నాయి. ఉదయం రాత్రి అనే తేడా లేకుండా వీధి దీపాలు నిత్యం వెలుగుతుండడంతో విద్యుత్ దుబారాతో పాటు ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న పరిస్థితి. నెలలు తరబడి కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాలలో అసలు దీపాలు వెలుగులే లేని పరిస్థితి నెలకొనడంతో ఆయా గ్రామాల్లో స్థానికులు రాత్రి వేళలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కట్టుకున్నోడే కాలయముడు

- కేరళ నర్సుతో అక్రమ సంబంధం
- భార్య ఇద్దరు పిల్లలని హత్య చేసిన డాక్టర్
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ




**విశ్వంభర, ఖమ్మం :** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండా హర్యతండా గ్రామాలలో మే 28 సాయింత్రం రోడ్ ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ విషయంపై అప్పుడు ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడ ప్రవీణ్ అనే డాక్టర్ హైదరాబాద్ నుంచి వాళ్ళ గ్రామానికి వెళుతుండగా కారు ప్రమాదంలో కుటుంబ సభ్యులు భార్య బోడ కుమారి, కూతుళ్లు బోడ కృషిక, బోడ కృతికలు మరణించినట్లు స్పష్టం చేశారు.

ఆ ప్రమాదంలో భర్త ప్రవీణ్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడడంతో ప్రమాదంగా కేసు నమోదు చేశారు. అయితే మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించడంతో అనుమానస్పద హత్యగా దర్యాప్తు చేసిన పోలీసులు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. నిందితుడు బొడ ప్రవీణ్ ఫిజియోథెరపిస్ట్‌గా హైదరాబాద్‌లో ప్రభుత్వ డాక్టర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. ఆ సమయంలో కేరళకు చెందిన సోనీ ఫ్రాన్సిస్ అనే మరో నర్స్‌తో అక్రమ సంబందం కొనసాగిస్తున్నట్లు తేలినట్టు ఏసీపీ పేర్కొన్నారు. ఇంట్లో గొడవలు జరగడంతో సోనీ, ప్రవీణ్ పక్కా ప్రణాళికతో భార్య పిల్లల అడ్డు తొలగిస్తే ప్రశాంతంగా వుండొచ్చు అని భావించారు. మే 28 తేదీ హైదారాబాద్ నుంచి ఇంటికి బయలుదేరి సాయంత్రం సమయంలో తనతో తెచ్చుకున్న డ్రగ్ కాల్షియం ఇంజెక్షన్‌లో కలిపి ఇవ్వడంతో బోడ కుమారి మరణించిందని ధృవీకరించుకొని ఇద్దరు పిల్లలను నోరు మూసి ఊపిరి ఆడకుండా చేసి చంపినట్టు నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపారు.

మంచుకొండ గ్రామం దాటిన తరువాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడానికి కారు లెఫ్ట్ సైడ్ పొదల్లోకి వెళ్లి చెట్టుకు గుద్ది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడని, పోలీసులు అన్ని శాస్త్రీయ ఆధారాలు సేకరించి నిందితుడు ప్రవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ చేసిన పోలీసులు అధికారులు సీఐ శ్రీహరి ఎస్సై సురేశ్‌ను పోలీస్ కమిషనర్ అభినందించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహనలు సీజ్



**విశ్వంభర, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనదారులకు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ ఐ సాయిరాం సూర్యాపేట పట్టణంలో నెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న 70 కి పైగా ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ వాహనానికి ఉండేలా చూసుకోవాలన్నారు. రవాణా వాహన చట్ట నిబంధనలకు లోబడి ప్రతి ఒక్క వాహనదారుడు వెహికల్‌ను నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో, వాహనం పార్కింగ్‌లో నిలిపినప్పుడు చోరీకి గురైన సమయంలో నెంబర్ ప్లేట్ లేకపోవడం వల్ల వాహనాన్ని గుర్తించడం కష్ట సాధ్యమవుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వారి వాహనాన్ని సంబంధించిన పూర్తి ఆధారాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మైనర్లకు తల్లి దండ్రులు వాహనాన్ని ఇవ్వవద్దన్నారు. ముఖ్యంగా వాహనాలకు సైలెన్సర్లను తొలగించి నడపడం నేరమన్నారు. అనంతరం నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనదారులకు నెంబర్ ప్లేట్ తీసుకువచ్చి వారి వాహనానికి బిగించిన తర్వాతనే వారికి వాహనాన్ని అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, ట్రాఫిక్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ బుచ్చయ్య, రమణారెడ్డి, కానిస్టేబుల్స్ జీ సంతోష్ కుమార్, జానకి రాములు, హోంగార్డ్స్, నరేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు నివాసంలో మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్ మీటింగ్

**విశ్వంభర, హైదరాబాద్ :** రాజ్యసభ సభ్యులు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో ఆదివారం సంఘం అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎంపీ రవిచంద్ర అధ్యక్షతన హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసంలో సుమారు మూడు గంటల పాటు సంఘం ప్రముఖులు, కౌన్సిల్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమ రావు, సభ్యులు రౌతు కనకయ్య, సీ.విఠల్, బొంతు రాంమోహన్, ఆకుల రజిత్, నాగేందర్, మరికల్ పోత సుధీర్ కుమార్, విష్ణు జగతి, ఆది విష్ణుమూర్తి, కొత్త లక్ష్మణ్, లవంగాల అనిల్, ఆవుల రామారావులు హాజరై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియమావళి ప్రకారం కౌన్సిల్ ప్రతి నెలా సమావేశం కావాలని, సంఘం కార్యకలాపాలను అపెక్స్ కౌన్సిల్ బై లా అనుసరించి మరింత చురుగ్గా కొనసాగించాలని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పటిష్టపర్చాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. సంఘం కార్యక్రమాలు చట్టానికి లోబడే ఉండాలని కూడా తీర్మానించారు.





సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని ఆదివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ వూర రామూర్తి యాదవ్, మాజీ కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్ గౌడ్, బైరబోయిన శ్రీను లు మర్యాదపూర్వం కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

- విశ్వంభర, హైదరాబాద్



హైదరాబాద్ అంబర్పేట ప్రధాన దారిలోని ముత్యాలమ్మ అమ్మవారికి నేడు పంజాల చంద్రశేఖర్ గౌడ్ వారి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి వెండి కిరీటంను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ దేవరుప్పల నరసింహ ఉపాధ్యక్షులు డి రమేష్, డి వెంకటేష్ డి వీరస్వామి జనరల్ సెక్రటరీలు ఆంజనేయులు, కృష్ణ నాగేందర్, సంతోష్ ఉన్నారు.

- విశ్వంభర, హైదరాబాద్



హైదరాబాద్ రాజ్ భవన్‌లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసిన మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గం ఇన్చార్జ్ యెన్నం శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి, మట్ట పరమేష్ గౌడ్

- విశ్వంభర, ఆమనగల్లు

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలి

○ సీపీఎం ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కే నాగేశ్వర్




**విశ్వంభర, ముషీరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గత ప్రభుత్వం నిర్మించిన 65 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో లబ్ధిదారులకు తగిన సదుపాయాలు కల్పించి ఇళ్లను స్వాధీనం చేయాలని ఆదివారం ధర్నా చౌక్‌లో సిపిఎం నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం కరెంటు రోడ్డు లిఫ్ట్ లో ఏర్పాటు లేకపోవడంతో ఇల్లు పొందిన పేదలు ఆ ఇళ్లలో నివసించే పరిస్థితి లేదు, తక్షణమే ఈ సదుపాయాలు కల్పించాలని నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సదుపాయాల కల్పనకు రూ.700 కోట్లు అవసరమని జిహెచ్ఎంసి, హౌసింగ్ అధికారులు తెలియజేస్తున్నందున రాబోయే రాష్ట్ర బడ్జెట్లో అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిధుల కేటాయింపు జరపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని చాలా జాప్యం చేసిందని కనీస సదుపాయాలు కల్పించకుండానే ఎన్నికల ముందు హడావిడిగా ఇళ్ల కేటాయింపు జరిపిందని దీని కారణంగానే పేదలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ చెప్పారు. సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో లబ్ధిదారులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు, ఎం దశరథ్, ఎం మహేందర్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నగర కార్యదర్శి కే నాగలక్ష్మి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు వి. విజయకుమార్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన లబ్ధిదారుల ప్రతినిధులు ఈ ధర్నాలో ప్రసంగించారు. అల్టిమేట్ గా ప్రజలకు కావాల్సింది ఇల్లులు రాజకీయాలు కాదు, కాంగ్రెస్ పార్టీ కూడా అర్థం చేసుకోవాలి గత ప్రభుత్వం ఇల్లులు కట్టారని వదిలేయొద్దు, ముఖ్యమంత్రులు మారుతారు ప్రభుత్వాలు శాశ్వతం, ఈ ప్రభుత్వం కట్టిందా గత ప్రభుత్వం కట్టిందా అన్నది కాదు, ప్రజలు శాశ్వతం, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యత, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని తగిన సదుపాయాలు కల్పించాలి, లేదంటేపెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు, గత ప్రభుత్వం కట్టిన ఇల్లులు ఇవ్వకపోవడంతో శిథిలావస్థలకు చేరుకుంటున్నాయి, గబ్బిలాలకు కేరాఫ్ అడ్రస్ గా మారుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు, తక్షణమే ఈ ప్రభుత్వం దృష్టి సాధించి మౌలిక సదుపాయాలు కల్పించి అర్హులైన వారికి ఇల్లులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



## బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్ :** శనివారం రాత్రి 10గంటలకు దిల్‌సుఖ్‌నగర్ వద్ద నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని.. గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని బీజేవైఎం నాయకులు మెరుపు నిరసన చేశారు. టీపీసీసీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ఇబ్రహీం పట్నం నియోజకవర్గం పర్యటన ఉండడంతో ఉదయం బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి, సరూర్నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి విషయాన్ని తెలుసుకొని సరూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదిరెడ్డితో మాట్లాడి బీజేవైఎం నాయకులను ముందస్తు అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ దామ రాకేష్ యాదవ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యార్థుల పక్షాన ప్రశ్నిస్తే ఎన్నో అక్రమ అరెస్టులు చేశారని, ఇపుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల క్యాలెండర్‌కు సంబంధించిన సమస్యలకు సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనాలిఅన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు రంజిత్, జీ నవీన్, ఎల్బీనగర్ నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ రాకేష్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు సురేష్, డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్, సిద్దు ముదిరాజ్, బీజేపీ, బీజేవైఎం నాయకులు శ్రవణ్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, రాజేష్, వివేక్ రెడ్డి, టీంకు, రఘునందన్ జోషి, గిరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాథ స్వామి రథయాత్ర



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఆర్కే పురంలో జగన్నాథ స్వామి రథయాత్ర ఇస్కాన్ సొసైటీ సభ్యులు శ్రీనివాసు, నర్సింగరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ రథయాత్రలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ కృష్ణ నామస్మరణతో ముందుకు సాగుతూ ఆధ్యాత్మిక అనుభూతి పొందారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, కాలనీ సొసైటీ ప్రతినిధులు రమేష్ బాబు, రాజే శ్రీరామారావు, వెంకటేశ్వర్లు, నరహరి రావు, ఆంజనేయ ప్రసాద్, గణేష్ బాబు, భరత్ శ్రవణ్, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రాధా, నీలిమ, సుజాత, మునిపల్లి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

## మానవత్వం పరిమళించిన వేళ

- ఎస్ఐ శ్రీనివాస్ కుటుంబానికి అండగా నిలిచిన బ్యాచ్ మేట్లు



**విశ్వంభర, భూపాలపల్లి :** చేసే వృత్తిలో పేరు ప్రఖ్యాతులు గాంచి.. మంచి పోలీస్ అధికారిగా ప్రజల మన్ననలు పొంది.. అనివార్య కారణాల వల్ల ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి 2014 బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులైన ఎస్ఐ లు ఏపీ, తెలంగాణ వెల్ఫేర్ సొసైటీ పేరు మీద ఆదివారం శ్రీనివాస్ సొంత గ్రామానికి చేరుకొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్నేహితుని కుటుంబ సభ్యులకు రూ. 25 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేసి..స్నేహితుని కుటుంబానికి చేయూతనందించి.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. తోటి స్నేహితుడు ఆత్మహత్య చేసుకోవడంతో..స్నేహితుడి కుటుంబానికి అండగా ఉండి. ఆ కుటుంబం వీధిపాలు కాకుండా చూసేందుకు ముందుకు వచ్చిన 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలకు పలువురు మేధావులు, ఉద్యోగులు, సహచార పోలీస్ అధికారులు, ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2014 బ్యాచ్ ఎస్ఐలు చల్ల రాజు, గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్, బండి రామకృష్ణ, వీరభద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## అభినంద సభలో ఎంపీ ఈటెల రాజేంద్ర




**విశ్వంభర, కూకట్ పల్లి :** కూకట్ పల్లి బోయిన్ పల్లిలో హైదరాబాదులో నివాసం ఉంటున్న బీహార్ అసోసియేషన్ సభ్యులు పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌కు అభినందన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ హాజరయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఆయనను బీహార్ అసోసియేషన్ వాసులు కోరారు. 75 ఏళ్ల స్వాతంత్ర దేశంలో తల్లిదండ్రులను పోషించలేని దీనస్థితికి వెల్లామని, మోదీ పాలనలో పరిస్థితులు మారుతున్నాయని, భవిష్యత్తు నిర్మాణం కోసం మనం భాగస్వాములము అవుదామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్ పల్లి అసెంబ్లీ ఇన్చార్జ్ మాధవరం కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గౌడ్, డివిజన్‌లోని బిజెపి నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభాస్ అభినానుల సంబురాలు

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలుగు సినిమా హీరో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన కల్కి సినిమా రూ.1000 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించిన సందర్భంగా ముషీరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్ సంధ్య 70 ఎంఎం థియేటర్‌లో హీరో ప్రభాస్ అభిమానులు ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ సంబరాలలో ఆల్ ఇండియా కృష్ణంరాజు ప్రభాస్ అభిమానుల సంఘం అధ్యక్షుడు ఏబీ గోవిందరావు, సిటీ అధ్యక్షుడు చక్రం, థియేటర్ మేనేజర్ నాగరాజు హాజరై టపాకులు కాల్చి థియేటర్లో స్వీట్లు పంపిణీ చేశారు. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లో హాల్లో పది రోజుల్లో కోటి రూపాయల వసూలు సాధించు ప్రభాస్ కల్కి సినిమా చరిత్ర సృష్టించిందని తెలిపారు. అత్యధిక కలెక్షన్లతో దూసుకుపోతున్న ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంబురాల్లో అభిమానులు హనుమంతు, అర్జున్, సాయికుమార్, సల్మాన్, రవికుమార్, కౌశిక్, నేహాల్, కార్తీక్, రేవంత్, రామ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



## నేటితరం పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా అవసరం

- జెడ్ఈఓ అంకమ్మరావు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** నేటి తరం పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా అవసరమని భాష్యం పాఠశాల జెడ్ఈఓ అంకమరావు అన్నారు. ఆర్కే పురం భాష్యం పాఠశాల ఫ్రెషర్స్ డే వేడుకలు పల్లవి గార్డెన్స్ లో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంకమ్మరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు ఎక్కువ సమయాన్ని సెల్ఫోన్లో గడుపుతూ విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని అన్నారు. అలా సమయం వృథా చేయడం వల్ల వారు మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని అన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ.. పటిష్టమైన పాఠశాల ప్రణాళికను అనుసరించి విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన సంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాంధీని కలిసిన డివిజన్ నాయకులు



**విశ్వంభర, కూకట్ పల్లి :** కాంగ్రెస్ పార్టీలో శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ చేరిన సందర్భంగా నివాసంలో ఆయనను పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేటానికి ఎల్లవేలలో కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ గౌడ్, గచ్చిబౌలి డివిజన్, ఆల్విన్ కాలనీ డివిజన్ ఫేజ్ 2 నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వేద పండితుడికి సంభావన సమర్పణ



**విశ్వంభర, హైదరాబాద్ :** వైశాఖం, జ్యేష్ఠం, ఆషాడం మూడు మాసాలు శుభకార్యములు లేనందున ప్రతి నెలా ఒక్కొక్క బ్రాహ్మణుడికి సంభావన సహాయాన్ని కర్మన్ ఘాట్‌లోని తిలక్ నివాస్‌లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వేద పండితుడు మంగళగిరి మాధవశేషు స్వామికి రూ.11,000.00 ప్రియదర్శని యాదగిరి రెడ్డి సమర్పించారు. తరువాత యాదగిరి రెడ్డి మాట్లాడుతూ త్వరలో ప్రియదర్శని హాస్పిటల్ ప్రారంభించి బ్రాహ్మణులకు, అర్చకులకు ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు.



**తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సమాఖ్య సంస్థ చైర్మన్‌గా నియమితులైన మెట్టు సాయిను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం వారి కుటుంబ సభ్యులు**

**- విశ్వంభర, కూకట్‌పల్లి**

## క్రీడాకారులను అభినందించిన సీఎం



**విశ్వంభర, బషీర్ బాగ్ :** ఖేలో "భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్‌లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. క్రీడారంగంలో తెలంగాణ కీర్తిని ప్రపంచ స్థాయికి తీసుకు వెళ్లే విధంగా కృషి చేయాలి అన్నారు. ఆదివారం సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా క్రీడాకారులు చక్రత్ సాయిహన్సిక, సర్దార్ అంగద్ సింగ్ సిద్ధూ, గుగ్లావత్ సురేందర్, బైరగోని అరుణ్ కుమార్, గీతా సురేందర్ చక్రత్, శివకుమార్ రెడ్డిలు కలిశారు. ఇండో నేపాల్ ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ నేపాల్ రంగశాల స్టేడియం (పోఖారా)లో జూన్ 26, 27, 28, 29, 30 జూన్2024న జరిగింది. ఖేలో భారత్ యూత్ గేమ్స్ అథ్లెటిక్స్, కరాటే, కబడ్డీ, సిలంబం, యోగా, ఫుట్‌బాల్, ఖోఖో, ఎయిర్ రైఫిల్ షూటింగ్, ఆర్చరీ, హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్, తైక్వాండో పోటీలు నేపాల్‌లో జరిగాయి. తెలంగాణా రాష్ట్ర ఎయిర్ రైఫిల్ షూటింగ్ ప్లేయర్లు "ఇండోనేపాల్ ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్ 2024లో 10మీ ఎయిర్ రైఫిల్ షూటింగ్ టార్గెట్ పీప్‌సైట్ పాల్గొని వ్యక్తిగత, ద్వంద్వ జట్టు వంటి వివిధ విభాగాల్లో 6బంగారు, 2 సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నారు. ఇందులో చక్రత్ సాయిహన్సిక అండర్ 17 ఎయిర్ రైఫిల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్, డ్యూటీమ్‌కి 1సిల్వర్ మెడల్, సర్దార్ అంగద్ సింగ్ సిద్ధూ అండర్ 17, ఎయిర్ రైఫిల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్, డ్యూటీమ్‌లో 1సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. గుగ్లావత్ సురేందర్ అండర్ 25, పిస్టల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్ డ్యూటీమ్‌లో 1గోల్డ్ మెడల్ గెలుచుకున్నారు. రాథోడ్ సంతోష్ అండర్ 30 లో బ్రేక్ బారెల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్, డ్యూటీమ్ 1 సిల్వర్ మెడల్, బైరగోని అరుంకుమార్ ఓపెన్ కేటగిరీ ఎయిర్ రైఫిల్, వ్యక్తిగతంగా 1గోల్డ్ మెడల్ , 1 డ్యూటీమ్‌లో సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు.

## ఫిర్జాదిగూడలో బోనాల పండగకు తేదీ కరార్



**విశ్వంభర, మేడిపల్లి :** తెలంగాణలో అమ్మవారిని పూజించే ఉత్సవం బోనాల పండుగ. సంస్కృతీ సంప్రదాయాలు కలబోసిన గ్రామదేవతల పండుగిది. రాష్ట్ర పండుగ బోనాల జాతరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ముస్తాబవుతోంది. ఆగస్టు 4న ఆదివారం బోనాల వేడుకలు జరుపుకొనుటకు మేడిపల్లి లోని శ్రీ వీరాంజనేయ స్వామీ దేవాలయం ఆలయ చైర్మన్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కమీషనర్ త్రిళేశ్వర్ రావు, కార్పొరేటర్లు, కొఆప్షన్ సభ్యులు, పట్టణ పెద్దలు ఏకగ్రీవంగా తీర్మానించారు.

మేయర్ జక్కా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గతం సంవత్సరం లాగే ఈసారి కూడా బోనాలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ భారీ ఏర్పాట్లు చేయనుందని తెలిపారు. మతసామరస్యానికి.. తెలంగాణ జన జీవన సాంస్కృతిక వైభవానికి ప్రతీకలైన బోనాల పండుగను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలందరూ అంగరంగ వైభవంగా జరుపుకోవాలని కోరారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ద్వారా పటిష్ఠ ఏర్పాట్లు చేపడుతున్నట్లు మేడిపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీఐ గోవింద్ రెడ్డి, కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మద్ది యుగేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, దొంతిరి హరి శంకర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు బోడిగే రాందాస్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, బీజేపీ అధ్యక్షులు నెమిలికొండ అనిల్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, బండి సతీష్ గౌడ్, అలవాల దేవేందర్ గౌడ్, జావీద్ ఖాన్, బోడిగే కృష్ణ గౌడ్, యాసారం మహేష్,పాశం బుచ్చి యాదవ్, కర్రే బాలరాం, పంగ మహేందర్, పంగ ప్రణయ్, శ్రీనివాస్, కిరణ్, ఆలయ బోర్డు సభ్యులు ఎర్ర ఐలేష్ యాదవ్, జంగచారి, నాగరాజు, పవన్ గౌడ్, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, కాలనీ అధ్యక్షకార్యదర్శులు, వివిధ దేవాలయాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఆసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వనేపల్లి శ్రీనివాస్ రెడ్డి




**విశ్వంభర, ఎల్బీనగర్ :** డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్, తెలుగు డ్రాగన్ ఫ్రూట్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వనేపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రల డ్రాగన్ ఫ్రూట్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం ఆర్కే పురం ఎన్టీఆర్‌నగర్ మార్కెట్ కమిటీ ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల నుంచి బాట సింగరం మార్కెట్‌కు ప్రతిరోజు రైతులు పెద్ద ఎత్తున్న డ్రాగన్ ఫ్రూట్స్ తీసుకువస్తున్నారని తెలిపారు. మార్కెట్ వద్ద ఎలాంటి రసీదులు లేకుండా 4 శాతం కమీషన్ తీసుకుంటున్నారని తెలిపారు. మార్కెట్‌లో దళారులు రైతులను తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. గత సీజన్లో కూడా రైతులకు తీవ్ర అన్యామం జరిగిందిని, ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉందని తెలిపారు. బాటు సింగారం మార్కెట్లో డ్రాగన్ ఫ్రూట్స్ రైతులు అమ్ముకునే విధంగా స్థలం కేటాయించాలని, రైతుల నుంచి 4 శాతం కమిషన్ తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్స్ రైతులు వారి సమస్యలను మార్కెట్ కమిటీ సెక్రటరీ చిలుక నర్సింహారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిలుక నర్సింహారెడ్డి మాట్లాడుతూ మార్కెట్కు సరుకులు తీసుకువచ్చే రైతులు మార్కెట్లో అమ్మకం జరిపినప్పుడు తప్పనిసరిగా తక్ పట్టి తీసుకోవాలన్నారు. తక్ పట్టిలో తేడా ఉంటే మార్కెట్ లోని అధికారుల దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు మార్కెట్లో ఎలా మేలగాలో అవగాహన కల్పించారు. ఈ విషయం పైస్థాయి అధికారుల దృష్టి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమందో తెలుగు డ్రాగన్ ఫ్రూట్స్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, ఉపాధ్యాక్షులు యాదగిరి, కోశాధికారి అనిల్ కుమార్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల్లో 5శాతం వికలాంగులకు కేటాయించాలి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి
- వికలాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలి
- ఎన్పీఆర్డీ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్
- షాద్‌నగర్‌లో ఎన్పీఆర్డీ రాష్ట్రస్థాయి మూడవ మహాసభలు




**విశ్వంభర, షాద్‌నగర్ :** ప్రభుత్వ పథకాల్లో వికలాంగులకు ఐదు శాతం అభివృద్ధిని అమలు చేయాలని మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 3వ మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు కరువునెల్లి వెంకట్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్న గారి భుజంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కిని రాజు, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, డివిజన్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పలువురు మాట్లాడుతూ.. నేటి సమాజంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ 3016 నుంచి 6016 వరకు పెంచాలని, అదేవిధంగా బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 40% నుంచి 100% ఉన్న దివ్యాంగులకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వికలాంగుల ఉద్యోగ నియామకాల్లో శరీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గించాలని, వికలాంగుల పెన్షన్ 6000 లకు పెంచి వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల కోసం ఉద్యమం చేస్తమని ఎన్పి ఆర్డి రాష్ట్ర అధ్యక్షుడు కే.వేంకట్ హెచ్చరించారు.దేశవ్యాప్తంగా వికలాంగుల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో అక్రమాలు ఉన్నాయని, ఆర్థిక నిర్వహణ సక్రమంగా అమలు చేయడం లేదని, నిధుల పర్యవేక్షణ చేయడంలో వికలాంగుల సంక్షేమ శాఖ విఫలం చెందుతుందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్ట్ వెల్లడించిందన్నారు .ఆర్థిక సంవత్సరం చివర్లో నిధులు విడుదల చేయడం ద్వారా లబ్ధిదారులకు అందకుండా పోతున్నాయి. వికలాంగుల పెన్షన్ నిధులను ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి అనేక పథకాల ప్రచారానికి వినియోగిస్తున్నారు. జమ్మూకాశ్మీర్, గోవా, బీహార్ రాష్ట్రాలలో 2.83 కోట్లు ప్రభుత్వ ప్రచారం కోసం వినియోగించారని కాగ్ నివేదిక వెల్లడించింది.ప్రపంచ జనాభాలో 16% మంది వికలాంగులు ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది .దేశంలో 1015 శాతం మంది వికలాంగులు ఉన్నారని అంచనా.పాలకులు అనుసరిస్తున్న విధానాల మూలంగా వికలాంగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ పర్సన్ విత్ డిజేబులిటీ 2021 22 వార్షిక రిపోర్ట్ ప్రకారం 67,09,894 మందికి యూడిఐడి కార్డులు జారీచేసింది.దేశవ్యాప్తంగా 1,74,25,094 మందికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ అయితే 67.09 లక్షల మందికి యూడిఐడి కార్డులు జారీ చేసినారు. పాఠశాలలకు వెళుతున్న వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు ప్రతి ఐదేండ్లకు ఒకసారి సర్వే చేయాలని 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్ 17( ఏ) పేర్కొందని అన్నారు.కానీ దేశంలో ఎక్కడా కూడా ఇటువంటి సర్వేలు చేయడం లేదు. గ్రామపంచాయతీ, అంగన్వాడీ, ఆశా వర్కర్ల ద్వారా వికలాంగుల వివరాలను గ్రామ స్థాయిలో సేకరిస్తే వికలాంగుల సమగ్ర సమాచారం సేకరించాలని డిమాండ్చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమలు లోపం ఉందని సుప్రీం కోర్ట్ చెప్పిన కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గుచేటని అన్నారు. 2011నుండి కేంద్ర ప్రభుత్వం పెన్షన్ లలో 300 రూపాయలు మాత్రమే కేంద్ర ప్రభుత్వం వాటా ఉందని, 300 రూపాయలతో ఎట్లా బ్రతుకుతారని ప్రశ్నించారు. ధరల పెరుగుదల సూచికి అనుగుణంగా పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న వికలాంగుల పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వికలాంగుల విద్యా పట్ల కేంద్ర ప్రభుత్వంకు చిత్తశుద్ధి లేదన్నారు. వికలాంగులలో విద్య అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలులో ఉన్న వాటి అమలు పట్ల ఎందుకు శ్రద్ధ లేదని అన్నారు. వికలాంగుల విద్య కోసం ప్రత్యేక విద్యా పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కోసం అమలులో ఉన్న నేషనల్ ట్రస్ట్, నేషనల్ పాలసీ, అంటీజం యాక్ట్ వంటివి అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందుతుందని అన్నారు.వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు అశాన్నగారి భుజంగ రేడ్డి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం లెక్కల ప్రకారం 10.48 లక్షల మంది వికలాంగులు ఉన్నారనీ తెలంగాణ దిశ బ్లైడ్ స్టడీ ఇండియా రిపోర్ట్ ప్రకారం 43.02 లక్షల మంది ఒక్కటి కంటే ఎక్కువ వైకల్యాలు కలిగిన వారు ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12.2శాతం వికలాంగులున్నారని, రాజకీయ పార్టీలు వికలాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పెన్షన్ 6000 పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉచిత విద్యుత్ ప్రయాణ సౌకర్యం, శారీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గించాలని, 2016 ఆర్పిడబ్ల్యుడి చట్టం అమలు కోసం, నామినేటెడ్ పదవులలో రిజర్వేషన్స్ అమలు కోసం అసెంబ్లీలో చట్టం చేయలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రదన కార్యదర్శి జెర్కోని రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు చేగురి శేఖర్, జిల్లా సహయ్య కార్యదర్శి నాగార్జున, శ్రీనివాస్, అబ్దుల్లా పుర్ మెట్టు మండల అధ్యక్షుడు అంతటి మహేష్ గౌడ్, మంచాల మండల నాయకులు బాల్ రాజ్, శంకర్‌పల్లి అధ్యక్షుడు కసాల యదయ్య, చెవేళ్ళా అధ్యక్షుడు బోద శ్రీనివాస్, మోయినబాద్ మండల అధ్యక్షుడు ఎరపుల జానయ్య, ఇబ్రహీంపట్నం మండల నాయకులు కాకి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



# సాగునీటి కష్టాలు తీర్చాలి

## మంత్రి ఉత్తంకు ఎమ్మెల్యేల వినతి

**విశ్వంభర, పరిగి :** రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని హైదరాబాద్‌లోని అతని నివాసంలో ఆదివారం వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన కొందుర్గుపరిగిలక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టును త్వరితగతిన నిర్మించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగునీరు ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా పూర్తి చేసి రైతన్నలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంతో షాద్‌నగర్, పరిగి, చేవెళ్ల, తాండూర్ నియోజకవర్గ ప్రజలకు సాగునీటి కష్టాలు తీరుస్తామని మంత్రి హామి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# ముదిరాజ్ కమ్యూనిటీ సమావేశం




**విశ్వంభర, హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ పట్టణ ముదిరాజ్ కమ్యూనిటీ చెరువు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో టౌన్ హాల్ వారి హక్కుల కోసం ముదిరాజుల అందరూ కలిసి వారికి రావాల్సిన హక్కులకోసం కమిటీగా ఏర్పడ్డారు. రానున్న రోజుల్లో ముదిరాజులందరూ ఒకతాటిపై కొచ్చి బీసీడీ నుంచి బీసీలలోకి మార్చాలని, చెరువుల బహిరంగ వేలం వేయాలని కోరారు. చెరువులు కబ్జా కాకుండా ప్రభుత్వం, నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి అన్నారు. ముదిరాజుల సంఖ్య ఎక్కువగా ఉన్న వార్డులను అన్ని పార్టీల వారు ముదిరాజ్‌లకే టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత మత్స్యశాఖ సొసైటీలో ఉండి మరణించిన వారి ప్లేస్లో కొత్తవారిని తీసుకొని సొసైటీ సభ్యులందరికీ న్యాయం చేసే విధంగా చూడాని కోరారు. చెరువుల కబ్జా కాకుండా అక్రమ మట్టి తొలగాలు కాకుండా ముదిరాజ్ అందరూ ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించుకున్నారు. జనాభా ప్రతివాదంలో సుమారు హుజూర్నగర్ 6000 మంది ముదిరాజ్‌లు కలరు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కి ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు నల్గొండ పార్లమెంటు సభ్యులు వారి వంతు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముసలప్ప చంద్రయ్య, కంటు నాగరాజు, ములకలపల్లి సీతయ్య, రాంగోపీ, సతీష్, మామిడి మంగమ్మ, ఆతుకూరి వెంకమ్మ, శీలం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# 17న కస్తూర్బా పాఠశాల ప్రారంభం



**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండల కేంద్రంలోని రూ.3.50 కోట్లతో అధునాతన సదుపాయాలతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ పాఠశాల భవనాన్ని మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సందర్శించి పరిశీలించారు. 17న బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల అన్ని వసతులు పూర్తి అయ్యాయని, ఈ యొక్క కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, చేగురీ వెంకటేష్ పాల్గొన్నారు.

# వానల కోసం కప్పలకు పెళ్లి చేసిన గ్రామస్తులు



**విశ్వంభర, చింతపల్లి :** జులై రెండవ వారమొచ్చినా వానల జాడలేవు. విత్తనాలు వేసే టైమొచ్చినా ఎండలు దంచికొడుతున్నాయి. వర్షాలు ఎప్పుడొస్తాయా అని వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు రైతన్నలు. వానలు కోసం ఊర్లల్లో కప్పలకు పెళ్లి చేసిన ఘటనలు మనం చాలా చూశాం. ఇప్పటికీ కప్పలకు పెళ్లి చేస్తే వర్షాలు పడతాయనేది రైతుల నమ్మకం. లేటెస్ట్ గా చింతపల్లి మండలం హరిజనాపురం గ్రామంలో వర్షాల కోసం ఎదురు చూస్తున్న గ్రామస్తులు కప్పలకు పెళ్లి చేశారు. కప్పలను కర్రలకు కట్టి వర్షాలు కురవాలని పాటలు పాడుతూ బ్యాండ్ బాజాలతో ఇంటింటికి తిరిగారు. మహిళలను బిందెలతో నీళ్లు తెచ్చి కప్పలపై పోసి వరుణ దేవుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.చిరంజీవి, బీ శ్రీనయ్య, సప్పిడి ఇద్దయ్య, కంబాలపల్లి కృష్ణయ్య, ముసుకు వెంకటయ్య, జిల్లా నాగేష్, జిల్లా సురేష్, తంగెళ్ళ లక్ష్మయ్య, ముసుకు వాల్లయ్య, కుర్మెటి ఇంద్రయ, గాదేపాక ఆరోగ్యం, సీహెచ్ రాములు, కే ఎల్లయ్య, కే వెంకటయ్య, కే జంగయ్య, రామకృష్ణ, యాదగిరి, కొండల్, మాస్, యాదయ్య, అనిల్, మధు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా రియాజ్



**విశ్వంభర, ఆత్మకూరు-(ఎం) :** తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా డాక్టర్ రియాజ్ బాధ్యతలు స్వీకరిస్తున్న శుభ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్ల అధ్యక్షులు ఎలగందుల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్ట్ టైం స్వీపర్లను పూర్తి స్థాయిలో సేవలను వినియింగించుకొని గ్రంథాలయ ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని కోరారు.



# గ్రామ గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు

**విశ్వంభర, ఆమనగల్లు :** కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో మొహర్రం సందర్భంగా పీర్ల చావిడిలో పీర్లను కొలువుదీర్చారు. చావిల్లను విద్యుద్దీపాలతో అలంకరించారు. పీర్లను వెండిగొడుగులు, నూతన వస్త్రాలు, పూలతో ముస్తాబు చేసి చావిడిలలో నిలబెట్టారు. 17 తేదీన గ్రామంలో పీర్లు ఊరేగింపు ఉంటుందని, కుల మతాలకు అతీతంగా మొహరం (పీర్ల పండుగ)జరుపుకొంటారని నిర్వాహకులు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొహరం రోజు పీర్ల ఊరేగింపును జయప్రదం చేయాలని ముజావర్లు కోరారు.

# ప్రతీ ఒక్కరు భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి



**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని కడ్తాల్ మండల మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్ , మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు వారికి శాలువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు ఆత్యాధ్మిక చింతనను అలవర్చుకొని భక్తి మార్గంలో నడవాలని దశరథ్ నాయక్, ఆనంద్ సూచించారు. మానసిక ప్రశాంతత కు దైవదర్శనం ఒక్కటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాండు, మహేష్ లక్ష్మణ్, గణేష్, జగన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి జన్మదిన సదర్భంగా షాద్‌నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ముబారక్ అలీ ఖాన్, సీనియర్ నాయకులు పొగాకు ప్రకాష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, 20వ వార్డు కాంగ్రెస్ నాయకులు డాకన్న సుధాకర్, మనీష్, ఎంపీ నివాసంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభకాంక్షలు తెలిపారు.
- విశ్వంభర, షాద్‌నగర్

# భయంతో సీఎం రేవంత్ రెడ్డి బీజేవైఎం నాయకులను అక్రమ అరెస్టులు చెయ్యడం సిగ్గుచేటు



## బీజేవైఎం ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షుడు పైళ్ళ ప్రశాంత్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ప్రభుత్వం ఏర్పడి 200 రోజుల అయినప్పటికీ ఎలాంటి హామీలు నెరవేర్చాలేని ఈ అసమర్థ ప్రభుత్వం, ఎక్కడ పర్యటించాలన్నా.. భయంతో ముందస్తు అరెస్టులు చేసి పర్యటించే దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, రాష్ట్ర బీజేవైఎం యువ మోర్చా అంటేనే రేవంత్ రెడ్డికి వెన్నులో వణుకు వస్తుంది అందుకే బీజేవైఎం రాష్ట్ర యువమోర్చా ఎలాంటి పిలుపునిచ్చిన ముందుగానే అరెస్టులు చేస్తున్నారు అని బీజేవైఎం ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షుడు పైళ్ళ ప్రశాంత్ అన్నారు. కాంగ్రెస్‌కు వేరే పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను కొనుక్కోవడం మీద ఉన్న శ్రద్ధ నిరుద్యోగులకు ఇచ్చిన హామీల మీద లేకపోగా అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు.

ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి అబ్దుల్లాపూర్ మేట్ పర్యటన సందర్భంగా ఆత్మకూరు(ఎం) బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన బీజేవైఎం నాయకులు పోలీస్ స్టేషన్లో నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పైళ్ళ ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శి లోడి మహేష్ గౌడ్, బీజేవైఎం మండల అధికార ప్రతినిధి పొన్నగాని సూర్య ప్రకాష్, సోషల్ మీడియా మండల కన్వీనర్ బండారు సాయి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

**బీఆర్ఎస్వీ నాయకులు ముందస్తు అరెస్ట్**

డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలంటూ హైదరాబాద్‌లో నిరుద్యోగులు ధర్నా చేస్తుండగా యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూర్ మండలంలో బీఆర్ఎస్వీ మండల యువజన అధ్యక్షుడు బీస కృష్ణంరాజు గౌడ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

# కారులో చిక్కుకున్న వారిని రిస్క్ చేసి కాపాడిన నలుగురు

**విశ్వంభర, ముషీరాబాద్ :** భారీ వర్షం కారణంగా వరదలో యువత రిస్క్ చేసి నలుగురిని కాపాడిన ఘటన ముషీరాబాద్ లోని రాంనగర్ జరిగింది. స్ట్రీట్ నంబర్ 17లో వరద ఉధృతిలో ఓ కారు చిక్కుకుపోయింది. డోర్లు ఎంతకీ ఓపెన్ కాకపోవడంతో నలుగురు ప్రయాణికులు అందులోనే ఉండిపోయారు. స్థానిక యువకుడు ప్రణీత్ యాదవ్, అతడి స్నేహితులు రిస్క్ చేసి కారును గోడ పక్కకు తీసుకొచ్చి అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న వారినిబయటకు తీసుకువచ్చి కాపాడారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**విశ్వంభర, భూపాలపల్లి :** వారంతా చిన్ననాటి స్నేహితులు.. ఒకేచోట చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. భూపాలపల్లి జిల్లా ఇస్సిపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

50 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చెరడంతో సందడి నెలకొంది. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ.. ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకాలను తమ సెల్ఫోన్లలో బంధించుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో హెచ్ ఎం వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయ బృందం హుస్సేన్, బ్రహ్మానందం, రవీందర్, మల్లయ్య, సుధాకర్, రామచంద్రయ్య, సంపత్, తిరుపతి, రాజేందర విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఇండియా కూటమిది అసత్య ప్రచారం

**కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**




**విశ్వంభర, ఢిల్లీ :** విపక్ష ఇండియా కూటమి అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని కేంద్ర మంత్రి, మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ఆరోపించారు. రాంచీలో ఆదివారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జారండ్‌లో కాంగ్రెస్, జేఎంఎం సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. జారండ్‌లో వారు ఐదేండ్ల పాలనను పూర్తిచేసుకుంటున్నారని, ఐదేండ్ల హయాంలో వారి విజయాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. జేఎంఎం మేనిఫెస్టోలో 144 హామీలు ఇచ్చారని, కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో 317 వాగ్ధానాలు చేసిందని, వీటిలో ఐదేండ్ల పాలనలో ఎన్ని హామీలు నెరవేర్చారో వారు వెల్లడించాలని శివరాజ్ చౌహాన్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్, జేఎంఎం సర్కార్ తొక్కిపెట్టిందని దుయ్యబట్టారు. సమాజంలో అన్ని వర్గాలనూ సంకీర్ణ పాలకులు విస్మరించి మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదని ఆరోపించారు. ఎలాంటి హామీ లేకుండా ఏ ఒక్క మహిళకూ వారు రుణాలు ఇవ్వలేదని విమర్శించారు. ఈ ఏడాది జరగనున్న జారండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పాలక కూటమికి భంగపాటు తప్పదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కాషాయ పార్టీ మెరుగైన ఫలితాలు రాబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పంజాబ్‌లో భూకంపం



**విశ్వంభర, ఢిల్లీ :** పంజాబ్ హోషియాపూర్‌లో ఆదివారం భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై 2.6 తీవ్రతతో భూ ప్రకంపనలు వచ్చాయి. దీంతో జనం ఒక్కసారిగా భయాందోళనకు గురై ఇండ్ల నుంచి పరుగులు తీశాయి. సాయంత్రం 4.12 గంటల సమయంలో భూకంపం సంభవించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తించినట్లు నేషనల్ సెంటర్ సిస్మోలజీ సెంటర్ తెలిపింది. స్వల్ప భూకంపం కావడంతో ఎలాంటి ప్రమాదం జరిగినట్లు నివేదికలు అందలేదని అధికార వర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం సైతం హర్యానాలోని ఝూజ్జర్‌లోని మహర్నా సమీపంలో భూకంపం సంభవించింది. భూమికి ఐదుకిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూ అంతర్భాగంలో పలు నిరంతరం కదులుతూ ఉంటాయి. ఈ క్రమంలో ఒక దాంటో ఒకటి ఢీకొన్న సమయంలో భూ ప్రకంపనలు వస్తాయని భూగర్భశాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ది సిస్మిక్ జోనింగ్ మ్యాప్ ప్రకారం.. భూకంపాలను పలు జోన్లుగా విభజించారు. ఆయా జోన్లను భట్టి ప్రమాదం అంచనా వేస్తున్నారు. హోషియార్‌పూర్ ప్రాంతం జోన్-4లో ఉన్నది. రెండో జోన్‌లో తక్కువ ప్రమాదం ఉంటుంది. జోన్-ఐదులో అత్యధిక ప్రమాదం ఉంది. జోన్-2 స్కై బ్లూ, జోన్-3 మూడు యెల్లో, జోన్-ఆరెంజ్, జోన్-5 ఐదు ఎరుపు రంగులో ఉన్నాయి. జోన్-5 అత్యంత ప్రమాదకరంగా భూగర్భ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

# ట్రంప్‌పై జరిగింది హత్యాయత్నమే

- ప్రకటించిన ఎఫ్ బీఐ
- అవన్నీ పేలుడు పదార్థాలే



**విశ్వంభర, యూఎస్ :** రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిందని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ప్రకటించింది. దుండగుడు కాల్పులు జరిపిన ప్రాంతాన్ని ఇంకా అనుమానిత స్థలంగానే పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ సాయంత్రం పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై హత్యాయత్నం జరిగినట్లు ఎఫ్‌బీఐ స్పెషల్ ఏజెంట్ కెవిన్ రొజెక్ అన్నారు. దుండగుడు కాల్పులు జరిపిన ప్రదేశంలో కొన్ని అనుమానిత ప్యాకేజీలను గుర్తించినట్లు వెల్లడించారు. అవన్నీ పేలుడు పదార్థాలుగానే తాము భావిస్తున్నామన్నారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలో కాల్పులు జరిపింది ఎవరనే విషయాన్ని ధ్రువీకరించే పరిస్థితిలో తాము లేమని వెల్లడించారు. దుండగుడి లక్ష్యం ఏంటనేది కూడా ఇంకా తెలియడం లేదన్నారు. కాల్పులకు పాల్పడినట్లు అనుమానిస్తున్న వ్యక్తి వద్ద ఐడీ లేదని, అతని గురించిన వివరాలు తెలుసుకునేందుకు డీఎన్ఏ సేకరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఏమైనా తెలిస్తే ప్రజలు తమకు తెలియజేయాలని, అది దర్యాప్తునకు సహాయపడుతుందని కోరారు.

# ప్రాణాలు తీస్తున్న గన్ కల్చర్

- గతంలో నలుగురు అమెరికా అధ్యక్షుల మృతి
- మరో ముగ్గురు అధ్యక్షులకు గాయాలు



**విశ్వంభర, ఢిల్లీ :** అమెరికాలో గన్‌కల్చర్ ప్రాణాలు తీస్తోంది. తాజాగా ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పుల ఘటన అమెరికాను ఉలిక్కిపడేలా చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్ ర్యాలీలో పాల్గొనగా ఓ దుండగుడు 180 మీటర్ల దూరం నుంచి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ చెవి భాగంలో గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు సిబ్బంది. ఇప్పుడు కాల్పుల ఘటన సంచలనంగా మారింది. అయితే అమెరికా చరిత్రలో ఇప్పటి వరకు దుండగుల కాల్పుల్లో నలుగురు అమెరికా అధ్యక్షులు చనిపోయారు. ఇలాంటి దాడుల్లో ముగ్గురు అగ్రరాజ్య అధ్యక్షులు గాయపడ్డారు. ముగ్గురు మాజీ అధ్యక్షులపై హత్యాయత్నాలు జరిగాయి. అమెరికా 16వ అధ్యక్షుడు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అబ్రహాం లింకన్‌పై వాషింగ్టన్ డీసీలోని ఫోర్డ్స్ థియేటర్‌లో 1865 ఏప్రిల్ 14న దాడి జరిగింది. జాన్ బూత్ అనే నటుడు ఆయనపై కాల్పులు జరిపి హత్యచేశాడు. అమెరికా 20వ అధ్యక్షుడు అయిన జేమ్స్ గర్‌ఫీల్డ్‌పై 1881 జులై 2న దాడి జరిగింది. వాషింగ్టన్‌లోని బాల్టిమోర్-పోటోమ్యాక్ రైల్‌రోడ్ స్టేషన్ దగ్గర దుండగుడు ఆయనపై కాల్పులు జరిపాడు. అయితే ఆయన చికిత్స పొందుతూ అదే ఏడాది సెప్టెంబర్ 19న చనిపోయారు. అమెరికా 25వ అధ్యక్షుడు విలియమ్ మెకెన్లీపై 1901 సెప్టెంబర్ 6లో దాడి జరిగింది. పాన్ ఇండియా ఎక్స్‌పొజిషన్ కార్యక్రమానికి హాజరైన అధ్యక్షుడిపై ఒక దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. తీవ్రంగా గాయపడిన మెకెన్లీ చికిత్స పొందుతూ అదే ఏడాది సెప్టెంబర్ 14న చనిపోయారు.

# ఎట్టకేలకు తెరుచుకున్న రత్న భాండాగారం

- 46 ఏళ్ల తర్వాత తెరుచుకున్న గది
- త్వరలోనే నిధి లెక్కింపు



**విశ్వంభర, ఒడిశా :** ఎట్టకేలకు పూరీ జగన్నాథుడి రత్న భాండాగార గదిని ఒడిశా అధికారులు తెరిచారు. దాదాపు 46 ఏళ్ల తర్వాత రత్న భాండాగారం రహస్య గదిని ఓపెన్ చేసినట్లు సీఎంవో ప్రకటించింది. జగన్నాథుడి సేవలకు ఆటంకం లేకుండా భాండాగారాన్ని తెరిచినట్లు పేర్కొంది. ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను త్వరలో లెక్కించనున్నారు. నిధిని తరలించేందుకు చెక్క పెట్టెలను సిద్ధం చేసినట్లు సీఎం స్పష్టం చేసింది. శ్రీ జగన్నాథ ఆలయ చట్టం ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌కు కట్టుబడి ఉన్నామనిపూరీ జిల్లా కలెక్టర్ సిద్దార్థ్ శంకర్ స్వైన్ వెల్లడించారు. “పూరీలోని 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథ ఆలయానికి 46 ఏళ్ల తర్వాత ఒడిశా ప్రభుత్వం ఆదివారం ఓపెన్ చేసింది. ఖజానా, గృహ అమూల్యమైన ఆభరణాలు మరియు ఇతర విలువైన వస్తువులు, పవిత్రమైన ‘సుబా బేల’ (మంచి సమయం) సమయంలో మధ్యాహ్నం 1:28 గంటలకు అన్‌లాక్ అయ్యాయి. ఇది విస్తృతమైన జాబితా ప్రక్రియకు నాంది పలికింది. తిరిగి తెరవడానికి సన్నాహకంగా, విలువైన వస్తువులను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడానికి ప్రత్యేక పెట్టెలను ఆలయానికి తీసుకువచ్చారు” అని సీఎంఓ తెలిపింది. పూజనీయమైన ట్రెజరీని తిరిగి తెరవడానికి ఆలయంలోకి ప్రవేశించిన 11 మందిలో ఒడిశా మాజీ హైకోర్టు న్యాయమూర్తి బిశ్వనాథ్ రథ్, శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాధీ, సూపరింటెండెంట్ గడానాయక్, పూరీరాజు ‘గజపతి రాజు ప్రతినిధి ఉన్నారు. రత్న భాండాగార్‌ను తెరవడంపై ఒడిశా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన16 మంది సభ్యులతో ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్యానల్ జులై 14న గదిని తెరవాలని సిఫార్సు చేసింది. ఇక్కడి భాండాగారానికి రక్షణగా పాము ఉందని కొంత మంది భావిస్తుంటారు. ఆ వదంతులను బలభద్రుని ప్రధాన సేవకుడైన హలధర్ దశమోహపాత్ర కొట్టిపారేశారు. అయితే ముందు జాగ్రత్తగా అధీకృత సిబ్బంది, పాములు పట్టే వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించారు. భాండాగారాన్ని తెరిచాక ఆభరణాలను తూకం వేయకూడదని వాటిని లెక్కించి రీసీల్ వేయాలని దశమోహపాత్ర తెలిపారు. “మూడు తయారు చేయబడ్డా యి. ఒకటి రత్న భండార్ పునఃప్రారంభానికి సంబంధించినది. రెండవది తాత్కాలిక రత్న భండార్ నిర్వహణకు సంబంధించినది. మూడవది విలువైన వస్తువుల జాబితాకు సంబంధించినది” అని శ్రీ జగన్నాథ ఆలయ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ నిర్వాహకురాలు అరబింద పాధీ తెలిపారు. “ఇన్వెంటరీ పని ఈరోజు ప్రారంభం కాదు. విలువదారులు, స్వర్ణకారులు ఇతర నిపుణుల నిశ్చితార్థంపై ప్రభుత్వం నుండి ఆమోదం పొందిన తర్వాత ఇది జరుగుతుంది” అని ఆయన చెప్పారు. పారదర్శకతను నిర్ధారించడానికి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఇన్వెంటరీ బృందానికి సహాయంగా ఉండ నున్నారు. “ప్రపంచవ్యాప్తంగా ఉన్న జగన్నాథ భక్తుల సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలుకుతూ రేపు ‘రత్న భండార్’ని మళ్లీ తెరుస్తున్నాం. మేము ఆభరణాల స్వభావం, వాటి స్వభావం, నాణ్యత, విలువైన వస్తువులను తూకం వేస్తాము, “అని ఒడిశా న్యాయ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శనివారం విలేకరులతో అన్నారు.’

# నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలీ

- మరోసారి నియామకం
- నేడు ప్రమాణస్వీకారం



**విశ్వంభర, ఢిల్లీ :** నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలీ మరోసారి నియమితులయ్యారు. దేశంలో రాజకీయ సుస్థిరత నెలకొల్పేందుకు కేపీ శర్మ ఓలీ సారధ్యంలో మరో సంకీర్ణ సర్కార్ కొలువు దీరనున్నది. నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలీ నియమితులు కావడం ఇది మూడోసారి. ప్రధానిగా శుక్రవారం ప్రజాప్రతినిధుల సభ విశ్వాసాన్ని నేపాల్ మావోయిస్టు పార్టీ నేత పుష్ప కమాల్ దహల్ ప్రచండ కోల్పోయారు. దీంతో నేపాల్ రాజ్యాంగంలోని 76 (2) అధికరణం ప్రకారం కొత్తగా ఏర్పాటు కానున్న ప్రభుత్వానికి కేపీ శర్మ ఓలీ సారధ్యం వహిస్తారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ -యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్-యూఎంఎల్), నేపాల్ కాంగ్రెస్ (ఎన్‌సీ) పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నాయి. కేపీ శర్మను తదుపరి ప్రధానిగా నేపాల్ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ ఆదివారం నియమించారు. కేపీ శర్మ ఓలీతోపాటు కొత్త క్యాబినెట్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధానిగా ప్రచండ.. పార్లమెంట్ విశ్వాసం కోల్పోయిన తర్వాత నేపాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేర్ బహదూర్ దౌబా మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొంటూ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ కు లేఖ సమర్పించారు. 165 మంది సభ్యులు గల నేపాల్ పార్లమెంటులో సీపీఎన్-యూఎంఎల్ పార్టీకి 77 మంది, నేపాలీ కాంగ్రెస్ పార్టీకి 88 మంది సభ్యులు ఉన్నారు. కేపీ శర్మ ఓలీ ఇంతకు ముందు 2015 అక్టోబర్ 11 నుంచి 2016 ఆగస్టు మూడో తేదీ వరకూ, 2018 ఫిబ్రవరి ఐదో తేదీ నుంచి 2021 జూలై 13 వరకూ నేపాల్ ప్రధానిగా పని చేశారు.



## నలుగురు పిల్లలతో బావిలో దూకిన తల్లి

**మహిళను కాపాడిన స్థానికులు.. పిల్లలు మృతి**

**విశ్వంభర, భోపాల్ :** ఒక తల్లి తన నలుగురు పిల్లలతో కలిసి బావిలోకి దూకింది. ఆ మహిళను స్థానికులు కాపాడారు. దీంతో ఆమె బతకగా నలుగురు పిల్లలు మరణించారు. చిన్నారుల మృతదేహాలను బావి నుంచి పోలీసులు వెలికితీశారు. మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పిపాల్‌ఖేడా గ్రామానికి చెందిన 40 ఏళ్ల సుగ్నా బాయి, ఆమె భర్త రోడు సింగ్ మధ్య శనివారం సాయంత్రం గొడవ జరిగింది. దీంతో భర్త కొట్టడంతో సుగ్నా తన నలుగురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సమీపంలోని స్కూల్‌లో ఆ రాత్రి గడిపింది. ఆదివారం ఉదయం 6 గంటలకు ఒక బావి వద్దకు చేరుకుంది. ఆత్మహత్య చేసుకునేందుకు నలుగురు పిల్లలతో కలిసి బావిలోకి దూకింది. కాగా, గమనించిన స్థానికులు సుగ్నా బాయిని సకాలంలో కాపాడారు. బావి నుంచి ఆమెను బయటకు తీశారు. అయితే ఆమె పిల్లలను కాపాడలేకపోయారు. దీంతో 11 ఏళ్ల అరవింద్, 9 ఏళ్ల అనూష, 6 ఏళ్ల బిట్టు, 3 ఏళ్ల కార్తీక్ బావి నీటిలో మునిగి మరణించారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పిల్లల మృతదేహాలను బావి నుంచి వెలికి తీయించారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మరాఠా రిజర్వేషన్లకు తగ్గట్టే నియామకాలు

**మహారాష్ట్ర సీఎం ఏక్ నాథ్ షిండే ప్రకటన**




**విశ్వంభర, ముంబై :** మరాఠా రిజర్వేషన్లపై మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు చేశారు. తాము చెప్పిన విధంగా మరాఠాలకు పది శాతం రిజర్వేషన్ కల్పించామని, ఓబీసీ, ఇతర వర్గాల రిజర్వేషన్‌లో కోత విధించకుండానే మరాఠా కోటా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, మరాఠా కోటాను అడ్డుకోవాలని పలువురు ప్రయత్నిస్తున్నా కోర్టు స్టే ఇవ్వలేదని అన్నారు. మరాఠా రిజర్వేషన్‌లకు అనుగుణంగా నియామకాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. మరాఠ్వాడాలో కుంబి సర్టిఫికెట్లపై జస్టిస్ షిండే కమిటీ కసరత్తు సాగిస్తున్నదని తెలిపారు. నిన్నటి సమావేశంలో ముందుకొచ్చిన అనేక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని, ఆయా అంశాలపై కసరత్తు సాగిస్తుందని సీఎం షిండే వెల్లడించారు.

# కాంగ్రెస్ సొంత బలంతో గెలవలేదు

**యూపీ బీజేపీ చీఫ్ భూపేంద్రసింగ్**



**విశ్వంభర, యూపీ :** కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలోనూ తన సొంత బలంతో గెలవలేదని యూపీ బీజేపీ చీఫ్ భూపేంద్ర సింగ్ చౌధురి అన్నారు. ముస్లిం మైనారిటీల ఓట్లను కొల్లగొట్టేందుకు ఎస్పీ, కాంగ్రెస్ వారిని భయపెట్టాయని ఆరోపించారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలోకి వచ్చి అందరినీ ఒకేతాటిపైకి తీసుకురావడం తమ ముందున్న భారీ సవాల్ అని ఆయన పేర్కొన్నారు. యూపీ బీజేపీ వర్కింగ్ కమిటీ సమావేశంలో భూపేంద్ర సింగ్ మాట్లాడారు. ముస్లిం ఓటు బ్యాంక్‌ను గంపగుత్తా పొందడంపై కాంగ్రెస్ పనిచేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నడూ తన సొంత బలంతో రాష్ట్రాల్లో విజయం సాధించలేదని, ఇతర పార్టీల మద్దతుతో విజయం సాధిస్తోందని దుయ్యబట్టారు. గత మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ వివిధ పార్టీలతో కాంగ్రెస్ కూటమి కట్టిందని చెప్పారు. సమాజ్‌వాదీ పార్టీ పూర్తిగా బంధుప్రీతి పార్టీగా మారిందని, ఆ పార్టీ రామ్ మనోహర్ లోహియా సిద్ధాంతాలను అనుసరించడం లేదని బీజేపీ నేత ఆరోపించారు. కాగా, వివిధ రాష్ట్రాల్లో జరిగిన 13 అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో బీజేపీకి భారీ షాక్ తగిలింది. 11 స్థానాల్లో విపక్ష ఇండియా కూటమి విజయకేతనం ఎగురవేయగా, బీజేపీ కేవలం 2 స్థానాల్లోనే గెలుపొందింది. ఓ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఉప ఎన్నికల్లో ఓటమిని తమ పార్టీ అంగీకరిస్తుందని, ఓటమికి తాము ఈవీఎంలను కానీ, ఎన్నికల కమిషన్‌ను కానీ నిందించబోమని బీజేపీ నేత షజియ ఇల్మి పేర్కొన్నారు. విపక్షాలు మాత్రం వివిధ ఎన్నికల్లో ఓటమిపాలైనా ఇప్పటి వరకూ తమ ఓటమిని అంగీకరించలేదని, వారు నిత్యం ఈవీఎంలను నిందిస్తారని తాము హుందాగా ఓటమిని అంగీకరించడంతో విపక్షాల డొల్లతనం బయటపడిందని ఆరోపించారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచింది కాంగ్రెస్ పార్టీయేనని సంవిధాన్ హత్యా దివస్ వెల్లడిస్తున్నదని ఆమె పేర్కొన్నారు.



## ఎమర్జెన్సీపై ఇప్పుడెందుకు చర్చ..?

**చిదంబరం కామెంట్లు**

**విశ్వంభర, ఢిల్లీ :** బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు.. 50 ఏళ్ల తర్వాత ఎమర్జెన్సీ తప్పొప్పుల గురించి మాట్లాడుతుండటంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు పీ చిదంబరం విమర్శలు చేశారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జూన్ 25వ తేదీని ‘సంవిధాన్ హత్యా దివస్’గా ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. దేశంలో ఇప్పుడున్న వాళ్లలో 75 శాతం మంది 1975 నాటి ఎమర్జెన్సీ తర్వాత పుట్టినవాళ్లేనని, 50 ఏళ్ల నాటి విషయంపై ఇప్పుడు తప్పొప్పులు ఎంచడం దేనికని ఆయన ప్రశ్నించారు. ఎన్డీఏ నేతలు 18వ శతాబ్దం, 17వ శతాబ్దం నాటి అంశాల్లోకి కూడా ఎందుకు వెళ్లకూడదని చిదంబరం ఎద్దేవా చేశారు. ఎమర్జెన్సీ విధించడం తప్పేనని అప్పట్లో ఇందిరాగాంధీ కూడా ఒప్పుకున్నారని, ఇప్పుడు ఆ అంశంపై రాద్ధాంతం దేనికని ప్రశ్నించారు.



# ప్రాణాలు తీసిన కాలరాత్రి

- తెల్లారితే గృహ ప్రవేశం
- ఇంతలోనే ఇల్లు కూలి దంపతుల మృతి

**విశ్వంభర, అనంతపురం :** విధి ఎంత విచిత్రమైనదో ఈ సంఘటన చూస్తే అర్థమవుతుంది. ఆ ఒక్క రాత్రి గడిస్తే బతికే వాళ్ళు. తెల్లారితే గృహప్రవేశం.. కొత్త ఇంట్లోకి వెళుతున్నాం అన్న సంతోషంతో ఉన్నారు. తమ కల సాకారమైందని కలలు కంటూ నిద్రపోయిన ఆ దంపతులకు అదే చివరి రాత్రి అయ్యింది. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం హావళిగికి చెందిన మారెప్ప (49), లక్ష్మి (45) కొత్త ఇల్లు నిర్మించుకున్నారు. రైస్ మిల్లులో కార్మికుడిగా పనిచేసే మారెప్ప దంపతులు కష్టపడి డబ్బులు కూడబెట్టి కొత్త ఇల్లు నిర్మించుకున్నారు. ఈరోజు మారెప్ప దంపతులు కొత్త ఇంట్లోకి గృహప్రవేశం చేయనున్నారు. ఈ క్రమంలో మారెప్ప, లక్ష్మీ దంపతులు గృహప్రవేశానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ముందురోజు తమ పాత పెంకుటింటిలో పడుకున్నారు. రాత్రి కురిసిన వర్షం కారణంగా మట్టి గోడలు బాగా తడిచి అర్ధరాత్రి ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలింది. మారెప్ప, లక్ష్మి దంపతులు నిద్రిస్తుండగా వారిపై పడింది. దీంతో భార్యాభర్తలిద్దరూ శిథిలాల కింద పడి చనిపోయారు. పక్కన వేరే గదిలో నిద్రిస్తున్న కూతురు, కుమారుడు, బంధువులకు స్వల్ప గాయాలయ్యాయి. తెల్లారితే గృహప్రవేశం చేసి కళకళలాడుతూ ఉండాల్సిన మారెప్ప, లక్ష్మి దంపతుల ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో తమ జీవితం ఆనందమయంగా ఉంటుందని ఎన్నో కలలతో పడుకున్న మారెప్ప, లక్ష్మి దంపతులు తమకు ఇదే చివరి రాత్రి అయింది. ఈ ఒక్క రాత్రి గడిస్తే భార్యభర్తలు బతికే వాళ్ళు అని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. విధి ఎంత బలీయమైనదో.. ఏ క్షణం ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు అనడానికి ఈ విషాద ఘటన నిలువెత్తు ఉదాహరణ అంటూ చర్చించుకుంటున్నారు.

# చంద్రబాబు ఆ పని చేస్తే కేసీఆర్‌కు తిరుగుండదేమో..!

**విశ్వంభర, అనంతపురం :** తెలంగాణ సెంటిమెంట్ అనేది అతిపెద్ద అంశం. దాన్ని ఎవరు ముట్టుకున్నా సరే మాడి మసైపోతారు. పార్టీలకు అతీతంగా తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవాన్ని ఎంత పెద్ద ఎత్తున చూపిస్తారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అందుకే ఆంధ్రా లీడర్లు వచ్చి తమపై పెత్తనం చేయడాన్ని వారు అస్సలు సహించరు. అది చంద్రబాబు అయినా.. జగన్ అయినా లేదంటే పవన్ కల్యాణ్ అయినా సరే. తెలంగాణ సెంటిమెంట్ అనేది రాష్ట్రాన్ని దావానంలా కాల్చేస్తుంది. మనోడు మనకు ఉండాలి గానీ.. ఆంధ్రా వాళ్లు మనల్ని పరిపాలించడం ఏంటనేది వారిలో బలంగా నాటుకుపోయింది. మొన్న చంద్రబాబు నాయుడు సీఎం అయిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యేందుకు హైదరాబాద్ వచ్చారు. ఆ సందర్భంగా ఆయనకు వెల్ కమ్ చెబుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. దానిపై సోషల్ మీడియాలో తెలంగాణ యువత తీవ్రంగా విమర్శలు చేసింది. మా మీద మీ పెత్తనం ఏంటని వారంతా మండిపడ్డారు. విడిపోయిన తర్వాత మళ్లీ ఆంధ్రా వాళ్ల



ఫ్లెక్సీలు ఇక్కడ ఎందుకు అంటూ కామెంట్లు చేశారు. దాంతో దెబ్బకు ఆ ఫ్లెక్సీలను తీసిపడేశారు. అయితే ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు తెలంగాణలో టీడీపీని బలోపేతం చేస్తానంటూ చెబుతున్నారు. ఇదే ఇప్పుడు బీఆర్ఎస్‌కు మళ్లీ ఆశలు చిగురింపజేస్తోంది. ఎందుకంటే ఇప్పుడు బీఆర్ఎస్ బలంగా పోరాడటానికి ఒక దారి దొరకట్లేదు. అదే చంద్రబాబు నాయుడు టీడీపీని ఇక్కడ రంగంలోకి దింపితే అప్పుడు ఆటోమేటిక్‌గా తెలంగాణ సెంటిమెంట్ అనేది రాజుకుంటుంది. దాంతో కేసీఆర్ ఆటోమేటిక్‌గా బాగా పాపులర్ అయిపోతారు. మళ్లీ ఆయన కేంద్రంగా రాజకీయాలు జరుగుతాయి. తెలంగాణ హక్కులను కాపాడే పార్టీ అంటే అందరికీ టక్కున బీఆర్ ఎస్ గుర్తుకు వస్తుంది. దానికి తోడు కేసీఆర్ రగిల్చే సెంటిమెంట్ కూడా వర్కౌట్ అవుతుంది. అప్పుడు మళ్లీ తెలంగాణ ప్రజల దృష్టి బీఆర్ ఎస్ వైపు మళ్లుతుంది. దాంతో బీఆర్ఎస్ గ్రాఫ్ అమాంతం ఆకాశానికి పాకుతుంది. కాబట్టి చంద్రబాబు వల్ల మళ్లీ కేసీఆర్ సీఎం అయ్యే అవకాశాలు కూడా మెండుగా ఉంటాయి. గత 2018 ఎన్నికల సమయంలో చంద్రబాబు వచ్చి తెలంగాణలో పోటీ చేస్తే కేసీఆర్ సెంటిమెంట్ బలంగా పనిచేసింది. ఇప్పుడు కూడా మళ్లీ అలాంటి పరిస్థితి రిపీట్ అవుతుందని ఆయన నమ్ముతున్నారు. చూడాలి మరి చంద్రబాబు ఏం చేస్తారో.

# ఐదు నెలల చిన్నారిపై అత్యాచారం

- దారుణానికి ఒడిగట్టిన దుర్మార్గుడు
- నిందితుడి అరెస్ట్

**విశ్వంభర, విజయనగరం :** కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ నీచుడు ఆరు నెలల చిన్నారిపై పైశాచికత్వం చూపించాడు. ఊయలలో పడుకున్న చిన్నారిని అత్యాచారం చేశాడు. విజయనగరం జిల్లాలో ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలానికి చెందిన ఓ మహిళకు ఇద్దరు కూతుళ్లు. ఆరు నెలల వయసున్న తన చిన్న కూతుర్ని ఊయలలో పడుకోబెట్టి.. ఆమె దగ్గరలోని కిరాణ దుకాణానికి వెళ్లింది. ఇది గమనించిన నార్లవలస గ్రామానికి చెందిన బోయిన ఎరకన్న దొర ఇంట్లోకి వెళ్లి ఆ చిన్నారిపై అత్యాచారం చేశాడు. దీంతో ఆ పాప గట్టిగా ఏడ్చింది. ఇది విన్న చిన్నారి వాళ్ల అక్క అక్కడకు వెళ్లి ఆ దారుణాన్ని చూసింది. వెంటనే కిరాణానికి వెళ్లిన తల్లి దగ్గరకు వెళ్లి జరిగిందంతా చెప్పింది. దీంతో తల్లితో పాటు స్థానికులు అందరూ ఆగ్రహంతో వెళ్లారు. అది గమనించిన ఎరకన్న దొర అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం రక్తస్రావమైన చిన్నారిని బాడంగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం చిన్నారి క్షేమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా గ్రామానికి వెళ్లి స్థానికుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం నార్లవలసకు వెళ్లి నిందితుడిని అరెస్టు చేశారు.





# కశ్మీర్ ఫైల్స్ తరహాలో విశాఖ ఫైల్స్

## ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కీలక ప్రకటన

**విశ్వంభర, విశాఖపట్నం :** సింహాచల భూసమస్యలపై త్వరలోనే సమావేశం నిర్వహిస్తామని టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. విశాఖ 2041 మాస్టర్ ప్లాన్‌ను రివైజ్ చేస్తామని తెలిపారు. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో గంటా మాట్లాడుతూ.. వైజాగ్‌లో వైసీపీ భూదందాలపై ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కశ్మీర్ ఫైల్స్ తరహాలో త్వరలోనే విశాఖ ఫైల్స్ విడుదల చేస్తామని అన్నారు. విశాఖ భూ ఆక్రమణల్లో సీఎస్ స్థాయిలో పనిచేసిన వ్యక్తులు ఉన్నారని సంచలన ఆరోపణలు చేశారు. కొత్తగా ఆక్రమణలకు తావులేకుండా పంచగ్రామాల సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అభివృద్ధిపైనే సీఎం చంద్రబాబు దృష్టి పెట్టారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే కేవలం 30 రోజుల్లోనే కీలక హామీలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. డీఎస్సీ, ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటి వాటిపై సంతకాలు పెట్టిన విషయాలను గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావుకు ఈసారి మాత్రం నిరాశే ఎదురైంది. ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. దీంతో ఆయన అసంతృప్తిలో ఉన్నారనే వార్తలు కొద్దిరోజులుగా ప్రచారం అవుతున్నాయి. ఈ క్రమంలో వాటిని పట్టించుకోకుండా.. ఎప్పుడూ మీడియాలో కనిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజులకే రిషికొండ భవనాల వద్దకు వెళ్లి తనతో పాటు మీడియాను తీసుకెళ్లి రచ్చ చేశారు. రుషికొండ ప్యాలెస్‌లోని బాత్‌రూమ్‌లు, ఇతర కాస్ట్‌లీ ఫర్నీచర్ చూపిస్తూ ఆయన చేసిన వీడియో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద దుమారమే రేపింది. ఇప్పుడు తాజాగా విశాఖ ఫైల్స్ తీస్తామని చెప్పడం సంచలనంగా మారింది.

# జగన్ వల్లే వ్యవస్థలు నిర్వీర్యం

## ఎమ్మెల్యే బాలకృష్ణ విమర్శలు



**విశ్వంభర, హిందూపురం :** గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఇసుక, మద్యం అమ్మకాల్లో భారీ స్కామ్ జరిగిందని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లాలోని హిందూపురం రూరల్ పరిధిలోని కొటిపిలో అర్థాంతరంగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్లను ఆదివారం నాడు బాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలల్లోనే టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొత్త టెక్నాలజీతో బ్రిక్‌లెస్ ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఒక్కొక్క శాఖలో జరిగిన అవినీతి బయటపడుతోందని తెలిపారు. త్వరలో మరిన్ని శాఖల్లో జరిగిన అక్రమాలు బయటకు వస్తాయని అన్నారు. వైసీపీ నాయకులు వ్యవస్థలు అన్నింటినీ నాశనం చేశారని మండిపడ్డారు. ఇసుక, మద్యం, మైనింగ్‌లో కమీషన్ల కోసం అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. రిపాలన చేయడం చేతగాక మూడు రాజధానులు, నవరత్నాల పేరుతో మోసం చేశారని గత ప్రభుత్వాన్ని బాలకృష్ణ విమర్శించారు. గతంలో హిందూరం ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది ఎన్టీఆర్ అని.. ఆయన ఆశయాలను కొనసాగిస్తానని బాలకృష్ణ తెలిపారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని చెప్పారు.


# శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

## దర్శనానికి నాలుగు గంటల సమయం

**విశ్వంభర, శ్రీశైలం :** జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున దేవాలయానికి భక్తులు పోటెత్తారు. వరుసగా శని, ఆదివారాలు సెలవు దినాలు రావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో క్షేత్రం పరిసరాలన్నీ సందడిగా మారింది. వేకువ జాము నుంచే భక్తులు పాతాళగంగలో స్నానాలు ఆచరించారు. ఆ తర్వాత భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ కంపార్ట్‌మెంట్లలో బారులు తీరి దర్శనాలు చేసుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. మరికొందరు భక్తులు స్వామివారి భక్తులు రుద్రాభిషేకం, కుంకుమార్చన అభిషేకార్చనలు తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో పెద్దిరాజు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లలో బారులు తీరిన భక్తులకు అల్పాహారం, పాలు, బిస్కెట్స్, మంచినీరు అందించినట్లు అధికారులు తెలిపారు. సోమవారం సైతం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# విశాఖకు చంద్రబాబు మరో గుడ్ న్యూస్

- పట్టాలెక్కనున్న మెట్రో రైల్
- మెట్రో నివేదికలో మార్పులు




**విశ్వంభర, విశాఖపట్నం :** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవలే విశాఖపట్నంలో పర్యటించిన సందర్భంగా డిజైన్‌కు సంబంధించి కొన్ని మార్పు చేర్పులను అధికారులకు సూచించారు. స్తంభాల చుట్టుకొలత పెంచడంతోపాటు కొన్నింటిని అదనంగా నిర్మించడం, వంతెనల పొడవు, వెడ్పుల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. మెట్రోకు ఉపయోగపడేలా విశాఖ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ 12 ఫ్లైఓవర్లను నిర్మించబోతోంది. ఈ ఫ్లైఓవర్లకు అనుగుణంగా డిజైన్ లో మార్పుచేర్పులుండాలని ఏపీ మెట్రోరైలు కార్పొరేషన్ ఎండీ యూజేఎం రావుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. దీంతో మెట్రోకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలో కొన్ని మార్పులు చేయబోతున్నారు. మెట్రోకు రెండింటికీ ఉపయోగపడేలా నిర్మాణాలు చేపట్టబోతున్నారు. వంతెనలను నిర్మించిన తర్వాత మళ్లీ వంతెనలు నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తుతాయి కాబట్టి ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ హయాంలో 140 కిలోమీటర్ల వైసీపీ హయాంలో విజయవాడలో ఉన్న మెట్రో కార్యాలయాన్ని విశాఖకు తరలించారు. ఈ ప్రాజెక్టుపై 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రీబిడ్ నిర్వహించగా ఐదు సంస్థలు ఆసక్తి చూపించాయి. ఎస్సెల్ ఇన్ ఫ్రా కన్సార్టియం ఫైనాన్షియల్ బిడ్ దాఖలు చేయగా.. తర్వాత ఎన్నికలు రావడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రక్రియ మొత్తం ఆగిపోయింది. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం అనకాపల్లి నుంచి భోగాపురం వరకు 140 కిలోమీటర్లు మెట్రో నిర్మించాలని డీపీఆర్ మార్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 46 కిలోమీటర్ల మేరకు ముందుగా మెట్రో నిర్మాణం చేపట్టి, తర్వాత భోగాపురం విమానాశ్రయానికి విస్తరించాలనే యోచనలో ఉంది.

# ముద్రగడ కేంద్రంగా రాజకీయాలు

- తీవ్రంగా తప్పుబడుతున్న జనసైనికులు
- కాపు సంఘం నాయకుల్లోనూ అసంతృప్తి

**విశ్వంభర, విశాఖపట్నం :** ముద్రగడను తూర్పుగోదావరి నేతలు ఇప్పట్లో వదిలేలా లేరు. మొన్నటివరకు జనసేన కార్యకర్తలు, ఇప్పుడు కాపు సంఘం నేతలు తోడయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కాపు రిజర్వేషన్లు, స్పెషల్ స్టేటస్ సాధించాలన్న ముద్రగడ కామెంట్లపై విరుచుకుపడుతున్నారు. పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్న ముద్రగడకు కాపు రిజర్వేషన్ల సంగతి ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు ముగిసినా తూర్పు గోదావరి జిల్లా రాజకీయాలు ఇంకా హాట్ హాట్‌గానే ఉన్నాయి. ప్రధానంగా కాపు నేత ముద్రగడ పద్మనాభం సెంట్రిక్‌గా పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి. గత ఎన్నికల్లో జగన్ తరపున పనిచేసిన ముద్రగడ.. పవన్‌ను ఓడించకపోతే పేరు మార్చుకుంటానని సవాల్ చేశారు. ఎన్నికల్లో వైసీపీ ఓటమి, పవన్‌తో సహా జనసేన సూపర్ విక్టరీతో.. ముద్రగడ సవాల్‌ను గుర్తుచేస్తూ.. జనసేన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నల వర్షం కురిపించడంతో.. పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్నారు. ఎన్నికల సమయంలో పవన్‌ను నానా మాటలు అన్నారని.. మొన్నటి వరకు జనసేన కార్యకర్తలు ముద్రగడను ప్రశ్నిస్తూ పోస్టులు పెట్టారు. ఉత్తరాలు కూడా రాశారు. జనసేన కార్యకర్తల వేధింపులపై స్వయంగా ముద్రగడే బయటకు వచ్చి.. ఇక ఆపండి మహాప్రభో అంటూ వేడుకున్నారు. వేధించడం కంటే.. ఎవరినైనా పంపి చంపేయండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో.. ఎన్నికల్లో గెలిచిన పవన్‌కు అభినందనలు చెప్తూ.. కాపు రిజర్వేషన్, స్పెషల్ స్టేటస్ తేవాలని డిప్యూటీ సీఎం పవన్‌ను కోరారు. ఇదే ఇప్పుడు.. మరో రచ్చకు దారి తీసింది.జనసేన కార్యకర్తలకు.. ఇప్పుడు కాపు సంఘం నాయకులు కూడా



తోడయ్యారు. పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్న ముద్రగడ మా కాపు రిజర్వేషన్ల అంశం మీకెందుకు అంటూ ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. జగన్ హయాంలో కాపు రిజర్వేషన్లపై ఎందుకు మాట్లాడలేదో ముద్రగడను ప్రశ్నించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న హయాంలో కాపు కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు.. ఇడబ్ల్యూఎస్ కింద 5 శాతం వాటా ఇచ్చారని గుర్తు చేశారు. జగన్ ఈడబ్ల్యూఎస్ వాటా తీసేస్తే ఎందుకు మాట్లాడ లేదని, విద్యుత్ చార్జీలు పెంచితే ఎందుకు ఉద్యమిం చలేదని ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు కాపు సంఘం నేతలు. పవన్ సొంత డబ్బులను కౌలు రైతులకు పంచారని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్న చంద్రబా బుపై ఎందుకంత ద్వేషం అని ఫ్లెక్సీలు ప్రదర్శించారు. ముద్రగడ లేఖలు రాయడం, ప్రశ్నించడం ఇకనైనా మానుకోవాలని హితవు పలుకుతున్నారు కాపు సంఘం నేతలు. పద్మనాభరెడ్డిగా పేరు మార్చుకున్న ముద్రగడకు తమ రిజర్వేషన్లు, హక్కులపై మాట్లాడే హక్కు లేదంటున్నారు.




# విజయవాడ దుర్గగుడి ఘాట్ రోడ్డు మూసివేత

**విశ్వంభర, విజయవాడ :** విజయవాడ దుర్గగుడి ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. భారీ వర్షాల కారణంగా ఘాట్ రోడ్డులోని కొండచరియలు విరిగిపడుతుండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శనివారం రాత్రి నుంచే ఘాట్ రోడ్డు మార్గాన్ని మూసివేసినట్లుగా అధికారులు తెలిపారు. ఘాట్ రోడ్డు మూసివేసిన నేపథ్యంలో మహామండపం నుంచి మాత్రమే ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులను అనుమతిస్తున్నారు. దుర్గా ఘాట్ నుంచి దేవస్థానం బస్సులను మాత్రమే అనుమతిస్తున్నారు. కాగా, ఆషాఢ మాసం సందర్భంగా, పైగా ఆదివారం కావడంతో సారె సమర్పించేందుకు వచ్చే భక్తులతో ట్రాఫిక్ చాలాసేపు నిలిచిపోయింది. దీంతో దుర్గమ్మ భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంలోనూ ఆలయానికి భక్తులు పోటెత్తారు.

# చెలరేగిన ముకేశ్..

## ఐదో టీ20లో టీమిండియా జయభేరి



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా ఆఖరి మ్యాచ్‌లోనూ పంజా విసిరింది. నామమాత్రమైన ఐదో టీ20లో జింబాబ్వేపై 42 పరుగుల తేడాతో గెలుపొందింది. భారీ ఛేదనలో భారత బౌలర్ ముకేశ్ కుమార్ (4/22) విజృంభణకు ఆతిథ్య జట్టు బ్యాటర్లు విలవిలలాడారు. డియాన్ మయర్స్(34), తడివనశె మ-రుమని (27)లు పోరాడినా మిగతా బ్యాటర్లు చేతులెత్తేయడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పించుకోలేకపోయింది. దాంతో, భారత జట్టు 4-1తో సిరీస్ కైవసం చేసుకుంది. 167 పరుగుల ఛేదనలో పేసర్ ముకేశ్ కుమార్ (4/22) నిప్పులు చెరగడంతో జింబాబ్వే 125 పరుగులకే ఆలౌటయ్యింది. బ్యాటుతో, బంతితో రాణించిన శివం దూబే (26, 2/25) 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', వాషింగ్టన్ సుందర్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యారు. టీమిండియా నిర్దేశించిన లక్ష్య ఛేదనలో తొలి ఓవర్లోనే జింబాబ్వేకు ముకేశ్ షాక్ ఇచ్చాడు. ఓపెనర్ , వెస్లీ మధెవెరె(0)ను బౌల్డ్ చేసి బ్రేకిచ్చాడు. ఆ తర్వాత తడివనషె మరుమని(27), బ్రియాన్ బెన్నెట్(10)లు ఆచితూచి ఆడినా.. ముకేశ్ మరో వికెట్ తీసి ఆతిథ్య జట్టును ఒత్తిడిలోకి నెట్టాడు. అనంతరం డియాన్ యెర్స్(34), సికిందర్ రజా(8)లు సైతం ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయారు. చివర్లో ఫరాజ్ అక్రమ్ (27) ధాటిగా ఆడాడు. అయితే.. ముకేశ్ తన 19వ ఓవర్లో రెండు వికెట్లు తీయడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ 125 వద్ద ముగిసింది. నామమాత్రమైన ఐదో టీ20లో భారత జట్టు ఆతిథ్య జట్టుకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. గత మ్యాచ్ హీరోలు యశస్వీ జైస్వాల్(12), శుభ్‌మన్ గిల్ (13)లు స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. సెంచరీ వీరుడు అభిషేక్ శర్మ(14) సైతం నిరాశపరిచగా 40 పరుగులకే 3 కీలక వికెట్లు పడ్డాయి. ఆ దశలో సంజూ శాంసన్ (58) పట్టుదలగా ఆడాడు. రియాన్ పరాగ్(22)తో కలిసి నాలుగో వికెట్‌కు 65 పరుగులు జోడించి జట్టు స్కోర్ 100 దాటించాడు. హాఫ్ సెంచరీ కొట్టాక భారీ షాట్ ఆడబోయి శాంసన్ ఔటైనా.. చివర్లో శివం దూబే(26 నాటౌట్) బౌండరీలతో విరుచుకుపడ్డాడు. గరవ వేసిన 19వ ఓవర్లో వరుసగా 4, 6, 4 కొట్టాడు. ఆఖరి ఓవర్లో దూబే రనౌట్ అయ్యాక రింకూ సింగ్(11 నాటౌట్) సిక్సర్, ఫోర్ బాదడంతో టీమిండియా 167 రన్స్ చేసింది. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబని రెండు వికెట్లు పడగొట్టాడు.

## యశస్వీ జైస్వాల్ అరుదైన రికార్డు



భారత భావి తారగా పేరొందని యశస్వీ జైస్వాల్ మరో రికార్డు నెలకొల్పాడు. పొట్టి ఫార్మాట్‌లో దంచికొడుతున్న ఈ యువకెటరం జింబాబ్వే తో జరిగిన ఐదో టీ20లో అరుదైన ఘనత సాధించాడు. సికిందర్ రజా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే తొలి రెండు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. దాంతో అంతర్జాతీ టీ20ల్లో డబుల్ సిక్సర్ బాదిన రెండో క్రికెటర్‌గా యశస్వీ చరిత్ర సృష్టించాడు. తద్వారా ఈ లెఫ్ట్ హ్యాండర్ టాంజానియా ఆటగాడు ఇవాన్ సెలెమణి సరసన చేరాడు. రెండేండ్ల క్రితం రువాండాపై సెలెమణి ఇన్నింగ్స్ ఆరంభ ఓవర్ తొలి రెండు బంతుల్ని సిక్సర్‌గా మలిచాడు. హారారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సికిందర్ రజా తొలి ఓవర్ వేశాడు. తొలి బంతినే యశస్వీ సిక్సర్‌గా మలిచాడు. అది నో బాల్ కావడంతో వచ్చిన ఫ్రీ హిట్‌ను సైతం స్టాండ్స్‌లోకి పంపించేశాడు. దాంతో, ఒకే బంతికి 12 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో సంజూ శాంసన్ (58) హాఫ్ సెంచరీతో మెరవగా జింబాబ్వేకు భారత జట్టు 168 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.



# టీమిండియా మాజీ ఆటగాడికి కోటి సాయం

**• ప్రకటించిన బీసీసీఐ • క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక సాయం**

**విశ్వంభర, ఢిల్లీ :** క్యాన్సర్‌తో బాధపడుతున్న టీమిండియా మాజీ ఆటగాడు అన్షుమాన్ గైక్వాడ్ చికిత్స కోసం కోటి రూపాయలు ఇవ్వనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి జైషా సూచించారు. దీని ద్వారా, చికిత్స కోసం ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న భారత జట్టు మాజీ ఆటగాడికి సహాయం చేసింది. భారత జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ గత కొన్ని రోజులుగా అన్షుమన్ గైక్వాడ్ చికిత్స కోసం సహాయం కోసం వేడుకుంటున్నాడు. అయితే, బీసీసీఐ నుంచి సానుకూల స్పందన రాలేదు. దీంతో విసిగిపోయిన కపిల్ దేవ్.. తన పెన్షన్ మొత్తాన్ని అన్షుమన్ గైక్వాడ్‌కు చికిత్స కోసం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. ఈ ప్రకటన వైరల్ కావడంతో బీసీసీఐపై సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తమైంది. ఆ తర్వాత, ఇప్పుడు భారత జట్టు మాజీ ఆటగాడి చికిత్స కోసం కోటి రూపాయలు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. అన్షుమన్, నేను కలిసి ఆడాం. ఇప్పుడు అతన్ని ఈ స్థితిలో చూడలేను. ఎవరూ ఇలాంటి బాధ పడకూడదు. అతడి చికిత్సకు సహకరించాల్సిందిగా బీసీసీఐని అభ్యర్థించాను. భారత క్రికెట్ బోర్డు అతనికి అండగా నిలవాలని కపిల్ దేవ్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఈ ఇంటర్వ్యూ వీడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇప్పుడు ఈ వీడియో బీసీసీఐ కార్యదర్శి జై షా దృష్టికి వెళ్లే అవకాశం ఉంది. అందుకే ఒక్కరోజులో చికిత్సకు అవసరమైన సాయం అందించాలని ఖడక్ ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం అన్షుమన్ గైక్వాడ్ చికిత్స కోసం కోటి రూపాయాలు విడుదల చేసింది.

### ఈ అన్షుమాన్ గైక్వాడ్ ఎవరు?

71 ఏళ్ల గైక్వాడ్ 80ల్లో టీమ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు. భారత్ తరఫున 40 టెస్టు మ్యాచ్‌లు ఆడిన అన్షుమన్ 1 డబుల్ సెంచరీ, 2 సెంచరీలు, 10 అర్ధసెంచరీలతో 1985 పరుగులు చేశాడు. అలాగే, 15 వన్డేలు ఆడిన అన్షుమాన్ 1 హాఫ్ సెంచరీతో 269 పరుగులు చేశాడు. అయితే, అన్షుమాన్ గైక్వాడ్‌కు కోచ్‌గా పేరు తెచ్చిపెట్టింది. 1997 నుంచి 2000 వరకు భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా కనిపించిన అన్షుమాన్.. బలమైన భారత జట్టును నిర్మించాడు. ఈ కాలంలో, షార్జాలో జరిగిన ప్రసిద్ధ కోకాకోలా కప్, పాకిస్థాన్‌తో జరిగిన ఢిల్లీ టెస్టులో భారత జట్టు విజయం సాధించింది. అతను ప్రస్తుతం బ్లడ్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్స కోసం భారత క్రికెట్ బోర్డు కోటి రూపాయలు ఇస్తామని ప్రకటించింది.




# పీఎఫ్ సొమ్ముతో హెూమ్‌లోన్ క్లియర్ చేస్తున్నారా..?

**విశ్వంభర, బిజినెస్ :** ఆర్‌బీఐ ఇటీవల గృహ రుణాలపై కీలకమైన రెపో రేట్లను కొనసాగించినప్పటికీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో సహా పలు బ్యాంకులు తమ రెపో-లింక్డ్ హెూమ్ లోన్ రేట్లను మార్చి 2024లో 10-15 బేసిస్ పాయింట్లు పెంచాయి. ఫలితంగా గృహ రుణాలపై వడ్డీ రేట్లు 8.70 శాతం నుంచి 9.80 శాతం వరకు ఉన్నాయి. దీంతో గృహ రుణ చెల్లింపుదారులకు ఈఎంఐలు కట్టడం భారంగా మారింది. దీంతో రుణ ముందస్తు చెల్లింపు గానీ, పొడిగించిన రుణ కాల వ్యవధిని ఎంచుకోవాల్సి వస్తుంది. చాలా మంది రుణ గ్రహీతలు తమ రుణాలను త్వరగా క్లియర్ చేయాలనే ఆసక్తితో పొదుపు లేదా వారి ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాల వంటి పెట్టుబడులను ఉపయోగిస్తున్నారు. అయితే పొదుపుతో గృహ రుణం తిరిగి చెల్లిస్తే పర్లేదు కానీ, ఈపీఎఫ్ ఉపసంహరణ ద్వారా రుణం చెల్లించాలనుకునే వాళ్లు ఓ సారి ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈపీఎఫ్ ఉపసంహరణపై నిపుణుల సూచనలను ఓ సారి తెలుసుకుందాం. హెూమ్ లోన్ రీపేమెంట్ కోసం మీ ఈపీఎఫ్ ఉపసంహరణ నిర్ణయం తీసుకునే ముందు ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఈపీఎఫ్ పొదుపులు వడ్డీతో పాటు పెరుగుతాయి. పైగా ఈపీఎఫ్ సొమ్ము మీ రిటైర్మెంట్ పొదుపులో ముఖ్యమైన భాగం. ఈ నిధులను విత్‌డ్రా చేయడం వల్ల ఈ మొత్తం తగ్గిపోతుంది. దీని ఫలితంగా పదవీ విరమణ ప్రయోజనాలు తగ్గుతాయి. గృహ రుణాలపై తక్కువ వడ్డీ రేటును పొందేందుకు రుణ ఏకీకరణ లేదా బ్యాలెన్స్ బదిలీ వంటి ప్రత్యామ్నాయాలను అన్వేషించాలని ఆర్థిక నిపుణులు కూడా సూచిస్తున్నారు. అయితే మీ లోన్‌ని తిరిగి చెల్లించడానికి మీరు ఈపీఎఫ్ ఉపసంహరణను ఎంచుకోవాలా? లేదా? అనేది లోన్ రీపేమెంట్‌కు సంబంధించిన అత్యవసరత, అవసరమైన మొత్తం, మీ మొత్తం ఆర్థిక పరిస్థితి వంటి వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. మీ ఈపీఎఫ్ ఉపసంహరణ ముందు వాటి వల్ల కలిగే నష్టాలను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇది మీ రిటైర్మెంట్ కార్పస్, భవిష్యత్తు ఆర్థిక భద్రతను తగ్గిస్తుంది. మీ ఈపీఎఫ్ ఉపసంహరణకు ముందు మీ హెూమ్ లోన్‌ని నిర్వహించడానికి అన్ని మార్గాలను అన్వేషించడం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. వడ్డీ రేటుపై మళ్లీ చర్చలు జరపడం, లోన్ వ్యవధిని పొడిగించడం లేదా అదనపు చెల్లింపులు చేయడం సాధ్యమేనా? అనే అంశాలపై అవగాహన తెచ్చుకోవాలంటున్నారు. ముఖ్యంగా రుణాన్ని తిరిగి చెల్లించాల్సిన ఆవశ్యకతను అంచనా వేయాలని పేర్కొంటున్నారు. అలాగే ఈపీఎఫ్ ఉపసంహరణలు ఉపసంహరణకు కారణంతో మీ ఉద్యోగ కాల వ్యవధి ఆధారంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్ను ఏ స్థాయిలో ఉంటుందో? ఈపీఎఫ్ఓ మార్గదర్శకాలతో మీ అవసరాలకు అనుగుణంగా సమాచారం తెలుసుకోవాలి. ఈ విషయంపై మీకు ఇంకా ఏమైనా అనుమానాలు ఉంటే ఆర్థిక నిపుణులను సంప్రదించడం మంచిది.

# సేవింగ్స్ ఖాతాల్లోని సొమ్ముతో పెట్టుబడి..

## అదిరే లాభాలు

**విశ్వంభర, బిజినెస్ :** ప్రస్తుతం భారతదేశంలో పెరిగిన అవసరాల నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా అనేది తప్పనిసరిగా మారింది. చాలా మంది పౌరులు కచ్చితంగా సేవింగ్స్ ఖాతాల్లో వేలల్లో సొమ్మును ఏళ్ల తరబడి అలాగే ఉంచుతారు. సాధారణంగా బ్యాంకులు సేవింగ్స్ ఖాతాల్లోని సొమ్ముపై తక్కువ వడ్డీను అందిస్తాయి. కానీ చాలా మంది అవసరానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో పెట్టుబడి పెట్టకుండా కేవలం సేవింగ్స్ ఖాతాల్లోనే సొమ్మును ఉంచేస్తూ ఉంటారు. కొంత మంది పెట్టుబడిపై అవగాహన లేక మరికొంత మంది పెట్టుబడి పెడితే అవసరమైన సమయంలో సొమ్ము చేతికి రాదనే ఉద్దేశంలో పెట్టుబడికి పెద్దగా ఆసక్తి చూపరు. ఈ నేపథ్యంలో మనకు కచ్చితంగా అవసరం ఉన్నప్పుడు చేతికి డబ్బు అందించే కొన్ని పెట్టుబడి పథకాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో సేవింగ్స్ ఖాతాలోని సొమ్మును తెలివిగా ఎలా పెట్టుబడి పెట్టాలో? తెలుసుకుందాం.

### స్వీప్-ఇన్ ఫిక్స్‌డ్ డిపాజిట్

స్వీప్-ఇన్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఆటోమేటిక్‌గా మిగులు నిధులను పొదుపు ఖాతా నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్‌కి బదిలీ చేస్తాయి. లిక్విడిటీని కొనసాగిస్తూ అధిక వడ్డీ రేట్లను అందిస్తాయి. స్వీప్-ఇన్ సదుపాయాన్ని సెటప్ చేయడానికి బ్యాంక్ బ్రాంచ్ ద్వారా లేదా ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా అభ్యర్థించవచ్చు. బ్యాంకు పొదుపు ఖాతాను ఎఫ్‌డీతో లింక్ చేసి పెట్టుబడికి అనుమతి ఇస్తుంది.

### మనీ మార్కెట్ మ్యూచువల్ ఫండ్

మనీ మార్కెట్ మ్యూచువల్ ఫండ్లు స్వల్పకాలిక సాధనాల్లో పెట్టుబడి పెడతాయి. పొదుపు ఖాతాల కంటే అధిక రాబడిని అందిస్తాయి. సులభమైన విత్‌డ్రా ఎంపికలను అందిస్తాయి. ముఖ్యంగా ఆర్థిక సలహాదారుని సూచన మేరకు ఫండ్ వెబ్‌సైట్‌లు లేదా మొబైల్ యాప్‌ల ద్వారా సౌకర్యవంతంగా పెట్టుబడులు పెట్టవచ్చు.

### అల్ట్రా షార్ట్-టర్మ్ డెట్ ఫండ్స్

అల్ట్రా షార్ట్-టర్మ్ డెట్ ఫండ్స్ ఒక సంవత్సరం వరకు మెచ్యూరిటీ ఉన్న ఇన్‌స్ట్రుమెంట్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. పొదుపు ఖాతాల కంటే ఎక్కువ రాబడిని అందిస్తాయి. ఫండ్‌లకు సులభంగా యాక్సెస్ ఉంటుంది. రాబడులు, లిక్విడిటీ మధ్య సమతుల్యతను కోరుకునే ఈ తరహా పెట్టుబడి అనువుగా ఉంటుంది.




### అధిక వడ్డీ పొదుపు ఖాతా

కొన్ని బ్యాంకులు పోటీ రేట్లు, అనియంత్రిత ఉపసంహరణలతో అధిక-వడ్డీ పొదుపు ఖాతాలను అందిస్తాయి. మీ అవసరాలకు బాగా సరిపోయే ఖాతాను కనుగొనడానికి వివిధ బ్యాంకుల నుండి ఆఫర్‌లను సరిపోల్చడం మంచిది.

### రికరింగ్ డిపాజిట్

పొదుపు ఖాతాల కంటే ఎక్కువ వడ్డీని అందిస్తూ నిధులను లిక్విడ్‌గా ఉంచడానికి రికరింగ్ డిపాజిట్లు మిమ్మల్ని క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తాయి. నెలవారీ లేదా త్రైమాసిక ప్రాతిపదికన మీ సేవింగ్స్ ఖాతా నుండి ఆటో డెబిట్‌లను సెటప్ చేయాలి. మీ బ్యాంక్ బ్రాంచ్‌లో లేదా ఆన్‌లైన్‌లో ఆర్‌డీను తెరిచే అవకాశం ఉంది.

# ఈ పథకంలో పెట్టుబడితో లాభాల వరద

**విశ్వంభర, బిజినెస్ :** భారతదేశంలోని చాలా మంది పెట్టుబడిదారులు రిస్క్ లేకుండా నిర్ణీత మొత్తంలో ఆదాయం వచ్చే పథకాల్లో పెట్టుబడికి ఇష్టపడుతూ ఉంటారు. ముఖ్యంగా తాము పెట్టే పెట్టుబడి మంచి లాభాలతో పెట్టుబడికి హామీ ఉండాలని కోరుకుంటూ ఉంటారు ఇలాంటి వారికి నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు పేరుతో ఇండియా పోస్ట్ ప్రభుత్వ మద్దతుతో స్థిర-ఆదాయ పెట్టుబడి పథకాన్ని అందిస్తుంది. సాధారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువగా ఉండే స్థిరమైన రాబడిని కోరుకునే ఎన్ఎస్‌సీ ఉత్తమ ఎంపికగా మారింది. ఎన్ఎస్‌సీపై వడ్డీ రేటు ఆర్థిక మంత్రిత్వ శాఖ ద్వారా త్రైమాసిక అంచనా, పునర్విమర్శకు లోబడి ఉంటుంది. అయితే ప్రభుత్వం ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికం 2024కి ఎన్ఎస్‌సీ రేట్లను యథాతథంగా ఉంచింది. ఎన్ఎస్‌సీపై ప్రభుత్వం 7.7% వడ్డీ రేటును అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఎన్ఎస్‌సీ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. రిస్క్ తీసుకోలేని పెట్టుబడిదారులకు ఎన్ఎస్‌సీలో పెట్టుబడి పెట్టడం ఒక ఆచరణీయ ప్రత్యామ్నాయంగా ఉంటుంది. హామీతో కూడిన ఆదాయాలతో పాటు మూలధన రక్షణను అందిస్తారు. వాటిని సుర క్షితమైన స్వల్పకాలిక పెట్టుబడి ప్రత్యామ్నా యంగా మారుస్తారు. ముఖ్యంగా ఒక పెట్టుబడిదారు సురక్షిత రుణాన్ని ఎంచుకుంటే మె జారిటీ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఎన్ఎస్‌సీ సర్టిఫికేట్‌లను సెక్యూరిటీ డిపాజిట్‌లుగా లేదా కొలేటరల్‌గా అంగీకరిస్తాయి. ఈ సందర్భాల లో రుణాన్ని పంపిణీ చేసే బ్యాంక్ ఈ ప్రమాణపత్రాన్ని బ్యాంక్ లేదా పోస్టాఫీసుకు బదిలీ చేస్తుంది. దానికి బదిలీ స్టాంప్‌ను జత చేస్తుంది. నామినీ/చట్టపరమైన వారసులకు ఖాతాదారుని మరణంపై ఎన్ఎస్‌సీ బదిలీ చేస్తారు. అలాగే జాయింట్ హెూల్డర్లకు ఖాతాదారుని మరణంపై ఎన్ఎస్‌సీ ఖాతాన బదిలీ చేస్తారు. కోర్టు ఆదేశాలపై ఎన్ఎస్‌సీను బదిలీ చేసే అవకాశం ఉంది. ఎన్ఎస్‌సీల్లో పెట్టుబడిపై ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద డిపాజిట్లు పన్ను మినహాయింపుకు అర్హత పొందుతాయి. ఎన్ఎస్‌సీపై మొదటి నాలుగు సంవత్సరాల వడ్డీని కూడా ఎన్ఎస్‌సీ పెట్టుబడి మినహాయింపుగా క్లెయిమ్ చేయవచ్చు. ఎన్ఎస్‌సీలో వడ్డీని తిరిగి పెట్టుబడి పెట్టడమే దీనికి కారణం. మీ పెట్టుబడి వ్యవధి ముగింపులో మొత్తం మెచ్యూరిటీ మొత్తం మీకు చెల్లిస్తారు. ఎన్ఎస్‌సీ రిటర్న్‌లపై ఎలాంటి టీడీఎస్‌లు ఉండవు. అయితే మొత్తానికి సంబంధిత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎన్ఎస్‌సీలో కనీస పెట్టుబడి మొత్తం రూ. 1000గా ఉంటుంది. అలాగే గరిష్ట పెట్టుబడిపై ఎలాంటి పరిమితి లేదు. ఈ పథకం కింద ఎన్ని ఖాతాలనైనా తెరవవచ్చు. డిపాజిట్ చేసిన తేదీ నుంచి ఐదు సంవత్సరాలు పూర్తయిన తర్వాత డిపాజిట్ మెచ్యూర్ అవుతుంది.



# చీరలో చింపేసిన శ్రీలీల



**విశ్వంభర, సినిమా :** తెలుగులో స్టార్ హీరోయిన్ ఎవరంటే అందరు టక్కున శ్రీలీల పేరునే చెబుతారు. సంవత్సర కాలంలో ఆమె నటించిన సినిమాలే దీనికి కారణం. గతేడాది ఆమె నటించిన సినిమాలు గ్యాప్ లేకుండా బాక్సాఫీస్‌పై దాడి చేశాయి. సీనియర్ దర్శకుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో పెళ్లి సంద%ం% సినిమాతో శ్రీలీల హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. శ్రీకాంత్ తనయుడు రోషన్ ఈ సినిమాలో హీరోగా పరిచియం అయ్యాడు. నిన్న అయోధ్య..నేడు బద్రినాథ్ ఎన్నికలో బీజేపీ ఘోర ఓటమి: మతం అంటే చిరాకు పడుతున్న జనం పెళ్లి సంద%ం% సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసింది. ఈ సినిమా తరువాత శ్రీలీల హీరో రవితేజతో జోడీగా ధమాకా సినిమాలో నటించింది. ఈ సినిమా 100 కోట్లు కలెక్ట్ చేయడంతో.. దర్శక-నిర్మాతలందరూ శ్రీలీల వెంట పడ్డారు. శ్రీలీల ఉంటే సినిమా హిట్ అనే అంతలా దర్శక - నిర్మాతలు ఫిక్స్ అయిపోయారంటే ఆమె క్రేజ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తెలుగులో నెంబర్‌వన్ హీరోయిన్ ఆమే! ఈ క్రమంలోనే స్కంద, భగవంత్ కేసరి,వంటి సూపర్ హిట్లను తన ఖాతాలో వేసుకుంది. మహేష్ బాబు 'గుంటూరు కారం, పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' , నితిన్ 'ఎక్స్‌ట్రా-ఆర్డినరీ మ్యాన్', విజయ్ దేవరకొండ కొత్త సినిమాలో కూడా ఛాన్స్ కొట్టేసిన శ్రీలీల..తెలుగులో బిజీ హీరోయిన్‌గా మారింది. ఇదే సమయంలో తమిళంలో కూడా తన సత్తా చాటుతోంది ఈ అమ్మడు. అయితే గత కొంతకాలంగా శ్రీలీల హవా తగ్గిందనే చెప్పాలి. ఆమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఫెయిల్ కావడంతో శ్రీలలకు ఆఫర్లు తగ్గాయి. దీంతో శ్రీలీల ఆఫర్ల కోసం కొత్త దారిని వెతుకుతోన్నట్టు కనిపిస్తోంది. ఇటీవల గ్లామర్ ట్రీట్‌తో అదరగొడుతోంది. తాజాగా ఈ భామ తన అందాలు అరబోసిన ఫొటోలను తన సోషల్ మీడియాలో షేర్ చూసింది. లైట్ బ్లూ కలర్ ట్రాన్స్పరెంట్ శారీతో అభిమానుల ముందుకొచ్చింది. చీర కట్టులో మత్తెక్కించే చూపులతో కుర్రాళ్లను మైమరిపిస్తోంది.

# భారతీయుడు-2తో అంతా మునిగారు




**విశ్వంభర, సినిమా :** భారీ చిత్రాల దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారతీయుడు2 చిత్రం ఈనెల 12న విడుదలైన సంగతి తెలిసిందే. విడుదలైన మొదటిరోజు మొదటి ఆట నుంచే ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ శంకర్ పై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. భారతీయుడు చిత్రం అద్భుతమైన సినిమా అని, అటువంటి సినిమాకు ఉన్న పేరును భారతీయుడు2 చెడగొట్టిందంటూ నిప్పులు చెరుగుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో సినీ ప్రేక్షకులు ఈ సినిమాకు 1, 1.5.. రేటింగ్ ఇస్తున్నారు అంటే వారిని ఈ సినిమా ఎంత హింసకు గురిచేసిందో అర్థం చేసుకోవచ్చు. లాభపడినా పేరు పోయింది ఈ సినిమాకు పారితోషికంతోపాటు లాభాల్లో వాటా తీసుకున్నారు శంకర్. సినిమా పరాజయం పాలైన తర్వాత లాభాలు రావు. నిర్మాతతోపాటు డిస్ట్రిబ్యూటర్లు, బయ్యర్లు.. అందరూ నిండా మునిగిపోయారు. లైకా ప్రొడక్షన్స్ దీన్ని నిర్మించింది. ఈ సినిమా పరాజయంవల్ల కూడా లాభపడిన వ్యక్తి ఒకరే ఉన్నారు. ఆయన ఎవరో కాదు.. విశ్వనటుడు కమల్ హాసన్. ఈ చిత్రం చేసేందుకు ఆయన రూ.75 కోట్ల పారితోషికాన్ని తీసుకున్నారు. ఆయన ఒక్కడే ఈ చిత్రం చేయడంవల్ల లాభపడినప్పటికీ పేరుమాత్రం పోయింది. వాస్తవానికి ఈ సినిమా చేయవద్దని శంకర్ తో కమల్ చెబుతూనే ఉన్నారుకానీ ఆయన మాత్రం వినలేదు. అద్భుతంగా ఆడుతుందని తీశారుకానీ అక్కడే ఒక తప్పు చేశారు. భారతీయుడు3 అని పొడిగించకుండా కథను మొత్తం ఈ సినిమాలోనే చెప్పివుంటే సినిమా మంచి హిట్ అయివుండేదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా ప్రధానమైన పాయింట్ ను మూడోభాగం కోసం ఉంచి హడావిడిగా సినిమాను చాపచుట్టినట్లు చుట్టేసి ప్రేక్షకుల మీదకు వదిలాని, వారు మొహమాటం లేకుండా తిరస్కరించారంటున్నారు. పెట్టిన పెట్టుబడి సంగతి దేవుడెరుగు.. ఖర్చులకైనా డబ్బులు వస్తే చాలు అంటున్నారు. ఈ సినిమా ఫ్లాపైన ప్రభావం తప్పకుండా రామ్ చరణ్ తో తీస్తున్న గేమ్ ఛేంజర్ పై ఉంటుందంటున్నారు.


# లావణ్యకు రూ.5కోట్ల బంఫర్ ఆఫర్?

**విశ్వంభర, సినిమా :** హీరో రాజ్‌తరుణ్-లావణ్య కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ కేసు వెనక్కి తీసుకుంటే తనకు రూ.5 కోట్లు ఇస్తామని కొంత మంది ఆఫర్ ఇచ్చినట్లు తెలిపింది లావణ్య. తాజాగా మళ్లీ మీడియా ముందుకు వచ్చింది లావణ్య. ఈ సందర్భంగా లావణ్య కీలక వ్యాఖ్యలు చేశారు. నా న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తానని.. అసోసియేషన్‌ను వెళ్ళి కలుస్తానని హెచ్చరించారు. రాజ్ తరుణ్ కోసం వీలైతే ఆమరణ దీక్షకు కూడా సిద్ధమని ప్రకటించారు. నేను మొదటి సారి ఫిర్యాదు చేస్తే.. ఫార్మాట్ లో లేదు అన్నారు. రెండో సారి ఆధారాలు అడిగారు. 170 ఫోటోలు, వీడియోలు ఉన్న ఆధారాలతో ఫిర్యాదు చేశానన్నారు. ఒక కాపీ మాత్రం ఇచ్చారు. ఇప్పటికీ రాజ్ తరుణ్ పై ఎలాంటి యాక్షన్ తీసుకోవడం లేదని కేసు వెనక్కి తీసుకోమని ఎవరెవరో నన్ను బెదిరిస్తున్నారు. నాకు ప్రాణహాని ఉందని తెలిపారు. నాకు నా రాజ్ కావాలి.. రాజ్ తరుణ్ నాకు దక్కకపోతే నేను ప్రాణాలతో ఉండను అని వెల్లడించారు. రాజేష్ అనే వ్యక్తి నాకు మెసేజ్ చేశాడని తాను ఒక అడ్వకేట్ ను అని.. నీ కేస్ నేను టేకప్ చేస్తాను అని మెసేజ్ పెట్టాడని వెల్లడించింది లావణ్య.



# సందీప్‌రెడ్డి వంగాకు కౌంటర్ ఇచ్చిన నాగ్ అశ్విన్

**విశ్వంభర, సినిమా :** పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయ కుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన తాజా బ్లాక్ బస్టర్ 'కల్కి' బాక్సాఫీస్ వద్ద తన జైత్రయాత్రను ఇంకా కొనసాగిస్తుంది. తాజాగా ఈ చిత్రం రూ.1000 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయినట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కేవలం 17 రోజుల్లోనే రూ.1000 కోట్ల మార్క్ టచ్ చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రత్యేక పోస్ట్ పెట్టాడు. ఈ మైలురాయి ఈ నెంబర్ (1000 కోట్లు) అనేది నిజానికి మాలాంటి యువ టీమ్ కి చాలా అద్భుతమైన విజయం. కానీ, వాస్తవానికి ఇక్కడ ఎలాంటి రక్తపా తం కానీ, అశ్లీలత, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దోపిడి, గాయపరిచే మాటలు కానీ ఈ సినిమాలో లేవు. అయిన కూడా ఈ ఇటువంటి మైలురాయిని సాధించడమంటే చిన్న విషయం కాదు. ఈ మూవీని ఇంత పెద్ద బ్లాక్ బస్టర్ చేసిన ప్రేక్షకులకు, నటీనటులకు బిగ్ థ్యాం క్యూ. ఇది ఇండియన్ సినిమా. రేపటికోసం అంటూ రాసుకొ చ్చారు. అయితే ఈ పోస్ట్‌పై ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ చర్చలు జరుగుతున్నాయి. నాగ్ అశ్విన్ టాలీవుడ్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఉద్దేశించి ఇలాంటి పోస్ట్ పెట్టాడు అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. గతేడాది సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన యానిమల్ చిత్రం బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. థియేట్రికల్ రన్‌లో ఈ మూవీ రూ.950 కి పైగా గ్రాస్ వసూళ్లు చేసింది. రక్తపాతం కానీ, అశ్లీలత కానీ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేకుండా రూ.1000 కోట్ల సాధించాను అంటూ నాగ్ అశ్విన్ పెట్టడంతో ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది.





## యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండటం

# వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు

**విశ్వంభర, ఫీచర్:** యూరిక్ యాసిడ్ అనేది మానవులలో ప్యూరిన్ల జీర్ణక్రియ యొక్క ఉప ఉత్పత్తి. ఆరోగ్యకరమైన జీవనశైలికి యూరిక్ యాసిడ్ స్థాయిలను సమతుల్యం చేయడం అవసరం. అధిక స్థాయిలో యూరిక్ యాసిడ్ గౌట్ మరియు మూత్రపిండాల్లో రాళ్లకు దారి తీస్తుంది, ఇది మూత్రపిండాల పనితీరును దెబ్బ తీస్తుంది. యూరిక్ యాసిడ్ బాడీలో ఎక్కువగా ఉన్న సమస్యే, అలా అని తక్కువగా ఉన్నా సమస్యే. ఇవి సమపాళ్లలో ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడు. తక్కువ యూరిక్ యాసిడ్ స్థాయిలు విల్సన్ వ్యాధికి దారి తీయవచ్చు. ఇది ఫ్యాన్‌కోని సింద్రోమ్‌కు దారి తీస్తుంది, ఇది శరీరంలో రాగి పేరుకుపోవడానికి లేదా కిడ్నీ ట్యూబ్ డిజార్డర్‌కు దారితీసే పరిస్థితి. యూరిక్ యాసిడ్ రక్తంలో కరిగి మూత్రపిండాలకు చేరు కుంటుంది, అక్కడ అది మూత్రంలో విసర్జించబడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిలను సమతుల్యంగా ఉంచడం చాలా ముఖ్యం. సాధారణ రక్త యూరిక్ యాసిడ్ స్థాయిలు స్త్రీలకు 2.5-6 mg/dL మరియు పురుషులకు 3.4-7 mg/100ml, బయోకెమిస్ట్రీ మరియు క్లినికల్ బయోకెమిస్ట్రీలో ప్రోటోకాల్స్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం..వివిధ వైద్య పరిస్థితులను గుర్తించడానికి యూరిక్ యాసిడ్ పరీక్ష అవసరం. యూరిక్ యాసిడ్ అధిక స్థాయిలు గౌట్‌కు దారితీస్తాయి. కీళ్ల నొప్పులు, కీళ్లలో వాపులు ఎక్కువగా ఉండటం ఆర్థరైటిస్ లక్షణాలు. దీనికి విరుద్ధంగా, తక్కువ యూరిక్



యాసిడ్ స్థాయిలు తక్కువగా ఉన్నప్పటికీ, సమస్యాత్మకం. విల్సన్స్ వ్యాధి లేదా ఫాంకోని సింద్రోమ్ వంటి సమస్యలను కలిగించవచ్చు. కాలి బొటనవేలులో విపరీతమైన నొప్పి, కీళ్లలో వాపు మరియు ఎర్రగా మారడం, తీవ్రమైన వెన్నునొప్పి, మూత్రంలో రక్తం, ఎక్కువ మూత్రం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దాదాపు 43.3 మిలియన్ల అమెరికన్లు హైపర్యూరిసెమియాతో బాధపడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలను సీరం యూరిక్ యాసిడ్ పరీక్ష, యూరిన్ యూరిక్ యాసిడ్ పరీక్ష మరియు జాయింట్ ఫ్లూయిడ్ టెస్ట్ ద్వారా తనిఖీ చేయవచ్చు. షుగర్ పేషెంట్స్ ఎప్పుడూ షుగర్ టెస్ట్ చేయించుకున్నా, యూరిక్ యాసిడ్ పరీక్ష కూడా చేయించుకోవాలి.

# వర్షాకాలంలో కాంటాక్ట్ లెన్సులు వేసుకోవచ్చా..?

**విశ్వంభర, ఫీచర్:** రుతుపవనాలలో అనేక వైరస్‌లు, బ్యాక్టీరియా మరియు ఇతర ఇన్‌ఫెక్షన్‌లకు గురయ్యే ప్రమాదం ఇతర సీజన్‌ల కంటే ఎక్కువ ఉంటుంది. గాలిలోని తేమ మరింత హానికరమైన బ్యాక్టీరియాను వ్యాపింపజేస్తుంది కాబట్టి ఈ సీజన్‌లో కాంటాక్ట్ లెన్స్‌లు ధరించడం సరైందేమో ఇక్కడ తెలుసుకోండివర్షాకాలంలో మన చర్మం మరియు కళ్ళు ఎక్కువగా ఇన్ఫెక్షన్లకు గురవుతాయి. కాబట్టి దీనిని నివారించడం చాలా ముఖ్యం. వర్షంలో తేమ, నీరు కారణంగా అద్దాలు పెట్టుకోవడం కొంత మందికి ఇబ్బందిగా ఉంటుంది. ఈ కారణంగా వారు అద్దాలకు బదులుగా కాంటాక్ట్ లెన్స్‌లను ధరించడానికి ఇష్టపడతారు. మరియు చాలా మంది వ్యక్తులు కాంటాక్ట్ లెన్స్‌లను హాబీగా మాత్రమే ఉపయోగి స్తున్నారు. కానీ వర్షంలో కాంటాక్ట్ లెన్స్‌లు ధరించడం వల్ల కంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని వారికి తెలియదు. మీరు వర్షంలో కాంటాక్ట్ లెన్స్‌లు ధరించినట్లయితే మీరు కూడా జాగ్రత్తగా ఉండాలి. మీ కళ్లను అస్సలు తేలికగా తీసుకోకండి. వర్షాకాలంలో అంటువ్యాధులు మన చేతుల నుంచి కళ్లకు సులభంగా వ్యాపిస్తాయి. అప్పుడు వర్షాకాలంలో లెన్స్‌లు ధరించడం వల్ల ఈ సమస్య వస్తుంది.



### కంటి ఇన్ఫెక్షన్

వర్షాకాలంలో అనేక వైరస్‌లు, బ్యాక్టీరియా మరియు ఇతర ఇన్‌ఫెక్షన్‌లకు గురయ్యే ప్రమాదం ఇతర సీజన్‌ల కంటే రెట్టింపు. గాలిలో తేమ మరింత హానికరమైన బ్యా క్టీరియాను ఉత్పత్తి చేస్తుంది, ఇది అనేక అనారోగ్యాలకు కారణమవుతుంది. వర్షంలో కాంటాక్ట్ లెన్సులు వాడితే కంటి ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. నీరు కాంటాక్ట్ లెన్స్ లోపలికి చేరి, అది రియాక్ట్ అయ్యేలా చేస్తుంది.

### కళ్ళు ఎర్రబడటం

వర్షాకాలంలో చాలా వరకు బ్యాక్టీరియా గాలిలో ఉం టుంది కాబట్టి మీరు మీ చేతులకు లెన్స్‌లు ధరించినట్ల యితే, అది మీ చేతుల నుండి మీ కళ్ళలోకి ప్రవేశిస్తుంది, దీని వలన మీ కళ్ళు చికాకుగా లేదా ఎర్రగా మారవచ్చు.

### కళ్లలో పుండ్లు పడడం, నీరు కారడం

వర్షాకాలంలో కళ్లు నొప్పులు రావడం సర్వసాధారణం. ఇది తీవ్రమైన దీర్ఘకాలికంగా ఉంటుంది. మీరు కాంటాక్ట్ లెన్స్‌లు ధరించినప్పుడు, మీరు చికాకు, నొప్పి మరియు కళ్ళలో నీరు కారడం వంటివి అనుభవించవచ్చు.

### కళ్ళు దురద

మన చర్మం, నోరు మరియు ముక్కుపై ఉండే సాధారణ బ్యాక్టీరియా సాధారణంగా ప్రమాదకరం కాదు. కానీ మీ కాంటాక్ట్ లెన్స్‌లపై వాటి చేరడం ప్రమాదకరమని నిరూపించవచ్చు. దీని కారణంగా, మీ కంటిపై చిన్న గీత కూడా పెద్ద సమస్యను కలిగిస్తుంది

### కండ్ల కలక

వర్షాకాలంలో కండ్లకలక లేదా పింక్ ఐ సర్వసాధారణం. ఇది తీవ్రమైన లేదా దీర్ఘకాలికంగా ఉంటుంది. మీరు కాంటాక్ట్ లెన్సులు ధరించినప్పుడు, మీకు కండ్లకలక వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇది రెండు వారాల్లో దానంతట అదే మెరుగుపడుతుంది. కానీ చాలా మందిలో, కండ్లకలక తక్షణ చికిత్స అవసరమయ్యే తీవ్ర మైన కంటి లక్షణాలను కలిగిస్తుంది. కాబట్టి వర్షాకా లంలో లెన్స్‌లు ధరించడం మానేయాలి. ముఖ్యంగా అభి రుచి కోసం మాత్రమే ధరించే వ్యక్తులు ఈ సీజన్‌లో తగినంత దుస్తులు ధరించరు. కాంటాక్ట్ లెన్స్‌లు ధరించాల్సిన పరిస్థితి ఉన్నవారికి, కళ్ల ముందు ఉన్న ప్రాంతం చాలా సున్నితంగా ఉంటుంది, కాబట్టి మీ చేతులను తరచుగా కడుక్కోండి మరియు మురికి చేతులతో కళ్ల ముందు ఉన్న ప్రదేశాన్ని తాకవద్దు, మీరు కూడా సంప్రదించవచ్చు వైద్యుడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com